www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 15-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 180

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 12.19 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 10.08 తదుపరి ఉత్తరాభాద్ర
వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.8.31-9.17, రా.9.53-10.41; అమృతఘడియలు: మ.2.59-4.25; రాహుకాలం: ఉ.3.00-4.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.49

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మేం ఇక్కడే ఉంటాం!

మళ్లీ క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్‌లు

డీవోపీటీ జారీ చేసిన ఉత్తర్వులు సవాల్


తెలంగాణలోనే ఉంటామన్న ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రొనాల్డ్‌రోస్

ఏపీలోనే ఉంటానంటూ సృజన పిటిషన్లు

నేడు విచారణ.. క్యాట్ నిర్ణయంపై ఉత్కంఠ

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర విభజన సందర్భంగా చేపట్టిన క్యాడర్ కేటాయింపుల ప్రకారం.. ఏపీ, తెలంగాణకు కేటాయించిన అధికారులు ఆయా రాష్ట్రాలకు వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. ఏ రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అదే రాష్ట్రానికి వెళ్లాలంటూ ఈ నెల 9న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన రిలీవింగ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలువురు ఐఏఎస్ అధికారులు మళ్లీ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) హైదరాబాద్‌ను

మిగతా 15వ పేజీలో...



ఫాక్స్‌కాన్ కంపెనీలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు, ఆ సంస్థ ప్రతినిధులు

మరిన్ని విభాగాల్లో
పెట్టుబడులు పెట్టండి

ఫోర్త్ సిటీలోనూ భూమి కేటాయిస్తాం.. ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో సీఎం రేవంత్‌రెడ్డి

కంపెనీ విస్తరణకు సహకరిస్తామని హామీ.. మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి కొంగరకలాన్‌లోని ఫ్యాక్టరీ సందర్శన

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే కంపెనీలకు తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కరలేదన్నారు. సోమవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ (ఎఫ్ఐటీ) కంపెనీని ముఖ్యమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కంపెనీ పురోగతి, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో అన్ని విధాలుగా సహకరిస్తామని మరోసారి భరోసా ఇచ్చారు. కంపెనీ విస్తరణలో భాగంగా తెలంగాణలో మరిన్ని విభాగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా యాంగ్ లియూను

మిగతా 15వ పేజీలో...

నేవీ రాడార్ స్టేషన్‌కు నేడు శంకుస్థాపన

వికారాబాద్ దామగుండంలో ఏర్పాట్లు

పాల్గొననున్న రాజ్‌నాథ్, రేవంత్ 15

రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు సిబ్బంది

తక్షణమే కేటాయించాలని సీఎం ఆదేశం



ఆగు జర!

రపామైసిన్ ఔషధంతో వృద్ధాప్యానికి అడ్డుకట్ట?

పెరిగిన ఎలుకల జీవితకాలం..

అమెరికా కుబేరుడు బ్రయాన్ జాన్సన్ వాడుతున్నదీ ఇదే!

దుష్ప్రభావాలూ ఉంటాయి.. 6

ప్రయోగాలు జరగాలి: వైద్యులు



రాబిన్సన్, అసెమోగ్లు, జాన్సన్

అసమానతలపై పరిశోధనకు.. ఆర్థిక నోబెల్ 2

అమెరికన్లు అసెమోగ్లు, జాన్సన్, రాబిన్సన్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం

దేశాల సంపద తేడాపై అధ్యయనం



నదుల దురాక్రమణను ఎలా అరికడుతున్నారు?

పర్యావరణ క్షీణత నుంచి కాపాడేందుకు చర్యలేంటి? 2

కేంద్ర సంస్థలకు సుప్రీం నోటీసు

74 టీఎంసీలు కేటాయించలేం!

గోదావరి-కావేరి తొలి దశలో కష్టం

రెండో దశలోనే నీటి లభ్యత అధికం

తెలంగాణకు తేల్చిచెప్పిన కేంద్రం 15

దౌత్య యుద్ధం!

కెనడాపై భారత్ తీవ్ర ఆగ్రహం.. అక్కడి దౌత్యవేత్తల ఉపసంహరణ

ఆరుగురు ఆ దేశ దౌత్యవేత్తల బహిష్కరణ.. 19లోగా వెళ్లిపొమ్మని ఆదేశం



విదేశాంగ కార్యాలయం నుంచి బయటకొస్తున్న కెనడా డిప్యూటీ హైకమిషనర్ స్టీవర్ట్ వీలర్

ఖలిస్థానీ నిజ్జర్ హత్య కేసు ప్రకంపనలు

అనుమానితులుగా మన దౌత్యవేత్తలు

వారిని విచారించాల్సి ఉందన్న కెనడా

ఘాటుగా స్పందించిన భారత్

ట్రూడో వైఖరిపై మండిపాటు

న్యూఢిల్లీ, అక్టోబరు 14: భారత వేర్పాటువాద శక్తులకు ఊతమిస్తూ, ఖలిస్థానీలకు అండగా నిలుస్తున్న కెనడా సర్కారు మరోసారి కయ్యానికి కాలు దువ్వింది. 2023లో జరిగిన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్ సహా పలువురు దౌత్యవేత్తలను అనుమానితులుగా (పర్సన్స్ ఆఫ్ ఇంట్రస్ట్) పేర్కొంది. వీరిని విచారించాల్సి ఉందంటూ భారత విదేశాంగ శాఖకు సమాచారం పంపింది. దీనిపై భారత్ తీవ్ర స్థాయిలో స్పందించింది. భారత దౌత్యవేత్తలపై చేసిన కల్పిత ఆరోపణలకు తగిన విధంగా జవాబు చెప్పే హక్కు తమకు ఉందని స్పష్టం చేసింది. సోమవారం కెనడా నుంచి భారత హైకమిషనర్‌తో సహా ఆరుగురు దౌత్య సిబ్బందిని ఉపసంహరించుకుంది. భారత్‌లో ఉన్న ఆరుగురు కెనడా దౌత్య

మిగతా 2వ పేజీలో...

హైదరాబాద్‌లో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారు

కొత్త ఇళ్లు ఇవ్వకపోగా ఉన్నవి పడగొడుతున్నారు

బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ అస్తవ్యస్త పాలన

14 వరంగల్ పర్యటనలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మానవతా మూర్తి..
మరిక సెలవు



సాయిబాబాకు నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్

ప్రొఫెసర్ సాయిబాబాకు కన్నీటి వీడ్కోలు

వేలాది మందితో జవహర్‌నగర్ జన సంద్రం

గన్‌పార్క్‌లో నివాళులకు అనుమతి నిరాకరణ

భౌతికకాయం.. గాంధీ మెడికల్ కాలేజీకి

హైదరాబాద్ సిటీ/మల్కాజిగిరి/మంగళ్‌హాట్/అడ్డగుట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల ఉద్యమ నేత, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబాకు పౌర సమాజం కన్నీటి వీడ్కోలు పలికింది. ప్రజా సంఘాలు, పౌర హక్కుల నేతలు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, జర్నలిస్టులు, మేధావులు తదితర రంగాల ప్రముఖులు ఆయన భౌతిక కాయానికి కడసారిగా నివాళులర్పించారు. ప్రొఫెసర్ సాయిబాబా భౌతిక కాయాన్ని సోమవారం ఉదయం 8 గంటలకు నిమ్స్ ఆస్పత్రి నుంచి

మిగతా 3వ పేజీలో...

బిష్ణోయ్.. నయా మాఫియా డాన్!

» 700 మంది షూటర్లు.. 5 రాష్ట్రాల్లో హల్‌చల్

» కెనడా సహా పలు దేశాల్లోనూ కార్యకలాపాలు!

» మూసేవాలా హత్యతో ఉత్తరాదిన సంచలనం

» సబర్మతి జైల్లో లారెన్స్.. అక్కడినుంచే హవా



న్యూఢిల్లీ, ముంబై, అక్టోబరు 14: వయసు 30 మాత్రమే.. కానీ, అంతే సంఖ్యలో కేసులు..! హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, ఆయుధాల రవాణా కిడ్నాప్‌లు.. ఒకటేమిటి అనేక నేరాలు..! ఎప్పుడంటే అప్పుడు స్పందించేలా 700 మంది షూటర్లతో గ్యాంగ్.. జైలు నుంచే కార్యకలాపాలు..! ఇప్పుడు అతడి పేరు చెబితే ఉత్తరాదిలోని ఐదు రాష్ట్రాల్లో వణుకు..! ఇదీ లారెన్స్ బిష్ణోయ్ నేర సామ్రాజ్యం. బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌పై గురిపెట్టి.. పంజాబీ గాయకుడు సిద్దూ మూసేవాలా.. మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్యతో మరింతగా చర్చనీయాంశమయ్యాడు. ఇంతకూ ఎవరీ లారెన్స్ బిష్ణోయ్ అంటే..?

కానిస్టేబుల్ కుమారుడు..

లారెన్స్ బిష్ణోయ్ 1993లో పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా ధత్తరన్‌వాలిలో పుట్టాడు. ఇతడి తండ్రి హరియాణా పోలీస్ కానిస్టేబుల్. కృష్ణ జింకలను అమితంగా ఆరాధించే బిష్ణోయ్ వర్గానికి చెందిన లారెన్స్ చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో చదివే సమయంలో విద్యార్థి నాయకుడు. ఇదే క్రమంలో గోల్డీ బ్రార్ పరిచయమై నేర సామ్రాజ్యంలోకి అడుగుపెట్టాడు. కాలేజీ గ్యాంగ్ వార్‌లో తన స్నేహితురాలిని సజీవ దహనం చేయడం.. లారెన్స్‌లో తీవ్ర కసిని పెంచింది. రాజస్థాన్‌లో కృష్ణ జింకలను చంపిన కేసులో నిందితుడైన సల్మాన్‌ఖాన్‌ను హత్య చేసేందుకు ప్రణాళిక వేయడం ద్వారా లారెన్స్ వార్తల్లోకెక్కాడు. ఇతడి గ్యాంగ్ కార్యకలాపాలు పంజాబ్, ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లకు విస్తరించాయి. ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతి జైల్లో ఉన్న లారెన్స్.. ఇతర ఖైదీల ద్వారా సెల్‌ఫోన్లు సంపాదిస్తూ తమ గ్యాంగ్‌కు ఆదేశాలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సమాజంలో పేరున్న, డబ్బున్నవారిని, పంజాబీ గాయకులు, మద్యం వ్యాపారులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారు. లారెన్స్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్, గోల్డీ బ్రార్‌లు కెనడాలో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్నారు. లారెన్స్‌ను హత్య చేసేందుకు ఢిల్లీ మాఫియా తీవ్రంగా ప్రయత్నిస్తుండడంతో అతడిని కోర్టులకు గట్టి భద్రత మధ్య తరలించాల్సి వస్తోంది. కాగా, బాబా సిద్దిఖీనే కాక ఆయన కుమారుడు జీషన్ సిద్దిఖీ కూడా బిష్ణోయ్ గ్యాంగ్ హిట్ లిస్ట్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాబా హత్య కేసులో పట్టుబడిన నిందితులు ఈ విషయం వెల్లడించారన్నారు.

ఫోన్‌పే టపాసుల బీమా పాలసీ

రూ.9 ప్రీమియంతో రూ.25వేల వరకు కవరేజీ

న్యూఢిల్లీ, అక్టోబరు 14: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా సంబంధిత ప్రమాదాలు జరిగితే బీమా రక్షణ కల్పించేందుకు వీలుగా డిజిటల్ చెల్లింపుల దిగ్గజం ఫోన్‌పే సరికొత్త ఫైర్‌క్రాకర్ బీమా పాలసీని తెచ్చింది. ఈ ప్లాన్ కింద వినియోగదారులు రూ.9 ప్రీమియం చెల్లించి రూ.25వేల వరకు బీమా కవరేజీని పొందవచ్చని సోమవారం కంపెనీ పేర్కొంది. ఈ నెల 25వ తేదీ నుంచి 10 రోజుల పాటు కవరేజీని పొందవచ్చని తెలిపింది. టపాసుల సంబంధిత ప్రమాదాల నుంచి ఈ పాలసీ రక్షణ కల్పిస్తుందని పేర్కొంది. ఫోన్‌పే యాప్ ద్వారా ఈ పాలసీని కొనుగోలు చేయవచ్చు. వినియోగదారుతోపాటు భాగస్వామి, ఇద్దరు పిల్లలకు కూడా సమగ్ర కుటుంబ కవరేజీని అందిస్తోంది. అక్టోబరు 25 తర్వాత పాలసీని కొనుగోలు చేస్తే కొన్ని రోజు నుంచి పాలసీ కవరేజీ ప్రారంభమవుతుందని ఫోన్‌పే పేర్కొంది. బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్‌తో కలిసి ఈ బీమా పథకాన్ని ఫోన్‌పే తీసుకొచ్చింది.

లోకం తీరు



ఇస్రో చైర్మన్‌కు 'ఐఏఎఫ్ వరల్డ్ స్పేస్ అవార్డు'

» చంద్రయాన్-3 విజయానికి గుర్తింపు



న్యూఢిల్లీ, అక్టోబరు 14: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మక 'ఐఏఎఫ్ వరల్డ్ స్పేస్ అవార్డు-2024'ను ఆయన సోమవారం అందుకున్నారు. గత ఏడాది చంద్రయాన్-3 మిషన్ ద్వారా ఇస్రో సాధించిన విజయానికి గుర్తుగా అంతర్జాతీయ ఆస్ట్రోనాటికల్ ఫెడరేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ కార్యక్రమం ఇటలీలోని మిలాన్ నగరంలో జరిగింది. ఈ అవార్డు అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశ కీలక భాగస్వామ్యాన్ని చెబుతోందని ఇస్రో సోషల్ మీడియాలో పేర్కొంది. చంద్రయాన్-3 ద్వారా ఇస్రో సాధించిన విజయంపై ఐఏఎఫ్ ప్రశంసలు కురిపించింది. ఈ విషన్ శాస్త్రీయ ఉత్సుకత, వ్యయ-సమర్థవంతమైన ఇంజనీరింగ్ సమ్మేళనానికి ఉదాహరణగా నిలిచిందని పేర్కొంది. మొదటిసారి చంద్రుని దక్షిణ ధ్రువం సమీపంలో కాలుమోపి చంద్రయాన్-3 చారిత్రక విజయం సాధించిందని, అంతర్జాతీయ స్థాయిలో ఆకాంక్ష, సాంకేతికత నైపుణ్యం రెండింటినీ ప్రదర్శించిందని తెలిపింది.

వక్ఫ్ బిల్లు జేపీసీ భేటీ.. ప్రతిపక్షాల బహిష్కరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుపై సోమవారం జరిగిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) సమావేశాన్ని ప్రతిపక్ష ఎంపీలు బహిష్కరించారు. ఈ కమిటీ నిబంధనలకు అనుగుణంగా పనిచేయడం లేదని వారు ఆరోపించారు. కమిటీ చైర్మన్, బీజేపీ ఎంపీ జగదంబికా పాల్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. తమ వాదనలు వినిపించేందుకు అవకాశం కల్పించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ బిల్లుతో సంబంధం లేని అంశాలపై కర్ణాటక మైనారిటీస్ కమిషన్ మాజీ చైర్మన్ అన్వర్ మనిప్పడి తన ప్రజంటేషన్ ఇచ్చేందుకు జేపీసీ చైర్మన్ అనుమతించడంపై విపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను విమర్శించేందుకు అన్వర్ ఈ అవకాశాన్ని వాడుకున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ ఎంపీ లావు కృష్ణ దేవరాయలు, బీజేపీ ఎంపీ డి.కె. అరుణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

యూపీలోని బహ్రాయిచ్‌లో తీవ్ర ఉద్రిక్తత

లఖ్‌నవూ, అక్టోబరు 14: దుర్గామాత నిమజ్జనం సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్ జిల్లాలో ఆదివారం జరిగిన మతపరమైన గొడవలో ఓ యువకుడు చనిపోయిన ఘటన సోమవారం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. మన్సూర్ గ్రామంలో ఓ వర్గానికి చెందిన వందలాది మంది కర్రలు, ఇనుపరాడ్లు చేతబట్టుకొని వీరంగం సృష్టించారు. షాపులను ధ్వంసం చేశారు. ఓ ఆస్పత్రికి నిప్పు పెట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు లాఠీచార్జి చేశారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. స్థానికంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. 30మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం దుర్గామాత నిమజ్జనం సందర్భంగా డీజే పాటలకు సంబంధించి ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. రెండు వర్గాల వాళ్లు ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో ఓ వర్గం వారు కాల్పులు జరగ్గా అవతలి వర్గంలో వ్యక్తి చనిపోయాడు.

కర్ణాటక సీఎం సిద్ధూపై గవర్నర్‌కు మరో ఫిర్యాదు

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ముడా వివాదంలో నిండా మునిగిన కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు మరో షాక్ తగిలింది. అర్కావతి లే అవుట్‌లో ఇంటి స్థలాల పంపిణీలో అధికార దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ గవర్నర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. సీఎం సిద్దరామయ్య, బీడీఏ కమిషనర్, బీడీఏ అధికారులకు వ్యతిరేకంగా అర్కావతి లే అవుట్ లబ్ధిదారులు శివలింగప్ప, వెంకటకృష్ణప్ప, రామచంద్రయ్య, రాజశేఖర్ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అర్కావతి లే అవుట్‌లో కేటాయించిన భూములు భూకబ్జాదారులపాలవుతున్నాయని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు ముడా వివాదంలో స్నేహమయి కృష్ణ లోకాయుక్త అధికారులకు సోమవారం మరింత సమాచారం ఇచ్చారు.

పాక్ ప్రధాని విందుకు హాజరుకానున్న జైశంకర్

న్యూఢిల్లీ, అక్టోబరు 14: దాదాపు పదేళ్ల విరామం తరువాత భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మంగళవారం నుంచి రెండు రోజుల పాటు పాకిస్థాన్‌లో పర్యటించనున్నారు. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు పాక్‌కు వెళ్తున్న జైశంకర్ ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇచ్చే విందుకు హాజరయ్యే అవకాశముందని తెలుస్తోంది. ఈ సమావేశం సందర్భంగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగే అవకాశాలులేవని ఇప్పటికే ఇరుదేశాలు తేల్చిచెప్పాయి. అయితే విందు సందర్భంగా ప్రధాని షరీఫ్, పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్‌తో జైశంకర్ రెండు దేశాల సంబంధాల గురించి ప్రస్తావించే అవకాశముంది.

మూడు విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, అక్టోబరు 14: ముంబయి నుంచి బయలుదేరే మూడు అంతర్జాతీయ విమానాలకు సోమవారం బాంబు బెదిరింపు రావడంతో భద్రతాపరమైన తనిఖీలు చేయాల్సి వచ్చింది. అయితే ఆ తనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. వీటిలో న్యూయార్క్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానాన్ని ఢిల్లీకి మళ్లించారు. సోమవారం తెల్లవారుజామున 239 మంది ప్రయాణికులు, 19 మంది సిబ్బందితో ఈ విమానం న్యూయార్క్ బయలుదేరిందని అధికారులు తెలిపారు. ముంబయి నుంచి బయలుదేరే మరో రెండు ఇండిగో విమానాలకు కూడా సోమవారం బాంబు బెదిరింపు వచ్చింది. వాటిలో ఒకటి మస్కట్, మరొకటి జెడ్డా వెళ్లాల్సి ఉంది. అయితే ఈ రెండు విమానాలకు టేకాఫ్ అవ్వకముందే బెదిరింపు రావడంతో వాటిని ఐసోలేషన్ బేకి తరలించారు.

కోల్‌కతా జూనియర్ డాక్టర్లకు ఐఎంఏ మద్దతు

న్యూఢిల్లీ, అక్టోబరు14: కోల్‌కతా హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేస్తున్న పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్లకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) మద్దతు ప్రకటించింది. కోల్‌కతా ఆర్ జి కర్ మెడికల్ కాలేజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా అక్కడ జూనియర్ డాక్టర్లు గత తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. 'కోల్‌కతా జూనియర్ డాక్టర్లకు సంఘీభావంగా మంగళవారం దేశవ్యాప్తంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జూనియర్ డాక్టర్లందరూ నిరాహార దీక్ష చేయాలి', అని ఐఎంఏ పిలుపునిచ్చింది.

డిజిటల్ అరెస్టు ముఠా గుట్టు రట్టు

అహ్మదాబాద్, అక్టోబరు 14: దేశవ్యాప్తంగా 'డిజిటల్ అరెస్టు' పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న కేటుగాళ్ల ముఠా గుట్టును గుజరాత్‌పోలీసులు రట్టు చేశారు. నలుగురు తైవానీయులతో సహా 17 మందిని అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ బ్రాంచ్ అరెస్టు చేసిందని పోలీసు ఉన్నతాధికారులు సోమవారం వెల్లడించారు. నిందితుల నుంచి రూ.12.75 లక్షల నగదు, 761 సిమ్‌కార్డులు, 120 మొబైల్ ఫోన్లు, 42 బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేటుగాళ్లు దాదాపు వెయ్యి మందిని లక్ష్యంగా చేసుకొని ఉంటారని అధికారులు భావిస్తున్నారు. అరెస్టు చేసిన వారిలో నలుగురు తైవానీయులు. మిగతా 13 మంది గుజరాత్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఒడిశా, రాజస్థాన్‌కు చెందిన వాళ్లు ఉన్నారు.

దౌత్య యుద్ధం!

(మొదటి పేజీ తరువాయి)



సిబ్బందిని భారత్ నుంచి 'బహిష్కరించింది'. "కెనడా ప్రభుత్వంపై మాకు విశ్వాసం లేదు. మా హైకమిషనర్, దౌత్య, ఉన్నతాధికారుల భద్రత విషయంలో భరోసా లేకుండా పోయింది. తీవ్రవాదం, హింసాత్మక వాతావరణంలో ట్రూడో ప్రభుత్వ చర్యలు వారి భద్రతను ప్రమాదంలోకి నెట్టాయి. అందుకే భారత హైకమిషనర్, దౌత్య, ఉన్నతాధికారులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించాం" అని భారత్‌లో కెనడా హైకమిషనర్ (ఇన్‌చార్జి) స్టీవార్ట్ వీలర్‌కు విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. వీలర్‌తోపాటు ఆరుగురు కెనడా దౌత్య సిబ్బందిని భారత్ నుంచి బహిష్కరించింది. వీరు ఈనెల 19వ తేదీలోపు భారత్‌ను వీడి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. 1988 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ కుమార్ వర్మ.. 2022 సెప్టెంబరు నుంచి కెనడాలో భారత హైకమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయనపై కెనడా ఆరోపణలు చేయడాన్ని భారత్ ఖండించింది. ఆయన ఎలాంటి వారో తమకు తెలుసునని, 36 సంవత్సరాలుగా ఆయన వివిధ దేశాల్లో భారత దౌత్యవేత్తగా పనిచేస్తున్నారని తెలిపింది. కెనడా ప్రధాని ట్రూడో కేవలం రాజకీయ లబ్ధి కోసం భారత వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి, వేర్పాటువాదులకు కొమ్ము కాస్తున్నారని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. "భారత్‌పై ట్రూడో శత్రుత్వం ఇప్పటిదికాదు. దీనికి ఎన్నో ఆధారాలు ఉన్నాయి" అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. "ట్రూడో మంత్రివర్గంలో కొందరికి తీవ్రవాదులు, భారతదేశ విభజన కోరుకునే వారితో నేరుగా సంబంధాలున్నాయి. 2018 నుంచి ట్రూడో భారత్‌తో ఘర్షణాత్మక వైఖరినే ప్రదర్శిస్తున్నారు. 2020 డిసెంబరులో భారత అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం ద్వారా ఆయన నిజస్వరూపం బయటపడింది" అని విదేశాంగ శాఖ నిప్పులు చెరిగింది. భారత వ్యవహారాల్లో విదేశీ జోక్యంపై ట్రూడోను విచారణ కమిషన్ నిలదీయనున్న నేపథ్యంలోనే ఈ ఎజెండాను అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు, క్షీణిస్తున్న భారత్- కెనడా దౌత్య సంబంధాల విషయంలో ప్రధాని మోదీ ప్రతిపక్షాల సలహాలనూ పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది. ఉభయ దేశాల మధ్య ఎంతో సున్నితమైన ఈ వ్యవహారంపై పార్లమెంట్ ఉభయ సభల ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, ఖర్గేతో పాటు ఇతర పార్టీల నేతలపై ప్రధాని మోదీ విశ్వాసం ఉంచి వారి నుంచి సలహాలు తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది.

తిరుగులేని సాక్ష్యాలున్నాయి: వీలర్

భారత ప్రభుత్వ ఏజెంట్లకు, కెనడా గడ్డపై జరిగిన కెనడా పౌరుడి (నిజ్జర్) హత్యకు మధ్య ఉన్న సంబంధాలపై తిరుగులేని సాక్ష్యాలు ఉన్నాయని కెనడా దౌత్యవేత్త వీలర్ తెలిపారు. అయితే.. భారత్ చెబుతున్నట్లు అన్ని ఆరోపణలపైనా దృష్టి పెట్టాలని అన్నారు. భారత్‌తో సహకరించేందుకు కెనడా సిద్ధంగా ఉందని తెలిపారు.

ఆర్థిక అసమానతలపై పరిశోధనకు నోబెల్

ముగ్గురు అమెరికన్లను వరించిన పురస్కారం

అసిమోగ్లు, జాన్సన్, రాబిన్సన్‌కు ఆర్థిక నోబెల్

స్టాక్‌హోం, అక్టోబరు 14: ఆర్థిక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం ఈ ఏడాది ముగ్గురిని వరించింది. సంపద విషయంలో దేశాల మధ్య అసమానతలపై చేసిన పరిశోధనలకుగానూ అమెరికాకు చెందిన ఆర్థికవేత్తలు డారోన్ అసిమోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఏ రాబిన్సన్‌లను నోబెల్ బహుమతికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ సోమవారం ప్రకటించింది. వారికి పురస్కారంతోపాటు రూ.8.90 కోట్లు ప్రైజ్‌మనీ దక్కనుంది. ఒక దేశం ఆర్థికంగా ఎదగాలంటే సంస్థల ఏర్పాటు ప్రాముఖ్యతను అసిమోగ్లు, జాన్సన్, రాబిన్సన్.. తమ పరిశోధనల్లో నొక్కిచెప్పారు. కొన్ని దేశాలు ఆర్థికంగా ఎందుకు విజయం సాధిస్తున్నాయి, కొన్ని దేశాలు ఎందుకు విఫలమవుతున్నాయి అనే అంశాలను విశదీకరించారు. "పేలవమైన చట్టపాలన కలిగిన సమాజాలు, జనాభాను దోపిడీ చేసే సంస్థలు.. వృద్ధిని కానీ, సమాజంలో మార్పును కానీ సృష్టించలేవని ఎందుకు చెబుతారో.. అవార్డు గ్రహీతల పరిశోధన ద్వారా అర్థం చేసుకోవచ్చు' అని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన నోబెల్ కమిటీ వెల్లడించింది. డారోన్ అసిమోగ్లు, సైమన్ జాన్సన్.. అమెరికాలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పనిచేస్తుండగా.. రాబిన్సన్ చికాగో యూనివర్సిటీలో పరిశోధనలు చేస్తున్నారు. 'దేశాల మధ్య ఆదాయాల్లో భారీ వ్యత్యాసాలను తగ్గించడం ప్రస్తుతం మన ముందున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. ఒక దేశం ఆర్థికంగా ఎదగాలంటే సామాజిక సంస్థల పాత్ర ఎంతో కీలకమని అవార్డు గ్రహీతలు తెలియజేశారు' అని స్వీడిష్ అకాడమీ ఎకనామిక్ సైన్సెస్ కమిటీ చైర్మన్ జాకబ్ స్వెన్సన్ అన్నారు. కాగా, గతవారం వైద్య విభాగంలో మొదలైన నోబెల్ బహుమతుల ప్రకటన సోమవారంతో ముగిసింది.

ముంబైలో కార్లకు టోల్ ఫ్రీ!

» నగరంలోకి ప్రవేశించే ఐదు బూత్‌లలో అమల్లోకి

ముంబై, అక్టోబరు 14: మహారాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ముంబై నగరంలోకి ప్రవేశించే ఐదు టోల్ బూత్‌ల్లో కార్ల (లైట్ మోటార్ వాహనాల)కు టోల్ ఫీజును మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వస్తుందని తెలిపింది. సీఎం ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. టోల్ బూత్‌ల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోందని, టోల్ ఫీజును రద్దు చేయాలని వాహనదారులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారని సీఎం శిందే క్యాబినెట్ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. అందుకే టోల్ ఫీజు రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం దహిసర్, ఎల్‌బీఎస్ రోడ్-ములుండ్, ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే-ములుండ్, ఎయిరోలి క్రీక్ బ్రిడ్జి, వాశి టోల్ బూత్‌ల్లో ఇకపై కార్లు, జీపులు, వ్యాన్లు, ఆటోలు, ట్యాక్సీలు, డెలివరీ వ్యాన్లు, చిన్నపాటి ట్రక్కులు టోల్ రుసుము చెల్లించకుండానే ప్రయాణించవచ్చు. రోజూ ఈ టోల్ బూత్‌ల గుండా 6 లక్షలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో 80 శాతం లైట్ మోటార్ వాహనాలేనని అధికారులు తెలిపారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోడ్ వెలువడడానికి కొద్ది గంటల ముందు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

మళ్లీ వార్తల్లోకి 'మోదానీ'!

» ఈసారి కెన్యా నుంచి.. ప్రధాని మోదీపై కాంగ్రెస్ ధ్వజం



న్యూఢిల్లీ, అక్టోబరు 14: అదానీ గ్రూప్‌కు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కట్టబెట్టడంపై కెన్యాలో రాజకీయ వివాదం చెలరేగింది. రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున లంచాలు తీసుకొని అదానీ కంపెనీకి ప్రాజెక్టులు అప్పగించారని కెన్యా నేతలు ఆరోపిస్తున్నారు. ఎయిర్‌పోర్టులు, విద్యుత్తు లైను, తదితర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అదానీ కంపెనీకి అప్పగించడంపై కెన్యాలో కొద్ది నెలలుగా నిరసనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కెన్యా మాజీ ప్రధాని రైలా ఒడింగా ప్రధాని మోదీ, అదానీ గురించి మాట్లాడిన వీడియో వైరల్‌గా మారింది. ఆ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ మోదీపై విరుచుకుపడింది. "నేను కెన్యా ప్రధానిగా ఉన్న సమయంలో అదానీ కంపెనీని అప్పటి గుజరాత్ సీఎం అయిన మోదీ నాకు పరిచయం చేశారు" అని ఒడింగా చెప్పినట్లుగా ఉన్న వీడియోను కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తనకు సన్నిహితులైన వ్యాపారవేత్తలకు లబ్ధి చేకూర్చడంలో మోదీ దిట్ట అని ఆరోపించారు. "అదానీతో, అదానీ కోసం, అదానీ చేత.. గడిచిన పదేళ్లలో భారతదేశ విదేశాంగ విధానం కథ ఇది" అని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆ వీడియోను పోస్ట్ చేస్తూ.. "మోదానీ (మోదీ-అదానీ) మళ్లీ వార్తల్లోకి వచ్చారు. ఈసారి కెన్యా నుంచి" అని ఎద్దేవా చేశారు. ఇక కెన్యాలోని ప్రధాన విమానాశ్రయ నిర్వహణ బాధ్యతను అదానీకి అప్పగించడంపై తీవ్రస్థాయిలో నిరసనలు జరుగుతున్నాయి. ఆ నిర్ణయాన్ని కోర్టు కూడా తాత్కాలికంగా నిలిపివేసింది. కాగా, అదానీ గ్రూపు గత వారమే హై ఓల్టేజ్ విద్యుత్తు సరఫరా లైన్లు నిర్మించే ఒప్పందంపై సంతకాలు చేసింది. మరోవైపు రాజకీయ నాయకులకు భారీగా ముడుపులిచ్చి, ప్రాజెక్టులను దక్కించుకున్నారంటూ గౌతమ్ అదానీపై కెన్యా సెనెటర్ డేనియల్ కిటోంగా మాంజో ఆరోపణలు చేశారు.

నదుల దురాక్రమణను ఎలా అరికడుతున్నారు?

నదులను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలేంటి?

» కేంద్ర సంస్థలకు సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోని నదీ పరివాహక ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న దురాక్రమణలు, అక్రమ నిర్మాణాలతో నదుల పర్యావరణ వ్యవస్థకు నష్టం జరుగుతుండడంతోపాటు తరచూ వరదలు సంభవిస్తుండడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఆక్రమణలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలంటూ కేంద్ర పర్యావరణ, అటవీశాఖ, జలశక్తి మంత్రిత్వ శాఖ, భూశాస్త్ర విభాగం, జలసంఘం, కాలుష్య నియంత్రణ మండలి తదితర కేంద్ర సంస్థలకు నోటీసులు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా పెరిగిపోవడం.. పర్యావరణం, జీవావరణం, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందంటూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అశోక్‌కుమార్ రాఘవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందిస్తూ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ నోటీసులు జారీ చేసింది. కాగా, అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాల వల్ల భారీ ఉత్పాతాలు, తరుచూ వరదలు సంభవిస్తున్నాయని. కీలకమైన మౌలిక సదుపాయాలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని పిటిషనర్ తెలిపారు. 1986లో ఆమోదించిన పర్యావరణ (పరిరక్షణ) చట్టం కింద ఈ అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవడం కేంద్ర పర్యావరణ అటవీశాఖ కీలక బాధ్యతగా ఆయన పేర్కొన్నారు. 2015 నుంచి నదుల పరిరక్షణ జోన్ లేదా నదుల నియంత్రణ జోన్‌ను నోటిఫై చేయకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. నదుల అక్రమ ఆక్రమణల వల్ల భూగర్భ జలాలు కూడా ఇంకిపోతున్నాయని, నీటి కొరతకు కూడా దారి తీస్తుందని, దీంతో దేశంలో నీటి భద్రతకు ముప్పు ఏర్పడుతుందని పిటిషన్‌లో వివరించారు. నదులను కాపాడేందుకు కఠినమైన నిబంధలను రూపొందించాలని, నదుల పరిరక్షణ జోన్‌పై వెంటనే నోటిఫికేషన్ జారీ చేసేలా చూడాలని సుప్రీంకోర్టును కోరారు. దీంతో పర్యావరణ క్షీణత నుంచి దేశంలోని నదులను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించాలంటూ నోటీసుల్లో సుప్రీంకోర్టు పేర్కొంది. కాగా, తెలంగాణలో నదుల పరిరక్షణకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, కరోనా వ్యాక్సిన్ ప్రతికూల ప్రభావాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. వ్యాక్సిన్ కారణంగా రక్తం గడ్డకట్టడం వంటి ప్రతికూల ప్రభావాలు కనిపించాయని పేర్కొంటూ ప్రియా మిశ్ర, మరికొందరు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

అభిషేక్‌కు బెయిల్

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో నిందితుడు అభిషేక్ బోయినపల్లికి సుప్రీంకోర్టు సోమవారం సాధారణ బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అభిషేక్‌ను 2022లో అరెస్టు చేసి తిహాడ్ జైలుకు పంపించింది. అయితే, తన భార్య అనారోగ్యంతో బాధపడుతున్నారని అభిషేక్ సుప్రీంకోర్టులో మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఏడాది మార్చి 20న సుప్రీంకోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆ బెయిల్‌ను పొడిగిస్తూ వచ్చింది. అభిషేక్ సాధారణ బెయిల్ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో జస్టిస్ సుందరేశ్, జస్టిస్ అరవింద్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో నిందితులందరూ బెయిల్‌పై బయటే ఉన్నారని అభిషేక్ తరఫున న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అభిషేక్‌కు కూడా సాధారణ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఈడీ వాదనలు వినిపించాలని కోరగా.. అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు ఎటువంటి అభ్యతరం తెలపలేదు. దీంతో కోర్టు అభిషేక్‌కు సాధారణ బెయిల్ మంజూరు చేసింది.

ట్రంప్ సభ వద్ద సాయుధుడి అరెస్టు

» తుపాకీ, పేలుడు పదార్థాలు, నకిలీ పాస్‌పోర్టులు స్వాధీనం

లాస్ ఏంజెల్స్, అక్టోబరు 14: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచార సభకు తుపాకీతో వచ్చిన సాయుధుడిని భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. అతని వద్ద ఎక్కువ తూటాల సామర్థ్యం కలిగిన మేగజైన్‌ను కూడా గుర్తించారు. అతని వాహనం నుంచి పేలుడు పదార్థాలు, అనేక నకిలీ పాస్‌పోర్టులు కూడా స్వాధీనం చేసుకున్నారు. దక్షిణ కాలిఫోర్నియా ప్రాంతంలోని లాస్ ఏంజెల్స్ నగరానికి తూర్పున ఉన్న కోచెల్లా కౌంటీలో శనివారం రాత్రి జరిగిందీ ఘటన. నిందితుడిని లాస్ వెగాస్‌కు చెందిన 49 ఏళ్ల వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు రిజిస్టర్ కాని నల్లని ఎస్‌యూవీలో వచ్చాడని, దానిపై నకిలీ లైసెన్సు ప్లేటు ఉండటంతో సిబ్బంది అడ్డుకున్నారని అధికారులు వెల్లడించారు. అతడిని అరెస్టు చేసే సమయానికి ఇంకా ట్రంప్ ఆ సభకు రాలేదన్నారు. 'ఏదో ఒక కీడు జరగకుండా మేం అడ్డుకున్నాం. అయితే, ఆ కీడు ఏమిటనేది చెప్పలేం' అన్నారు. ట్రంప్‌పై ఇటీవల రెండు హత్యాయత్నాలు జరగడంతో ఆయన భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఇజ్రాయెల్ సైనిక స్థావరంపై దాడి

» రాకెట్లు, డ్రోన్లతో హడలెత్తించిన హెజ్‌బొల్లా మిలిటెంట్లు

» నలుగురు ఇజ్రాయెల్ సైనికుల మృతి



లెబనాన్‌లో శిథిలాల నుంచి మృతదేహాలను వెలికితీసి తరలిస్తున్న సహాయ సిబ్బంది

టెల్ అవీవ్, అక్టోబరు 14: హైఫా నగరానికి సమీపంలోని బిన్యమిన ప్రాంతంలో ఉన్న ఇజ్రాయెల్ సైనిక స్థావరంపై హెజ్‌బొల్లా రాకెట్లు, డ్రోన్లతో దాడి జరిపింది. ఈ దాడిలో ఇజ్రాయెల్ డిఫెన్స్ చీఫ్ హెర్జి హలెవి ప్రాణాలు కోల్పోయినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే ఈ దాడిలో ఆయన చనిపోలేదని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. అదే సమయంలో ఈ డ్రోన్ దాడుల్లో తమ సైనికులు నలుగురు చనిపోయారని, 61 మంది గాయపడ్డారని వెల్లడించింది. ఆ తర్వాత దాడి జరిగిన గోలాని బ్రిగేడ్ సైనిక శిక్షణా కేంద్రాన్ని హెర్జి హలెవి సందర్శించారు. గాయపడిన సైనికులను పరామర్శించారు. మరోవైపు హెజ్‌బొల్లా డ్రోన్ దాడిని ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ రక్షణ వ్యవస్థ గుర్తించలేకపోయింది. రాకెట్లతో పాటు డ్రోన్ల దండు రావడంతో గుర్తించలేకపోయినట్లు ఐడీఎఫ్ వర్గాల ద్వారా తెలిసింది.

ఇజ్రాయెల్‌కు అమెరికా 'థాడ్'

బాలిస్టిక్ క్షిపణులను ధ్వంసం చేసే అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థ టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్ (థాడ్)ను ఇజ్రాయెల్‌కు అందించాలని అమెరికా నిర్ణయించింది. థాడ్ నిర్వహణ కోసం మూడువేల మంది అమెరికా సైనికులు ఇజ్రాయెల్‌కు రానున్నారు. దీంతో ఇజ్రాయెల్‌కు అండగా అమెరికా సైన్యం ప్రత్యక్షంగా బరిలోకి దిగినట్లేనని అంతర్జాతీయ పరిశీలకులు చెబుతున్నారు. అమెరికా నిర్ణయంపై ఇరాన్ భగ్గుమంది. తమ ప్రజలను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యలకైనా ఉపక్రమిస్తామంటూ ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అమెరికాను హెచ్చరించారు. అమెరికా తాజా నిర్ణయంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 21 మంది చనిపోయారు. గాజాలోనూ ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. సెంట్రల్ గాజా డెయిర్ అల్ బలాహ్ ప్రాంతంలోని శరణార్థులు తలదాచుకున్న పాఠశాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 20 మంది చనిపోయారు.

ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య సరిహద్దు రోడ్ల ధ్వంసం

» దక్షిణ కొరియా దళాలు రావొద్దనే!



సియోల్, అక్టోబరు 14: ఉత్తర కొరియా- దక్షిణ కొరియా దేశాల మధ్య వివాదం మరింత ముదురుతోంది. ఇరు దేశాలను అనుసంధానించే రోడ్లను ధ్వంసం చేసేందుకు ఉత్తర కొరియా సిద్ధమైంది. యుద్ధం వేళ సియోల్ దళాలు తమ దేశంలోకి చొచ్చుకురాకుండా ఉత్తర కొరియా ఈ చర్యలు చేపట్టినట్లు భావిస్తున్నారు. దక్షిణ కొరియాతో అనుసంధానమయ్యే అన్ని రకాల రవాణా మార్గాలను ధ్వంసం చేస్తామని, సోమవారంలోపు ఆ పని పూర్తి చేస్తామని ఉత్తర కొరియా సైన్యం గత వారమే ప్రకటించింది. ఆ పనిని పూర్తి చేసేందుకు కిమ్ దళాలు ఇప్పటికే సమాయాత్తమయినట్లు దక్షిణ కొరియా ఆర్మీ అధికార ప్రతినిధి సోమవారం ప్రకటించారు. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగాంగ్‌వైపు దక్షిణ కొరియా డ్రోన్లను పంపడంపై కిమ్ సర్కారు గుర్రుగా ఉన్నారు. ఆ దేశ డ్రోన్లు ప్యాంగాంగ్‌వైపు మళ్లీ కనిపిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించింది. శతఘ్ని దళం సహా ఇతర కీలక యూనిట్లను ఇప్పటికే సరిహద్దులోకి పంపినట్లు పేర్కొంది. కిమ్ సోదరి కూడా ఇప్పటికే హెచ్చరించారు.

మానవతా మూర్తి.. మరిక సెలవు

(మొదటి పేజీ తరువాయి)

గన్‌పార్కులోని తెలంగాణ అమరుల స్తూపం వద్దకు తీసుకెళ్లారు. అయితే, భౌతిక కాయాన్ని అక్కడ ఉంచడానికి వీల్లేదంటూ పోలీసులు అభ్యంతరం తెలిపారు. తెలంగాణ పోరాటంలో మమేకమైన వ్యక్తులు మరణించినప్పుడు గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన సందర్భాలున్నాయని.. అయినా, పోలీసులు సాయిబాబా భౌతిక కాయాన్ని అనుమతించకపోవడం ఏంటని ప్రజాసంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం భౌతిక కాయాన్ని మౌలాలి జవహర్‌నగర్‌లోని సాయిబాబా సోదరుడి నివాసానికి తరలించారు. అక్కడ వేలాది మంది సాయిబాబా భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. మధ్యాహ్నం 3 గంటలకు జవహర్‌నగర్ నుంచి ర్యాలీగా సాయిబాబా భౌతిక కాయాన్ని తీసుకొచ్చి గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

నష్టాన్ని ఎవరూ పూడ్చలేరు: హరీశ్ రావు

నిర్దోషిగా బయటకు వచ్చిన సాయిబాబా స్వేచ్ఛా జీవితాన్ని అనుభవించేలోపే మరణించడం బాధాకర మని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. దశాబ్ద కాలం ఆయన అన్యాయంగా జైలు శిక్ష అనుభవించారని, ఆయన జీవితంలో విలువైన ఆ సమయాన్ని ఎవరూ తిరిగి తీసుకురాలేరని అన్నారు. సాయిబాబాకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ సుప్రీం సీజే చంద్రచూడ్‌కు లేఖ రాశానని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. కోర్టులో కేసు కూడా వేస్తామని ప్రకటించారు. సాయిబాబాది ప్రభుత్వ హత్యేనని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. సాయిబాబా మరణానికి కేంద్రమే పూర్తి బాధ్యత వహించాలని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.

పలువురు ప్రముఖుల నివాళి..

సాయిబాబా భౌతిక కాయానికి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నేత కే. కేశవ రావు, కవయిత్రి జయప్రభ, జనశక్తి నేత అమర్, విమలక్క, మానవ హక్కుల నేత జీవన్ కుమార్, సీనియర్ జర్నలిస్టు కే. రాంచంద్రమూర్తితో పాటు పలువురు నేతలు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి నేతలు సాయిబాబా భౌతిక కాయానికి అంజలి ఘటించారు.



సాయిబాబా భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే. శ్రీనివాస్, తదితరులు

కేటీఆర్‌కు నిరసన సెగ

సాయిబాబాకు నివాళులర్పించేందుకు వచ్చిన మాజీ మంత్రి కేటీఆర్‌కు పౌర హక్కుల నేతల నుంచి నిరసన సెగ తగిలింది. కేటీఆర్ గో బ్యాక్ అంటూ వారు నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఎన్నో ఉపా కేసులు పెట్టినా.. ఏనాడూ మాట్లాడని అప్పటి ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు వచ్చి సాయిబాబకు నివాళులు అర్పించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వం ఎంత కారణమో బీఆర్‌ఎస్ సర్కారూ అంతే కారణమంటూ నినాదాలు చేశారు.

నిరంకుశ పాలనపై నైతిక గెలుపు..

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే. శ్రీనివాస్

నిరంకుశ పాలనలో జైలులో నరక యాతన అనుభవించి నిర్దోషిగా బయటకు వచ్చిన సాయిబాబా మరణం సమాజానికి తీరని లోటు. చనిపోయినా.. నైతిక విజయం ఆయనదే. ఆయన చాలా చెప్పాలనుకున్నారు. జీవితం గురించి, అనుభవించిన కష్టాల గురించి, సమాజం గురించి ఎంతో చెప్పాలనుకున్నారు. అంతలోపే ఆయనను మరణం తీసుకెళ్లింది. ఆయన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

రాకకోసం ఎదురుచూసినంత సేపు పట్టలేదు

- వసంత, సాయిబాబా జీవిత సహచరి

సాయిబాబా రాక కోసం ఎదురుచూసినంత సేపు పట్టలేదు.. మమ్మల్ని వదిలి దూరమవడానికి. ఏడు నెలల కిందట జైలు నుంచి విడుదలైనా, ఆయన్ను కంటి నిండా చూసుకున్నది లేదు. మనసు విప్పి మాట్లాడుకున్నది లేదు. ఢిల్లీలో ఉన్నన్నాళ్లు రోజూ ఉదయాన్నే ఫిజియోథెరపీకి వెళ్లి రావడం. బంధుమిత్రులు, ఉద్యమ సహచరుల పలకరింపులు, ఫోన్ పరామర్శలతో రోజంతా తీరిక లేకుండా గడిచేది. హైదరాబాద్ వచ్చాక ఆస్పత్రిలోనే ఎక్కువ సమయం అయిపోయింది. ఇలా జరుగుతుందని ఊహించలేదు.

నాన్నతో ఎన్నో మాట్లాడాలనుకున్నా

- మంజీర, సాయిబాబా కుమార్తె

నాన్నతో నాకు చిన్నప్పటి నుంచి అనుబంధం ఎక్కువ. జైలు నుంచి విడుదలైన తర్వాత నాన్నతో జీవితాంతం కలిసి ఉండొచ్చని అనుకున్నాను. చనిపోవడానికి వారం ముందు నుంచి ఆయన తీవ్రమైన నొప్పులతో బాధపడుతున్నారు. అయినా, పుస్తకాలు చదివారు. ఆస్పత్రి గదిలోనూ సగంపైగా పుస్తకాలే. నాన్నతో ఎన్నో విషయాలు మాట్లాడాలనుకున్నాను. ఆయన ఇంత తొందరగా దూరమవుతారని అనుకోలేదు.

ఆదివాసీల హక్కుల గొంతుక

- పౌర హక్కుల నేతగా జీవితమంతా పోరాటం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 'ఆయన జీవితమే పోరాటం'.. ఈ మాటకు నిలువెత్తు ప్రతి రూపం ప్రొఫెసర్ సాయిబాబా. అడుగుతీసి అడుగు వేయలేడు. అయినా అడుగు ఎలా వేయాలో.. ఎటు వైపు వేయాలో తెలిసిన మానవతామూర్తి. కడుపులో చల్లకదలకుండా బతికే ప్రభుత్వ కొలువు ఉన్నా.. జీవించినంత కాలం బలహీనుల పక్షాన గొంతెత్తారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేసి ఆదర్శమూర్తిగా నిలిచారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన సాయిబాబా విద్యార్థి దశలోనే ఆదివాసీ హక్కుల పరిరక్షణ ఉద్యమం పట్ల ఆకర్షితుడయ్యారు. అమలాపురంలోని మిషనరీ స్కూల్లో పదో తరగతి చదువుతుండగా.. ఒక రోజు సాయిబాబా సహాధ్యాయులతో కలిసి సమీపంలోని ఆదివాసీ గూడేనికి వెళ్లారు. అదే సమయంలో ఆదివాసీల హక్కుల మీద అవగాహన కల్పించడానికి అక్కడికి వెళ్లిన సీనియర్ ఐఏఎస్ అధికారి బీడీ శర్మ ఆంగ్ల ప్రసంగాన్ని సాయిబాబా తెలుగులోకి అనువదించారు. అందుకు మెచ్చిన శర్మ కొన్ని పుస్తకాలను సాయిబాబాకు బహూకరించారు. అలా బీడీ శర్మ పరిచయంతో ఆదివాసీ హక్కుల ఉద్యమంతో సాయిబాబాకు అనుబంధం ఏర్పడింది. సల్వాజుడుం, గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా ఫోరం ఎగెనెస్ట్ వార్ ఆన్ పీపుల్ వేదిక ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గళమెత్తారు. ఒక సందర్భంలో ఈ సమస్యను ఐక్యరాజ్య సమితి వరకు తీసుకెళ్లారు.

తెలంగాణ పోరాటంలో పాత్ర..

తెలంగాణ మలి దశ పోరాటానికి ముఖ్య భూమికగా నిలిచిన 1997 నాటి వరంగల్ డిక్లరేషన్ సభలో సాయిబాబా ముఖ్య పాత్ర పోషించారు. తెలంగాణ సాధన లక్ష్యంగా అఖిల భారత ప్రజా ప్రతిఘటన వేదిక(ఏఐపీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో 1997 డిసెంబరు 28, 29 తేదీల్లో వరంగల్ వేదికగా పెద్ద సదస్సు జరిగింది. ప్రజాకవి కాళోజీ అధ్యక్షతన సాగిన సదస్సులో ఆ సంస్థ జాతీయ కార్యదర్శిగా సాయిబాబా కీలకపాత్ర పోషించారు. మండల్ కమిషన్ మద్దతు ఉద్యమంలోనూ కీలక భూమిక పోషించారు.

బోధనా రంగంపై మక్కువ..

ప్రొఫెసర్ సాయిబాబా ఢిల్లీ యూనివర్సిటీ రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో 2014, మే 9 ముందు వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆంగ్ల సాహిత్యంలో సాధికారత కలిగిన సాయిబాబా ప్రధానంగా ఆంగ్ల సాహిత్య సిద్ధాంతం, చరిత్ర, యూరోపియన్ మోడ్రన్ డ్రామా సబ్జెక్టులను బోధించారు. ఢిల్లీ నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు సోమవారం సాయిబాబా అంతిమయాత్రకు హాజరయ్యారు. బోధనా రంగాన్ని అమితంగా ప్రేమించిన సాయిబాబాను 2021, ఏప్రిల్‌లో ఢిల్లీ యూనివర్సిటీ సస్పెండ్ చేసింది. ఆయన నిర్దోషిగా విడుదలైన తర్వాత తిరిగి ఆ ఉద్యోగంలో కొనసాగేందుకు ప్రయత్నించారు. వైస్ చాన్స్‌లర్‌ను సైతం కలిశారు. అది తమ చేతిలో లేదని అవతలి నుంచి సమాధానం రావడంతో మరో న్యాయపోరాటం చేయడానికి సిద్ధమయ్యారు. అంతలోనే ఆయన కన్నుమూశారు.

పాము కాటుతో రైతు మృతి

- నల్లగొండ జిల్లాలో ఘటన



లింగారెడ్డి(ఫైల్)

మాడ్గులపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పొలానికి వెళ్లిన రైతు పాము కాటుకు గురై చనిపోయాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో జరిగింది. తిప్పర్తి మండలం సిలార్మియాగూడెంకు చెందిన గుడిపల్లి లింగారెడ్డి(56) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఇందుగుల శివారులో ఉన్న తన పొలం వద్దకు వెళ్లాడు. రాత్రి అయినా లింగారెడ్డి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికులతో కలిసి పొలం వద్దకు వెళ్లి వెతికగా పొలంలో కింద పడిపోయి విగత జీవిగా కనిపించాడు. పాము కాటు వేసినట్లు ఆనవాళ్లు ఉండటంతో పాము కాటుకు గురై తన భర్త మృతిచెందాడని భార్య సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గత ప్రభుత్వ హయాంలో ఏఏజీ హోదాలో తనకు కల్పించిన భద్రతను కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఎలాంటి ప్రాణహానీ లేదని ఎస్‌ఆర్‌సీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో భద్రతను కొనసాగించాలని ఆదేశాలూ ఇవ్వలేమని తేల్చిచెప్పింది.

శ్రీశైలం ప్రాజెక్టుకు మళ్లీ జలకళ

- ప్రాజెక్టులోకి 1.20 లక్షల క్యూసెక్కుల వరద
- గరిష్ఠ నీటి మట్టానికి అడుగు దూరంలో 'సాగర్'
- రానున్న 4 రోజులు వర్షాలు.. ఎల్లో అలెర్ట్ జారీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

శ్రీశైలం ప్రాజెక్టు మళ్లీ జలకళ సంతరించుకుంది. సోమవారం ఈ ప్రాజెక్టుకు 1,20,848 క్యూసెక్కుల వరద రాగా... జలవిద్యుదుత్పత్తి, పోతిరెడ్డిపాడు ద్వారా తరలింపునకు 77,624 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 215.81టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 200టీఎంసీల నీటి నిల్వ ఉంది. నాగార్జునసాగర్‌కు 65వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... రెండువైపులా ఉన్న కాల్వల ద్వారా, ప్రధాన కేంద్రంలో జలవిద్యుదుత్పత్తితో 40 వేల క్యూసెక్కులను దిగువకు వదిలారు. ఈ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 589 అడుగుల మేర నీరు ఉంది. ఇక పులిచింతలకు 31 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... 36 వేలను దిగువకు వదిలిపెట్టారు. గోదావరి బేసిన్ పరిధిలో శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు సోమవారం 9వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 80టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. కృష్ణాతో పాటు గోదావరి బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టుల వద్ద జలవిద్యుత్ ఉత్పాదన 3362 మిలియన్ యూనిట్లు దాటింది. తెలంగాణలో పలు జిల్లాల్లో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 19 వరకు పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

మా పార్టీ సదస్సులో పాల్గొనేలా సీఎం రేవంత్‌ను ఆదేశించండి

- హైకోర్టులో కె.ఎ.పాల్ కేసు.. పరిశీలన దశలోనే కొట్టివేత

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌కు సోమవారం హైకోర్టులో నిరాశ ఎదురయింది. 2025 జనవరిలో తాను నిర్వహించబోయే అంతర్జాతీయ శాంతి సమ్మేళనం(ఇంటర్నేషనల్ పీస్ సమ్మిట్)లో పాల్గొంటానని తనకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానిని ఇప్పుడు నిలబెట్టుకోవడం లేదని పేర్కొంటూ ఆయన దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం పరిశీలన దశలోనే తిరస్కరణకు గురయింది. ఈ పిటిషన్‌కు రెగ్యులర్ నెంబర్ ఇవ్వడానికి రిజిస్ట్రీ నిరాకరించింది. దాంతో అది పరిశీలన దశలోనే చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుల ధర్మాసనం ముందుకు వచ్చింది. పాల్ వాదనలు వినిపిస్తూ పీస్ సమ్మిట్‌కు సహకరిస్తానని, ఆ సదస్సుకు హాజరవుతానంటూ రేవంత్ హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీ నిలబెట్టుకునేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. సమావేశంలో పాల్గొంటానని చెప్పి రాకపోతుండడం వల్ల ప్రాథమిక హక్కులకు భంగం కలగలేదని తెలిపింది. సమావేశంలో పాల్గొనాలని కోరే చట్టబద్ధమైన హక్కు పిటిషనర్‌కు లేదని, పాల్గొనాల్సిన చట్టబద్ధమైన బాధ్యత సీఎంకు లేదని స్పష్టంచేసింది. ఈ అంశం ప్రజాప్రయోజనం కిందకే రాదని పేర్కొంటూ కొట్టేసింది.

మూసీ పరివాహక కాలనీల్లో ఇళ్లపై హైకోర్టు ఉత్తర్వుల ఫ్లెక్సీలు

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మా ఇళ్ల జోలికి రావొద్దు.. మాకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్నాయంటూ పలువురు తమ ఇళ్లపై బోర్డులు, ఫ్లెక్సీలు తగిలించారు. మూసీ నది పునరుద్ధరణ, సుందరీకరణ కోసం నీటిపారుదల, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైడ్రా అధికారులు సంయుక్తంగా పలు కాలనీల్లో సర్వేలు నిర్వహిస్తున్నారు. దాంతో దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, ఫణిగిరి కాలనీ, సత్యానగర్, కొత్తపేట తదితర ప్రాంతాల వాసులు హైకోర్టును ఆశ్రయించి తమ ఇళ్లను కూల్చకుండా మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఆ కేసు నంబర్ల వివరాలను ఫ్లెక్సీపై రాయించి ఇళ్ల ముందు ప్రదర్శిస్తున్నారు. అధికారులు మాత్రం... తాము సర్వేకోసం మాత్రమే వెళ్లామని, ఇంకా ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని చెబుతున్నారు.

ఇది వాయిదాల సర్కార్

- రేవంత్ హయాంలో అటకెక్కిన ప్రభుత్వ పథకాలు
- ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు



అందోలులో బీఆర్‌ఎస్ నిర్వహించిన అలయ్‌బలయ్‌లో ప్రసంగిస్తున్న హరీశ్‌రావు

జోగిపేట, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సర్కారు వాయిదాల మీద నడుస్తోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లా అందోలు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని వాయిదా వేస్తూ వాయిదాల ప్రభుత్వంగా కాంగ్రెస్ సర్కార్ పేరు గాంచిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి హయాంలో ఒక్క ఉచిత బస్సు తప్ప కొత్తగా ఒక్క పథకమూ ప్రారంభం కాకపోగా, బీఆర్‌ఎస్ కాలంలో అమలు చేసిన పథకాలూ అటకెక్కాయన్నారు. ఎన్నికల సందర్భంగా గతేడాది డిసెంబర్ 9 నుంచి రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ తీరా గెలవగానే రుణమాఫీని వాయిదా వేయగా, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తాజాగా ఈ ఏడాది డిసెంబరు 9 నాటికి వాయిదా వేశారని హరీశ్ చెప్పారు.ప్రతీయేటా రెండు లక్షల ఉద్యోగాలిస్తామన్న రేవంత్ గతంలో కేసీఆర్ వేసిన నోటిఫికేషన్ల తాలూకు 30 వేల ఉద్యోగాలు తప్ప కొత్తగా ఒక్కటీ ఇవ్వలేదన్నారు. సంవత్సరం గడుస్తున్నా నేటికీ ఇంకా జాబ్ కేలెండర్ విడుదల చేయలేకపోగా, ఇస్తామన్న నెలకు రూ. 4 వేల నిరుద్యోగ భృతిని కూడా అమలు చేయడం లేదన్నారు. దసరా వేళ ఆర్టీసీ టికెట్‌ధరలు విపరీతంగా పెంచి ప్రయాణికుల నుంచి వసూలు చేయడం దుర్మార్గమని హరీశ్‌రావు విమర్శించారు. హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సుచార్జీ సాధారణ రోజుల్లో రూ.300ఉండగా పండుగ వేళ ప్రభుత్వం రూ.420కి పెంచి ప్రయాణికులనుంచి ముక్కుపిండి వసూలు చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు.

గురుకులాలను ఉంచుతారా..? ఊడగొడతారా..?

ప్రతి నియోజకవర్గంలో 2500 మంది విద్యార్థులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కడుతున్నామని సీఎం ప్రకటించడంపై అన్ని వర్గాల్లో అయోమయం నెలకొందని మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గతప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకోసం ఏర్పాటుచేసిన 1023 గురుకులాలను ఉంచుతారా? ఊడగొడతారా? చెప్పాలని ఆయన రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

'పేట'లో ఘటనపై సర్కారు సీరియస్

ఇద్దరు ఏఈలపై సస్పెన్షన్ వేటు .. పంచాయతీ కార్యదర్శిపై కూడా..

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి), నారాయణఖేడ్, అక్టోబరు 14: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో కలుషిత నీటిని తాగి 50 మంది గ్రామస్థులు అస్వస్థతకు గురైన ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు మిషన్ భగీరథ ఏఈలపై సస్పెన్షన్ వేటువేసింది. మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ రవికుమార్, ఇంట్రా ఏఈ శ్రీకాంత్‌లను సస్పెండ్ చేస్తూ మిషన్ భగీరథ ఈఎస్‌సీ కృపాకర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు గ్రిడ్ డీఈఈ గాయత్రి తెలిపారు. మిషన్ భగీరథ నీటిని బావిలో నింపడంతోపాటు నీరు సురక్షితమా కాదా అనేది పరిశీలించకుండానే ట్యాంకులో నింపి సరఫరా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ఇదే ఘటనకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వల్లూరి క్రాంతి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. సంజీవన్‌రావుపేటలో తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇద్దరు మృతిచెందడంతో పాటు పలువురు అస్వస్థత గురికావడంతో పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



సంజీవన్‌రావుపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజీవరావు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం సత్ఫలితాలివ్వడంలేదని, ఇందుకు నిదర్శనమే సంజీవన్‌రావుపేట ఘటన అని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరావు అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మిషన్ భగీరథ పథకం ఎస్ఈ రఘువీర్, ఈఈ పాషా, డీఈఈ ఫణివర్మ, గ్రిడ్ డీఈఈ గాయత్రి, ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తిలతో కలిసి సంజీవన్‌రావుపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైపులైన్లు పలుచోట్ల లీకవుతుండటంతో సమస్యలు ఉత్పన్నమతున్నాయన్నారు. పాత ట్యాంకు ద్వారా 120 ఇళ్లకు తాగునీటిని సరఫరా చేయగా 25మంది అస్వస్థతకు గురయ్యారని, వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఇద్దరి మృతికి సంబంధించి ఆరోగ్య సమస్యలు కారణమని తెలుస్తోందని, ఈ విషయమై విచారణ జరుపుతున్నామని, అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలుషిత నీటితో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సీపీఎం, సీపీఐ నాయకులు వేర్వేరుగా పరామర్శించారు. సంజీవన్‌రావుపేటలో ఎమ్మెల్యే, అధికారులు పర్యటన సమయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సాయిబాబా

జి.ఎన్. సాయిబాబా హఠాన్మరణం దేశంలోని ప్రజాస్వామికవాదులందరినీ విషాదంలో, విచారంలో ముంచెత్తింది. దాదాపు పదేళ్ల జైలు జీవితంలో, తన నిర్బంధాన్ని, దేశంలోని హక్కుల అణచివేతను నిర్విరామంగా వ్యతిరేకిస్తూ, స్వేచ్ఛ కోసం పోరాడిన సాయిబాబా, నిర్దోషిగా విడుదలైన ఏడునెలలకే, ఆ స్వేచ్ఛను కనీసంగా కూడా అనుభవించకముందే కన్నుమూయడం పెద్ద విషాదం. ఈ మరణం కేవలం ఆకస్మికమో, అనారోగ్య ఫలితమో కాదని నిస్సందేహంగా తెలిసిపోతున్నప్పుడు, ఇంతటి కర్కశత్వాన్ని, క్రూరచట్టాలను ప్రయోగించే ప్రభుత్వాల ముందు నిస్సహాయంగా, బాధితంగా మాత్రమే భారత సమాజం మిగిలిపోవడం, మానవీయత నానాటికి కొత్త పతనాలకు చేరుకోవడం అందరినీ ఆవరిస్తున్న పెను విచారం.

కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ 2 ప్రభుత్వం అవసాన కాలంలోనే సాయిబాబాపై మొదలైన వేధింపులు, బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తీవ్రమయ్యాయి. ప్రజాస్వామిక, ఉదారవాద, వామపక్ష, పర్యావరణ వాద తదితర పౌరసమాజ శక్తులన్నిటినీ అశక్తులను చేయడం, వారి నైతిక బలాన్ని దెబ్బతీయడం, వారిని దేశవ్యతిరేక శ్రేణులుగా పరిగణించడం, వంటి ప్రణాళికను అనుసరించిన నరేంద్ర మోదీ ప్రభుత్వం, వాటి అమలులో అనుసరించిన నిర్దాక్షిణ్యవైఖరికి సహజ ప్రతిక్రియగా రూపొందిన ప్రతిఘటనా ప్రతీక సాయిబాబా.

మత భావోద్వేగాలతో సమాజాన్ని మైమరిపింపజేయగలిగినప్పుడు, రాజకీయ విధాన నిర్ణయాలకు ఏ నైతిక సమర్థనలూ అవసరం లేదన్న బలాదూర్ ధోరణి పాలకులలో ఏర్పడుతుంది. పదేళ్లుగా, పాలక శ్రేణుల్లోని రాజకీయ ప్రత్యర్థుల మీద, ప్రజా ఉద్యమాల నాయకుల మీద, కార్యకర్తల మీద అనుసరిస్తున్న నిర్బంధ విధానాలు కనీస రాజ్యాంగ ప్రాతిపదికలను కూడా ఖాతరు చేయని స్థితి చూశాము. సాయిబాబా కేసు తరువాత, బీమా కోరేగావ్ కుట్ర కేసు.

అధ్యాపకుడు, అట్టడుగు వర్గాల కోసం ఆలోచించి, ఆచరించే బుద్ధిజీవి, సుదీర్ఘంగా ప్రజా ఉద్యమాల అనుభవశాలి అయిన సాయిబాబాను 'ఊపా' కింద, ఇంకా అనేక చట్టాల కింద అభియోగాలను మోపి, యావజ్జీవ శిక్ష విధింపజేసి నాగపూర్ జైల్‌లో నిర్బంధించారు. విచారణ కాలంలో బెయిల్ ఇవ్వలేదు. నిర్బంధ కాలంలో సరైన వైద్య సహాయం అందించలేదు. 90 శాతం వైకల్యం ఉన్న సాయిబాబాకు నేర పరిశోధన, న్యాయ పాలన రంగాలు చేసిన అన్యాయంతో పాటు, కారాగార అధికారుల నియమోల్లంఘన, నిరాదరణ వల్ల ఆరోగ్యం శిథిలమవుతూ వచ్చింది. ఆయన సహచరి వసంత నిరంతరం జైలులో సాయిబాబా స్థితిగతులను బయటి ప్రపంచానికి నివేదిస్తూ వచ్చారు. చిన్నపాటి కనీస వసతికి కూడా విజ్ఞప్తులు, సంతకాల సేకరణలు కావలసి వచ్చేది. ప్రభుత్వ విధానంలో ముఖ్యమైనది స్పందనారాహిత్యం. కోవిడ్ వచ్చినప్పుడూ, ఇతర ఆరోగ్య సమస్యల కాలంలోనూ ఆస్పత్రికి తరలించడానికి కూడా అంగీకరించని కాఠిన్యం అధికారులది. అతని నిర్బంధం విషయంలో ప్రభుత్వం పట్టింపుకు అతి దారుణమైన ఉదాహరణ, తల్లి మరణించినప్పుడు పెరోల్ అనుమతించకపోవడం, కనీసంగా వీడియో చూపులకు కూడా ఒప్పుకోకపోవడం.

బిల్కిస్ బానో కేసులో దోషులను విడుదల చేయడంలో, వారికి పెరోళ్లు ఇవ్వడంలో అత్యుత్సాహం చూపిన ప్రభుత్వం, సాయిబాబా జైలు దాటకుండా చేయడానికి మాత్రం, చరిత్రలో మునుపెన్నడూ వినని ఆత్రుత చూపింది. 2022లో బొంబాయి హైకోర్టు మొదటిసారి, నేరాభియోగం సరైన పద్ధతులలో జరగలేదన్న కారణాలతో కేసును కొట్టివేసినప్పుడు, సాయిబాబాను విడుదల కాకుండా చూడడానికి రాత్రికి రాత్రి సుప్రీంకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. మరుసటి రోజు పొద్దునే కేసు వినేట్టు చేసుకోవడం, నిర్దోషిత్వ తీర్పు మీద స్టే తెచ్చుకోవడం ఆశ్చర్యకరమైన రీతిలో జరిగిపోయాయి. ఎందుకు ఆయన నిర్బంధం మీద అంతటి పట్టుదల? అప్పటికి సాయిబాబా నిర్బంధాన్ని పొడిగించగలిగారు కానీ, ప్రజల దృష్టికి ప్రభుత్వ కార్పణ్యం ప్రస్ఫుటమయింది! జైలులో స్టాన్ స్వామి మరణం, పాలకులకు ఏ తృప్తి కలిగించిందో కానీ, వ్యవస్థ క్రౌర్యం మీద ప్రజలకు ఏవగింపే కలిగించి ఉంటుంది కదా? తెలుగు విప్లవకవి వరవరరావును అనారోగ్యంలో ఎంతటి ఇబ్బంది పెట్టారు? బెయిల్‌ను కూడా ఆంక్షలతో బంధించి బొంబాయి దాటి కదలకుండా చేశారు! ప్రభుత్వాలపై ప్రజాస్వామికమైన ఒత్తిడి తేవడానికి, ప్రజలలో విమర్శనాత్మక చైతన్యం కలిగించడానికి, ప్రత్యామ్నాయ వ్యవస్థలను రూపొందించడానికి చిత్తశుద్ధితో, అంకితభావంతో జరిగే ప్రయత్నాలను దెబ్బతీయడం కోసమే కాకపోతే, ఈ నిర్బంధ విధానాలకు అర్థం ఏమిటి? ప్రజలను చైతన్యపరుస్తారన్నది మినహాయిస్తే, ఈ ప్రజాకార్యకర్తలు రాజ్యం మీద యుద్ధమో, అందుకు కుట్రనో చేస్తున్నారన్నది ఏ రకంగా వాస్తవం? నిర్దోషిగా న్యాయస్థానం అంగీకరించడానికి ముందు పదేళ్ల యాతన కొనసాగింపే సాయిబాబా మరణం. ప్రజాస్వామ్యం నాలుగు స్తంభాలూ ఈ అన్యాయంలో భాగస్వాములే.

కఠినచట్టాలు, జాతీయ ఏజెన్సీలు, వినయవిధేయ న్యాయస్థానాలు, ఎంతగా నిరంకుశత్వానికి వేదికలయినా, ఆ ప్రయత్నాలన్నీ నైతికంగా నిస్సారమైనవి. దీర్ఘకాలం జైళ్లలో మగ్గినా, వారి నిర్బంధం వల్ల బంధుమిత్రులూ, సమాజమూ ఎన్ని అష్టకష్టాలు పడినా ప్రజాకార్యకర్తలే నైతికంగా బలశాలురుగా నిలబడతారనడానికి సాయిబాబా ఒక ఉదాహరణ. నిర్బంధంలో ఆయన గొప్ప కవిగా గొంతు సవరించుకున్నారు. కబీరులో తాత్వికప్రతిబింబాన్ని చూసుకున్నారు. తనతో, సమాజంతో కొత్త సంభాషణ మొదలుపెట్టారు. తీక్షణమైన చూపులు, మొహం మీద స్థిరపడిన సన్నటి నవ్వు, ఎక్కడా దైన్యం కనబడని కవళికలు, పరిమితిగా కాక, తన శరీరంలో ఒక భాగంగా ఒదిగిపోయిన వీల్ చెయిర్, సాయిబాబా మీద ఆరాధనతో కూడిన గౌరవాన్ని కలిగిస్తాయి. తీవ్రమైన హింసను, వేదనను తట్టుకోగలిన సహిష్ణుత, అదే సమయంలో సడలింపు లేని వ్యక్తిత్వం, ఈ రెండూ కలిసి, ఆయనను ఒక మహాబలశాలి అయిన ప్రతీకను చేశాయి. నైతిక ఆధిక్యం భారతీయ సమాజంలో తిరుగులేని రాజకీయ ఆయుధమని చరిత్ర చెబుతుంది.

సాయిబాబా భారతీయ ఉద్యమాల చరిత్రలో ఒక అధ్యయన అంశంగా నిలిచిపోతారు. భవిష్యత్ కార్యాచరణలకు ప్రేరణగా కొనసాగుతారు. ఆయన ఒక్కరు కాదు. ఒక ప్రత్యేక కాలంలో, సామాజిక, సాంస్కృతిక జాతీయవాదాలు, భావోద్వేగాలు ప్రగతిశీల చైతన్యాన్ని వెనుకపట్టు పడవేసినప్పుడు, ప్రజాస్వామ్యమన్న మాటే అపచారంగా మారుతున్నప్పుడు, సమాజానికి అంతటికీ హెచ్చరికలవలె సాగిన నిర్బంధాల బాధితులందరికీ సాయిబాబా ఒక పర్యాయపదం, సర్వనామం.

కాంగ్రెస్‌ను ఎందుకు తిరస్కరిస్తున్నారు?

'మధ్యప్రదేశ్, రాజస్థన్‌లో అవలీలగా విజయం సాధిస్తామని కాంగ్రెస్ కలలు కన్నది. అయితే ప్రజలు తిప్పికొట్టారు. హర్యానాలో కూడా విజయం తమదేనని ప్రచారం చేసుకుంటోంది. కాని హర్యానా ప్రజలు కూడా కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పనున్నారు' అని నెల రోజుల క్రితమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్యానా ఎన్నికల సభలో ప్రకటించారు. రాహుల్‌గాంధీతో పోలిస్తే మోదీ హర్యానాలో పెద్దగా ప్రచారం చేయలేదు. అయినా హర్యానా ప్రజలు మూడోసారి భారతీయ జనతా పార్టీని ఎన్నుకున్నారంటే అది నరేంద్ర మోదీ సారథ్యంలో బీజేపీ సుపరిపాలన పట్ల విశ్వాసం ప్రకటించడమే.

2014లో బీజేపీ అధికారంలోకి రాకముందు సబ్ కా సాథ్ – సబ్ కా విశ్వాస్ పేరుతో బీజేపీ ప్రకటించిన మేనిఫెస్టో మొదటి పేజీలోనే నరేంద్రమోదీ మాట ఒకటి ఉన్నది: 'నా వ్యక్తిగత హోదాలో మూడు హామీలు ఇవ్వదలుచుకున్నాను. ఒకటి– నేను పార్టీ ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేర్చేందుకు శాయశక్తులా కృషి చేస్తాను; రెండు– నా వ్యక్తిగత ప్రయోజనాలకోసం ఏదీ చేయను; మూడు– దుర్బుద్ధితో నేను ఏ చర్యా చేపట్టను'. ఈ పదేళ్లలో ఆయన పార్టీ ఇచ్చిన హామీల్లో అత్యధిక భాగం నెరవేర్చగలిగారు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆయన ఏదీ చేయలేదు. ఏ పని చేసినా ఆయన దేశానికి మేలు చేసే ఉద్దేశంతోనే చేపట్టారు. మోదీ తాను చెప్పింది చేసినందుకే ఇవాళ దేశమంతా ఆయనను తమ నాయకుడుగా స్వీకరించింది. పదేళ్ల తర్వాత 2024 ఎన్నికలకోసం బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో పార్టీ సమాజాన్ని కులాలుగా,



హర్యానాకు తొలి బీసీ ముఖ్యమంత్రిని నియమించినందుకు, ఉపాధి కల్పనలో తమకు న్యాయం చేసినందుకు వెనుకబడిన వర్గాలు బీజేపీకి అండగా నిలిచాయి. కాంగ్రెస్ కులజనగణన, సామాజిక న్యాయం అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ అగ్రకులాల నేతలకు అవినీతిపరులైన వారికి పెద్ద పీట వేసి ఓబీసీ, దళితులకు అన్యాయం చేసింది. అణగారిన వర్గాల పట్ల బీజేపీ నిజాయితీని గమనించినందువల్లే ఆ వర్గాలు మోదీ పార్టీ వైపు మొగ్గుచూపాయి.

మతాలుగా కాకుండా నాలుగు వర్గాలుగా విభజించింది: పేదలు, రైతులు, యువత, మహిళలు. ఈ నాలుగు వర్గాల శ్రేయస్సు కోసం పనిచేస్తే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ సిద్ధాంతీకరించింది. మోదీ ఆ దిశలో దృష్టి సారించి మొత్తం ప్రభుత్వాన్ని, ఎన్డీఏ భాగస్వాములను ఈ నాలుగు వర్గాలకోసం పనిచేయవలసిందిగా కోరారు. ఆయన మాటల్లో నిజాయితీ ఉన్నందుకే ఇవాళ హర్యానాలో బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాలు బీజేపీని మూడోసారి అధికారంలోకి తీసుకువచ్చాయి.

భారతీయ జనతా పార్టీ దళితులకు, వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేస్తోందని, వారికి అభివృద్ధి ఫలాలు అందడంలేదని, దేశంలో అసలు ప్రజాస్వామ్యమే లేదని, కొన్ని మతాల వారికి తమ మతాన్ని అవలంబించే స్వేచ్ఛే లేదని రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లి కూడా ప్రచారం చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యం, సామాజిక సామరస్యతపై బూటకపు ఆరోపణలు చేసి ప్రపంచం దృష్టిలో భారత దేశ పరువు దిగజార్చాలని ప్రయత్నించారు. ఈ అంతర్జాతీయ కుట్రలన్నిటినీ హర్యానా ప్రజలు వమ్ము చేశారు. నిజానికి భారత్ వ్యతిరేక కార్యకలాపాలను దేశభక్తి అధికంగా గల హర్యానా ప్రజలు హర్షించలేదని ఆ రాష్ట్ర ఎన్నికల ఫలితాలు నిరూపించాయి.

1966లో హర్యానా రాష్ట్రం ఏర్పడింది. 1995లో హర్యానా రాష్ట్ర ఇన్‌ఛార్జిగా మోదీ అడుగుపెట్టిన తర్వాతే ఆ రాష్ట్రంలో బీజేపీ బలోపేతం కావడం ప్రారంభమైంది. అప్పుడు ఆయనతో పనిచేసిన మనోహర్‌లాల్ ఖట్టర్ నేతృత్వంలోనే 2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పటి నుంచీ కేంద్రంలోనూ, హర్యానాలోనూ బీజేపీ ధాటికి తిరుగులేకుండా పోయింది.

ఇప్పటి వరకూ జరిగిన 13 ఎన్నికల్లో పదింటిలో ప్రజలు ప్రతి ఐదేళ్లకోసారీ ప్రభుత్వాన్ని మార్చారు. ఏ ప్రభుత్వమైనా తన అయిదేళ్లలో ప్రజల అసంతృప్తికి ఎంతో కొంత గురికాక తప్పదు. కాని బీజేపీ విషయంలో అలా జరగదని తేలిపోయింది. 2014 నుంచి హర్యానాలో ప్రజలు బీజేపీకే పట్టం కడుతూ వస్తున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగిస్తూ ఉండాలని ప్రజలు ఆశించారు. గత పదేళ్లలో అసాధారణ రీతిలో హర్యానాలో జరిగిన అభివృద్ధిని, మౌలిక సదుపాయాల కల్పనను ప్రజలు గమనించారు. ప్రజల ఆదరణ బీజేపీ పట్ల రోజురోజుకూ పెరుగుతోందని ఓటు శాతం చూసిన వారెవరికైనా అర్థమవుతుంది. 2014లో బీజేపీకి 33.2 శాతం ఓట్లు రాగా అది 2019లో 36.49కి, 2024లో 39.29 శాతానికి పెరిగింది. కాంగ్రెస్ కేవలం జాట్ ఓట్లపైనే ఆధారపడితే భారతీయ జనతా పార్టీకి జాట్లతో సహా అన్ని కులాలు, వర్గాలు ఓటు వేశారని ఎన్నికల ఫలితాలు చూసినవారెవరికైనా అర్థమవుతుంది. జాట్ నాయకుడైన మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా వర్గానికే 90 సీట్లలో 70 సీట్లు దక్కితే చమార్ వర్గానికి చెందిన కుమారి సెల్జాను తీవ్రంగా అవమానించి ఆమె చెప్పిన విధంగా సీట్లు ఇవ్వలేదు. దీంతో దళితులు కాంగ్రెస్‌ను ఛీకొట్టారు. అదే విధంగా వెనుకబడిన వర్గాలన్నీ బీజేపీ వైపే నిలిచాయి.

హర్యానాకు తొలి బీసీ ముఖ్యమంత్రిని నియమించినందుకు, ఉపాధి కల్పనలో తమకు న్యాయం చేసినందుకు వెనుకబడిన వర్గాలు కూడా బీజేపీకి అండగా నిలిచాయి. హర్యానాలో 40 శాతం ఉన్న ఓబీసీలు బీజేపీ వైపు మళ్లేలా చేయడంలో బీసీ ముఖ్యమంత్రి సైనీ, హర్యానా ఇన్‌ఛార్జి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర కృషిచేశారు. గ్రూపు ఏ, గ్రూపు బి ప్రభుత్వోద్యోగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్‌ను 15 శాతం నుంచి 27 శాతానికి పెంచారు. ఓబీసీల క్రీమీలేయర్ పరిమితిని రూ. 6 లక్షలనుంచి రూ. 8 లక్షలకు పెంచి బాగా వెనుకబడిన వర్గాలకు న్యాయం చేశారు. టిక్కెట్ల పంపిణీలో కూడా ఓబీసీలకు బీజేపీ న్యాయం చేసింది. అనేకమంది సిట్టింగ్‌లను డ్రాప్ చేసి వారి స్థానంలో ఓబీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించారు. ఒక వైపు కాంగ్రెస్ కులజనగణన, సామాజిక న్యాయం అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ అగ్రకులాల నేతలకు, అందునా దశాబ్దాలుగా అవినీతిపరులైన వారికి పెద్దపీట వేసి ఓబీసీ, దళితులకు అన్యాయం చేస్తే బీజేపీ నిజమైన సామాజిక న్యాయం చేసింది. అణగారిన వర్గాల పట్ల బీజేపీ నిజాయితీని గమనించినందువల్లే ఆ వర్గాలు బీజేపీ వైపు మొగ్గుచూపాయి. సుపరిపాలన, సామాజిక న్యాయంపై దృష్టి కేంద్రీకరిస్తే తమకు ఢోకా ఉండదని బీజేపీ మరోసారి రుజువుచేసింది.

జమ్ము కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ – కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఉండవచ్చు కాని బీజేపీకే అన్ని పార్టీల కంటే ఎక్కువ ఓటు శాతం లభించింది. బీజేపీ ఓటు శాతం 25.64 శాతం కాగా, నేషనల్ కాన్ఫరెన్స్ ఓటు శాతం 22.43 శాతం. కాంగ్రెస్‌కు 11.97 శాతం మాత్రమే లభించాయి. బీజేపీ 2014 కంటే నాలుగు సీట్లు అధికంగా 29 సీట్లు సాధిస్తే కాంగ్రెస్‌కు కేవలం ఆరు సీట్లే లభించాయి. జమ్ములో ఆ పార్టీకి ఒకే ఒక సీటు లభించింది. రాహుల్‌గాంధీ 'మొహబ్బత్ కీ దుకాణ్' అని నాటకీయ ప్రచారం చేసినా ఆ పార్టీకి కేవలం ఆరు సీట్లే లభించాయి. 2014 కంటే ఇది ఆరు సీట్లు తక్కువే. హర్యానా ఎన్నికలు దేశ రాజకీయాల్లో ఒక మలుపు అని చెప్పక తప్పదు. ఈ ఎన్నికల ఫలితాలు ఎన్నో అంశాలను తేటతెల్లం చేశాయి. దేశంలో బీజేపీ బలహీనపడుతున్నదని భావించి కాంగ్రెస్ భుజాలపై తుపాకి పెట్టి కాల్చేందుకు ప్రయత్నించిన కుహనా లౌకికవాదులకు ఈ ఎన్నికల ఫలితాలు గుణపాఠం చెప్పాయి. త్వరలో జరిగే మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ ఎన్నికల్లో కూడా ప్రజలు సమధికోత్సాహంతో బీజేపీకి ఓటు వేయక తప్పదని దీన్ని బట్టి అర్థమవుతోంది. దేశంలో బీజేపీ కేంద్రీకృత రాజకీయాలకు, ఎన్డీఏ పటిష్టతకూ ఈ ఎన్నికలు ఒక ఊపునిచ్చాయని స్పష్టమవుతోంది. కాంగ్రెస్‌కు ఇక భవిష్యత్ లేదని, ఇండియా కూటమి విచ్ఛిన్నం కాక తప్పదని కూడా ఈ ఎన్నికల ఫలితాలు సంకేతాలనిస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో, వ్యూహరచనలో బీజేపీకి కాంగ్రెస్‌కు ఏ మాత్రం దీటు కాదని కూడా తేలిపోయింది.



• **వై. సత్యకుమార్**
బీజేపీ జాతీయ కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రి

ఓటరు దేవుళ్లు, ప్రజాస్వామ్య పూజారులు

ఎన్నికలలో ఒక అభ్యర్థిగా పోటీ చేయడం చాలా కఠోరమైన పని. శ్రద్ధగా శ్రమించవలసి వున్నది. అయితే ఆ పోటీ, వేసిన బాటలో నడవడం వంటిదే. ఒక అభ్యర్థి తరఫున ఒక ఎన్నిక ప్రక్రియను నిర్వహించడం ఒక కఠినమైన, చిక్కుతో కూడిన బాధ్యత. ఆ విధి నిర్వహణకు ప్రావీణ్యముండాలి. రాష్ట్ర స్థాయి ఎన్నికలను పర్యవేక్షించడం, ఒక రాజకీయ పార్టీ తరఫున ఆ రాష్ట్ర శాఖ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా ఉండడమనేది ఒక సంక్లిష్ట కర్తవ్యం. ఆ కర్తవ్య పాలన వివిధ వ్యవహారాలతో ముడివడి ఉంటుంది. దీక్షాదక్షతలు, క్లిష్ట పరిస్థితులను చక్కబెట్టగల చాకచక్యం ఎంతైనా అవసరం. ఎన్నికలు ఒక నిర్ణయాత్మక ఫుట్‌బాల్ మ్యాచ్ వంటివి. అందులో ఒక జట్టు కోచ్ విజేత అవుతాడు. ప్రత్యర్థి జట్టు కోచ్ పరాజితుడు అవుతాడు. ఏ ఎన్నికలోనైనా ఒక రాజకీయ పక్షం గెలవడమో లేదా ఓడిపోవడమో జరుగుతుంది. ఒక రాజకీయ పార్టీ ఎన్నికలలో పరాజయం పాలయిన సందర్భాలు విజయం సాధించిన పర్యాయాల కంటే అధికంగా ఉంటే అందుకు కారణమైన పరిస్థితులను ప్రశాంతంగా పునరావలోకనం చేసుకోవాలి. ఎక్కడ సరైన నిర్ణయం తీసుకున్నాం, ఎక్కడ తప్పు చేశామో నిష్పాక్షికంగా పరీక్షించుకోవాలి.



▪ **పి. చిదంబరం**

ఎన్నికల యోధుడుగా నా కథ 1984 లోక్‌సభ ఎన్నికలలో నా అభ్యర్థిత్వంతో ఆరంభమయింది. దరిమిలా నేను మొత్తం ఎనిమిది పర్యాయాలు లోక్‌సభకు పోటీ చేశాను. ఏడు సార్లు గెలిచాను. నేను పోటీ చేసిన ఎన్నికలకు ముందు, ఆ తరువాత ఎన్నో ఎన్నికలను నిర్వహించాను. ఇప్పటికీ నా సొంత జిల్లాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నాను.

ఈ నాలుగు దశాబ్దాల కాలంలో ఎన్నికల భారతంలో ఎన్నో మార్పులు. అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా. అప్పట్లో పార్టీ అభ్యర్థి తరఫున ఆ పార్టీ అధినేత నియోజకవర్గానికి ఇలా వచ్చి ఓటర్లకు ముఖం చూపించి అలా వెళ్లిపోతే చాలు గెలుపు ఖాయం. ఇలా విజయాన్ని సులువుగా దక్కించుకునే అభ్యర్థులూ చాలా మంది ఉండేవారు. పార్టీ అగ్రనాయకులు బహిరంగ సభల్లో ఓటర్ల నుద్దేశించి క్లుప్తంగా ప్రసంగించినా అభ్యర్థికి తప్పక విజయం సిద్ధించేది. తాము అభిమానించే నాయకుని భావభంగిమలను చూసి సంతృప్తిపడే ఓటర్లు అసంఖ్యాకంగా ఉండేవారు. ఆ సంతృప్తితో ఆ నాయకుడు చెప్పిన అభ్యర్థిని ఎన్నుకోవడానికి సందేహించేవారు కాదు. ఇటువంటి పరిస్థితి ఇంకెంత మాత్రం లేదు. ఒకప్పుడు ఒక అభ్యర్థి ఒక కులపెద్ద లేదా కులపెద్దల మద్దతు సమకూర్చుకునేవాడు. అది చాలు ఆ కులానికి చెందిన ఓటర్లలో అత్యధికుల ఓట్లను స్వాయత్తం చేసుకునేందుకు. కుల అభిమానం అలా పనిచేసేది. మరి అటువంటి మద్దతును అభ్యర్థులు ఇప్పుడూ సాధించుకుంటున్నారా? లేదు, అ సులభ పరిస్థితి ఇంకెంత మాత్రం కొనసాగడం లేదు. కాలం మారింది, సందేహం లేదు. ఒకప్పుడు ఒక రాజకీయ పక్షం తన సంకల్పాలు, వాగ్దానాల గురించి వివరించే మేనిఫెస్టో (ఎన్నికల ప్రణాళిక) అనవసర వ్యవహారంగా ఉండేది. ఇప్పుడా? అలా కానే కాదు. 'కథనం' (ముఖ్యంగా ఒక నాయకుడు ఉత్తమ పురుషలో మాట్లాడుతూ శ్రోతలను ఉర్రూతలూగించే నాటకీయ వచో వైభవం) ప్రాధాన్యాన్ని రాజకీయ పార్టీలు కనుగొనని కాలం ఒకటి ఉండేది. అయితే ఇప్పుడు ఆ మాట తన అనేకానేక అర్థ /భావ భేదాలతో ఈ కాలం ఎన్నికలను అపరిమితంగా ప్రభావితం చేస్తోంది. నాడు ఎన్నికల ఉపకరణాలుగా ఉన్న మెగా ఫోన్‌లు, మైక్రో ఫోన్‌లు, కరపత్రాలు, జెండాలు, పూలమాలలు నేడు పూర్తిగా కాలం చెల్లినవై పోయాయి. సామాజిక మాధ్యమాలు, టెలివిజన్ వాణిజ్య ప్రకటనలు, నకిలీ వార్తలు, పెయిడ్ న్యూస్ మొదలైనవి నేటి ఎన్నికల ప్రధాన, ప్రభావదాయక ఉపకరణాలుగా ఉన్నాయి. కొన్ని వార్తా పత్రికలు చిత్తశుద్ధి, వృత్తి ధర్మ నిబద్ధత, నైతిక నిష్ఠతో వ్యవహరిస్తున్నాయి. ఇదే మన ప్రజాస్వామ్యానికి కొండంత రక్ష. అయితే రాబోయే పది సంవత్సరాలలో ఎన్నికల వ్యవహారాలలో వార్తా పత్రికలు పూర్తిగా అనవసరమైపోవచ్చని నేను భావిస్తున్నాను. భయపడుతున్నాను కూడా.

ఎన్నికల భారతంకు నేను ఐదు దశాబ్దాలకు పైగా ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాను. ఎన్నో నాటకీయ మార్పులు, మరెన్నో విచిత్ర పరిణామాలు సంభవించాయి. వాటిలో కొన్ని మాత్రమే స్థిరమైనవి, నిరంతరమైనవి, శాశ్వతమైనవి సూక్ష్మ వ్యత్యాసాలు, నాజూకు మార్పులతో సుమా! ఒక రాజకీయ పక్షానికి, ఆ మాటకొస్తే అధికారం కోసం పోటీపడే ఏ రాజకీయ పక్షం అయినా నిభాయించుకు రావాల్సిన నిరంతర ప్రాధాన్యమున్న వ్యవహారాలు కొన్ని ఉన్నాయి. అవేమిటో వివరంగా చూద్దాం.

తొలుత ప్రస్తావించవల్సింది నగర, జిల్లా, కింది స్థాయి కమిటీలు: ఒక రాజకీయ పక్షం జాతీయ అధిష్ఠాన వర్గం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమవుతుంది. ఇది సరిపోతుందా? సరిపోదు గాక సరిపోదు. పార్టీ జాతీయ కార్యవర్గమే కాదు, నగర, జిల్లా, మండల, గ్రామ, వార్డు స్థాయి కమిటీలు కూడా నిర్దిష్ట కాల వ్యవధుల్లో క్రమబద్ధంగా సమావేశమవుతుండాలి. తమ పరిధిలోని ప్రజల వ్యవహారాలను సమీక్షిస్తుండాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఈ కమిటీలు ప్రతి రోజూ 24 గంటలూ ప్రజలకు సన్నిహితంగా ఉండి తీరాలి. మరి ఒక రాజకీయ పక్షం అనేక సంవత్సరాలుగా నగర, జిల్లా, కింది స్థాయి కమిటీలను నియమించని పక్షంలో ఆ పార్టీని ఏమనాలి? సదరు రాజకీయ పక్షం సంబంధిత రాష్ట్రంలో కేవలం ఒక భావనాత్మక పార్టీగా మాత్రమే ఉందని నేను అంటాను. సరైన భౌతిక అస్తిత్వం లేని పార్టీ ప్రజలకు ఎలా చేరువవుతుంది?

సమ్మిళిత విధానాలు, ఆచరణలు: కులమతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా ప్రతి భారతీయ పౌరునికీ తమ పార్టీలో సభ్యత్వానికి అర్హులు అనీ, పార్టీ సంస్థాగత సంఘాలలో అటువంటి అంతరాలకు తావులేని రీతిలో అందరికీ ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పని రాజకీయ పక్షం ఏదీ లేదు. అయితే వాస్తవమేమిటి? ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేయడంలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలను తప్పక పరిగణనలోకి తీసుకోవడం జరుగుతోంది. గెలవదగిన సత్తా ఉన్నదనే పేరుతో ప్రత్యర్థి వర్గం లేదా నిర్దిష్ట కులానికి చెందిన అర్హులైన అభ్యర్థులకు మొండిచెయ్యి చూపడం జరుగుతోంది! ఒక నిర్దిష్ట కులానికి చెందినవారు తమ పార్టీకి గట్టి మద్దతుదారులు అనీ, మరొక నిర్దిష్ట కులానికి చెందిన ఓటర్లు ప్రత్యర్థి పక్షం వైపు మొగ్గుతారనే పూర్వ భావనలు సరైన అభ్యర్థుల ఎంపికను తప్పుదోవ పట్టిస్తోంది. కేవలం ఒక కులానికి చెందిన వారినే ఎంపిక చేస్తూ మరో కులం వారిని పూర్తిగా ఉపేక్షించడం జరుగుతోంది. నష్టపోయేది ఎవరు? లాభపడేది ఎవరు? అసలు ఇటీవలి దశాబ్దాలలో ఎన్నికలపై కులం ప్రభావం గణనీయంగా బలహీనపడిందనేది నా అనుభవం. సరే మహిళా అభ్యర్థుల ఎంపిక విషయానికి వచ్చేసరికి గెలుపే గీటురాయిగా ప్రతి స్థానానికీ పురుష అభ్యర్థిని ఎంపిక చేసేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.



పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను సంఘటితం చేయడంలో ద్రావిడ పార్టీలు డిఎంకె, అన్నాడిఎంకె పథ నిర్దేశకత్వం నెరపాయి. ఇటీవలి కాలంలో ఆరెస్సెస్ మద్దతుతో ద్రావిడ పార్టీలను అనుకరించడానికి బీజేపీ ప్రయత్నించి కొంతమేరకు సఫలమయింది. పోలింగ్ బూత్ కమిటీలను సరైన విధంగా నియోగించడంలో విఫలమైన రాజకీయ పక్షాలు సంభావ్య మద్దతుదారుల ఓట్లను కోల్పోతాయి.

క్రమశిక్షణ లోపించిన పార్టీ ఏమి సాధించగలుగుతుంది? ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పక్షంలోనూ క్రమశిక్షణ మటుమాయమైపోతోంది. అరాచకం ప్రబలుతోంది. పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థికి వ్యతిరేకంగా పని చేయడం సర్వసాధారణమైపోయింది. తిరుగుబాటు అభ్యర్థులు పెరిగిపోతున్నారు (వీరిలో కొందరు ప్రత్యర్థి వర్గం వారు నిలబెట్టినవారై ఉండడం కద్దు). ఈ పరిణామాలు ఇప్పుడు వెర్రితలలు వేస్తున్నాయి. పార్టీ విజయావకాశాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. తిరుగుబాటు అభ్యర్థి గెలుచుకున్న ఓట్ల సంఖ్య అధికారిక అభ్యర్థిని మూడు లేదా నాలుగో స్థానానికి నెట్టివేస్తున్నాయి. కొండొకచో డిపాజిట్ గల్లంతవడానికీ కారణమవుతున్నాయి. ఎన్నికల సంఘం ప్రజలకు అందుబాటులో ఉంచిన సమాచారాన్ని నిశితంగా విశ్లేషిస్తే ఒక రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో తిరుగుబాటు అభ్యర్థుల కారణంగా ఒక పార్టీ అక్షరాలా 17 సీట్లను కోల్పోయింది.

పోలింగ్ బూత్ స్థాయి కమిటీల ప్రాధాన్యాన్ని రాజకీయ పక్షాలు గుర్తించాయా? కొన్ని పార్టీలు మాత్రమే ఈ కమిటీల ప్రాధాన్యాన్ని గుర్తించాయి. పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను సంఘటితం చేయడంలో ద్రావిడ పార్టీలు (డిఎంకె, అన్నాడిఎంకె) పథ నిర్దేశకత్వం నెరపాయి. ఇటీవలి కాలంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మద్దతుతో భారతీయ జనతా పార్టీ ద్రావిడ పార్టీలను అనుకరించడానికి ప్రయత్నించి కొంత మేరకు సఫలమయింది. ఎన్నికల చివరి అంకంలో పోలింగ్ బూత్ స్థాయి కమిటీలు మాత్రమే ప్రభావశీల ప్రచారాన్ని నిర్వహించగలుగుతాయి. పోలింగ్ రోజున ఓటర్లను సమీకరించగలుగుతాయి. పోలింగ్ బూత్ కమిటీలను సరైన విధంగా నియోగించడంలో విఫలమైన రాజకీయ పక్షాలు సంభావ్య మద్దతుదారుల ఓట్లను కోల్పోతాయి.

ఎన్నికల నిర్వహణలో దక్షత చాలా ముఖ్యం. ఎన్నికలలో పోటీచేయని, చాలా అరుదుగా మాత్రమే ఎన్నికలలో విజయం సాధించిన వ్యక్తి సమర్థుడైన ఎన్నికల వ్యవహారాల ఇన్‌ఛార్జి కాడు, కాలేడు. ఎన్నికల ఇన్‌ఛార్జి అయిన వ్యక్తి పోలింగ్ తేదీకి ఆరు నెలల ముందు నుంచి తాను బాధ్యత వహించే రాష్ట్రంలో ఉండి తీరాలి. ఆ రాష్ట్రంలోనే నివసించి తీరాలి. ఆ ఇన్‌ఛార్జికి నవీన సాంకేతికతల పట్ల సంపూర్ణ అవగాహన ఉండడం చాలా ముఖ్యం. కుల పక్షపాతాలు ఉండకూడదు. జెండర్ వివక్ష అసలే పనికిరాదు. అసమ్మతివాదులను, తిరుగుబాటుదారుల కోపతాపాలను తగ్గించగల తెలివితేటలు ఉండాలి; వారిని శాంతపరిచే ఓర్పు ఎంతైనా అవసరం. ఇటువంటి అర్హతలు ఉన్న నేతలు అన్ని పార్టీలలోను ఉన్నారు. అయితే చాలా మంది ఇటువంటి యోగ్యతలు లేనివారు. సర్వజ్ఞుడినని భావించే ఇన్‌ఛార్జీలు పార్టీకి హానిచేసేవారు అవుతారు.

ధన బలం. డబ్బు చాలా ముఖ్యమే కానీ అది జయాపజయాల నిర్ణయాత్మక కారణం కాదు. ఓటర్లకు డబ్బును పంపిణీ చేయడం పూర్తిగా వ్యర్థం. ప్రత్యర్థి అభ్యర్థులు కూడా డబ్బు పంపిణీ చేస్తారు కదా. సామాజిక మాధ్యమాలు వినియోగించుకునేందుకు అయ్యే వ్యయాలకు డబ్బును వాడుకోవాలి. పోలింగ్ బూత్ కమిటీకి కొంత డబ్బు కేటాయించాలి. పోలింగ్ రోజున ఓటర్ల సమీకరణకు అది ఉపయోగపడుతుంది. చాలా మంది అభ్యర్థులు ఎన్నికల తేదీకి చాలా ముందే తమ ఆర్థిక వనరులు ఖాళీ అయిపోయాయని వాపోతుండడం కద్దు.

నాలుగు దశాబ్దాల ఎన్నికల అనుభవాల నుంచి నేను నేర్చుకున్న చివరి పాఠమేమిటంటే ప్రస్తావిత ఎన్నికల పాఠాలను ఒక రాజకీయ పక్షం నేర్చుకోని పక్షంలో గెలిచే అవకాశమున్న ఎన్నికలలో కూడా ఆ పార్టీ పరాజయం పాలవుతుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

రతన్ టాటాను ఆదర్శంగా తీసుకోవాలి

ఏడవ శతాబ్దంలో ఇరాన్ జోరాస్టియన్లపై అరబ్‌దేశాలు దండయాత్రలు చేసిన దరిమిలా భారత ఉపఖండానికి వలస వచ్చిన బాధిత కుటుంబాల వారే టాటాల పూర్వీకులు. టాటాల వ్యాపార ఎదుగుదల పరంపరలో జంషెడ్‌జి టాటా, జేఆర్‌డి టాటా, రతన్ టాటాలు ప్రముఖులుగా చరిత్రలో నిలిచిపోయారు. 1904 సంవత్సరంలో జంషెడ్‌జి టాటా బిహార్‌లోని జంషెడ్‌పూర్‌లో భారత ఉపఖండంలోనే మొట్టమొదటి స్టీల్ ఫ్యాక్టరీ ప్రారంభించారు. కాలక్రమంగా టాటాలు గుండు సూది నుండి విమానం వరకు ఉప్పు నుండి అనేక వినియోగ వస్తువుల తయారీ పరిశ్రమలను స్థాపించి భారతదేశంలోనే కాకుండా ప్రపంచ పారిశ్రామిక వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలిచారు. అనుదినం టాటా వస్తువులను ఉపయోగించకుండా ఒక్క కుటుంబం కూడా ఉండకపోవచ్చు. ఉత్పత్తి, వ్యాపార పెట్టుబడులు ఇతోధికంగా పెట్టినప్పటికీ టాటాలు సామాజిక సేవాదృక్పథం కలిగినవారని దేశంలో సాధారణ ప్రజలు కూడా గుర్తిస్తారు. జాతిపిత మహాత్మా గాంధీ ఒక సందర్భంలో ఈ దేశ పెట్టుబడిదారులలో అనేక మంది టాటాల వంటివారే కావాలని ఆకాంక్షించాడు.

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విచ్చలవిడిగా అమలు జరుగుతున్న ప్రస్తుత కాలంలో పెట్టుబడిదారులు, అవినీతిపరులైన ఉన్నతాధికారులు, దోపిడిచేసే రాజకీయ నాయకులు కుమ్మక్కై, తమ పరస్పర ప్రయోజనాల కోసం రాజకీయాలను వ్యాపారపెట్టుబడులను సమ్మిళితం చేసి అక్రమార్జనలకు ఎగబడుతున్న రోజులివి. మనదేశంలో క్రోనీ క్యాపిటలిజం అతివేగంగా విస్తరిస్తున్న పరిస్థితులలో టాటా సంస్థల వ్యాపారాలు అందులో భాగస్వామ్యం ఆశించకపోవడం ఒక గొప్ప విశేషం. ఈ నెల తొమ్మిదవ తారీకు తుది శ్వాస విడిచిన రతన్ టాటా ఒక విశిష్టమైన సామాజిక స్పృహ కలిగిన వ్యాపారవేత్త అని సాధారణ ప్రజలు కూడా కొనియాడుతున్నారు. ఆయన లేని లోటును తీర్చలేమని అనేకమంది జాతీయ అంతర్జాతీయ ఉన్నతశ్రేణి మహనీయులు ఆందోళన వెలిబుచ్చారు. రతన్ టాటా ఒక గొప్ప మానవతావాది. సామాజిక సంక్షేమం కోసం నిత్యం తపించిన పెట్టుబడి వ్యాపారవేత్త. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న సందర్భంగా అనేక ప్రైవేట్ వైద్య ఆరోగ్య సంస్థలు ప్రజలను పీల్చి పిప్పిచేసిన ఉదంతాలు ఎన్నెన్నో. కానీ రతన్ టాటా తన కంపెనీల లాభాల నుండి 1500 కోట్ల రూపాయలు భారత ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. అనేక ఆరోగ్య వైద్య సంస్థలు, గ్రామీణ అభివృద్ధి, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు నెలకొల్పి దేశ ప్రజల కోసం తన వంతు బాధ్యతను నిర్వహించారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉన్నత విద్య కొరకై పెద్ద మొత్తంలో ఉపకార వేతనాలు ఇస్తున్నారు. తన సంపాదన కంటే ప్రజల సంక్షేమం ముఖ్యమని భావించిన మానవతావాది రతన్ టాటా. అమెరికాలో ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లభించినప్పటికీ అంగీకరించక, దేశ అభివృద్ధిలో తనవంతు కృషి చేయాలని అనేక ఉత్పత్తి వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసిన గొప్ప జాతీయవాది. ఎంతో సంపదకు వారసుడైనప్పటికీ సాధారణ జీవితానికి ప్రాధాన్యతనిచ్చిన నిరాడంబర వ్యక్తిత్వం రతన్ టాటాది.




రాష్ట్రంలో ప్రభుత్వ విద్య, వైద్య రంగాలు దయనీయమైన స్థితిలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో ఉంది. ఈ రెండు రంగాలను అభివృద్ధి చేయడంలో రాష్ట్ర సంపన్న వర్గాలు ప్రభుత్వానికి చేయూతనిచ్చి రతన్ టాటా నుంచి స్ఫూర్తిని పొందాలి.

ధరల పెరుగుదల, నిరుద్యోగిత, ఆర్థిక అసమానతలు ఉన్న పరిస్థితులలో ప్రస్తుత ఆధునిక అత్యున్నతస్థాయి పెట్టుబడిదారులు లాభాల వరదల్లో జలకాలాడుతున్నారు కానీ, తమ లక్షల కోట్ల రూపాయల లాభాల్లో పేద ప్రజల యోగక్షేమాలకు, విద్య వైద్య సౌకర్యాలకు తమ వంతుగా కొంత ఇవ్వడానికి, కర్తవ్యాన్ని నెరవేర్చడానికి ముందుకు రావలసిన సందర్భం ఇది. తెలంగాణ రాష్ట్రంలో కూడా గత పది సంవత్సరాలలో అనేకమంది కార్పొరేట్ దిగ్గజాలుగా ఎదిగిన ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత పది సంవత్సరాల విధ్వంసపు పరిపాలనలో భాగంగా మన రాష్ట్రంలో ప్రభుత్వ విద్య వైద్య రంగాలు దయనీయమైన స్థితిలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో ఉంది. ఈ రెండు రంగాలను అభివృద్ధి చేయడంలో రాష్ట్ర సంపన్న వర్గాలు ప్రభుత్వానికి చేయూతనిచ్చి రతన్ టాటా నుంచి స్ఫూర్తిని పొందాలి. రాష్ట్ర అభివృద్ధిలో తమ పాత్ర పోషించి ప్రజల మన్ననలు పొందడానికి కృషి చేస్తే టాటాల లాగా చరిత్రలో నిలిచిపోతారు. రతన్ టాటా దాతృత్వం, మానవతావాదం, జాతీయవాదం లాంటి లక్షణాలన్నీ పుణికిపుచ్చుకొని ఆధునిక పెట్టుబడిదారులు తమవంతు కర్తవ్యాన్ని నెరవేర్చవలసి ఉంది. గాంధీ మహాత్ముడు ఆకాంక్షించిన విధంగా ఈ దేశానికి దళారీ పెట్టుబడిదారులు కాకుండా రతన్ టాటా వంటి మానవతావాద పెట్టుబడిదారులు అవసరం.

▪ **ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ**

నవతరానికి స్ఫూర్తి

సామాన్య కుటుంబంలో జన్మించి, అత్యున్నత శిఖరాలను అధిరోహించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితం నవతరానికి స్ఫూర్తి. నేడు ఆయన జయంతి. బాల్యంలో పేదరికాన్ని, కష్టాలను ఎదుర్కొన్నా, మొక్కవోని దీక్షతో, ఆత్మవిశ్వాసంతో విద్యాభ్యాసం కొనసాగించాడు. ఒక స్థిరమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, ఆ లక్ష్యం చేరాలని కలలు కన్నాడు, నిరంతర సాధనతో చేరుకున్నాడు. భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన ఆ మహానుభావుడి జీవితం మనకు నిత్య ప్రేరణ.



ఇంటర్మీడియట్ తర్వాత ఇంజనీరింగ్‌లో చేరడంకోసం ఆయన మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి దరఖాస్తు చేసుకున్నాడు. ఎంపిక అయితే అయ్యాడు కానీ, వెయ్యి రూపాయల ఫీజు కట్టలేనిస్థితిలో సోదరి జోహార తన గాజులు గొలుసు కుదువపెట్టి సహాయం చేసింది. కలామ్ సామర్థ్యంపై ఆమెకున్న నమ్మకం అటువంటిది. తన సొంత సంపాదనతో ఆమె గాజులు విడిపిస్తానని అప్పుడే ఆయన మనసులో ఒట్టు పెట్టుకున్నాడు. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న తర్వాత డాక్టర్ అబ్దుల్ కలాం మన విమానాన్ని మనమే తయారు చేసుకుందాం అని తమిళంలో ఒక వ్యాసం రాసి పోటీలో మొదటి బహుమతి పొందడంతో పాటు, అందరిలోనూ ఆశ్చర్యాన్నీ, ఆసక్తినీ రేకెత్తించాడు. తన చిరకాల స్వప్నం నిజం చేసే రెండు ఉద్యోగ అవకాశాల్లో ఒకదానిని ఆయన ఎంచుకున్నాడు. ఇంజనీరుగా, శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా తన సేవలను ఈ జాతికి అందించాడు. రామేశ్వరం నుండి రాష్ట్రపతిగా ఎదిగిన ఆయన జీవిత చరిత్ర తెలుసుకొని, స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం ముందుకు సాగాలి.

– **దేవులపల్లి రమేశ్**

వ్యాయామం ఎంతసేపు?

ఆరోగ్యం మెరుగ్గా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం చేయాలి. అయితే అధిక కొవ్వు కరగడానికి ఎంతసేపు వ్యాయామం చేయాలి? దీనికి సమయ పరిమితి ఉంటుందా?

తక్కువ సమయంలో ఎక్కువ తీవ్రతతో కూడిన వ్యాయామాలు చేయడం, ఎక్కువ సమయం పాటు తక్కువ తీవ్రతతో వ్యాయామాలు చేయడం... అధిక బరువు తగ్గించుకోవడం కోసం ఈ రెండిట్లో ఏ మార్గాన్ని ఎంచుకోవాలనే విషయంలో ఎంతోమందికి అయోమయం ఉంటుంది. అయితే తక్కువ సమయంలో ఎక్కువ తీవ్రతతో కూడిన వ్యాయామాలకు బదులుగా వారంలో ఐదు రోజుల పాటు రోజుకు గంట చొప్పున వ్యాయామాలు చేయడం మేలని ఓ అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనం కోసం 18 నుంచి 49 ఏళ్ల మధ్య ఉన్న 44 మందిని ఎంపిక చేసి, వారిని మూడు గ్రూపులుగా వి



భజించారు. మొదటి గ్రూపు వారంలో ఆరు రోజుల పాటు వ్యాయామం చేస్తే, రెండవ గ్రూపు వారంలో రెండు రోజుల పాటు, మూడవ గ్రూపు వ్యాయామానికి దూరంగా ఉండేలా చేశారు. చివర్లో వీళ్లందరినీ పరీక్షించినప్పుడు మొదటి గ్రూపు మిగతా రెండు గ్రూపుల కంటే ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేసి, బరువు తగ్గినట్టు తేలింది. కాబట్టి వారంలో కనీసం ఐదు రోజుల పాటు రోజుకు గంట చొప్పున వ్యాయామం చేయడం మేలు. ఇలా వ్యాయామం చేస్తూ, ఆహారపుటలవాట్లను అదుపులో పెట్టుకుంటే అధిక బరువును తేలికగానే తగ్గించుకోవచ్చు.

రెమెడీ

తలనొప్పి తగ్గే మార్గం...

తలనొప్పికి ఒత్తిడి కారణమైతే దాన్ని తొలగించుకునే మార్గాలను అన్వేషించడంతో పాటు, ఒత్తిడి లేని జీవితాన్ని గడిపే మెలకువలను అలవరుచుకోవాలి.

- రోజుకు మూడు సార్లు నియమిత వేళల్లో భోజనం తినాలి.
- తాజాగా వండిన, వేడిగా ఉన్న, వేడి వేడి సూప్‌లు తాగాలి. చల్లగా, పొడిగా, పెళుసుగా ఉండే పదార్థాలు తినకూడదు. తీపి, ఉప్పు, కారం తగ్గించాలి.
- కాఫీ, టీలు మానేసి, వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగుతూ ఉండాలి.



- గోరువెచ్చని నూనెతో శరీర మర్దన ఉపయోగపడుతుంది. స్నానానికి ముందు ఈ అభ్యంగన ఆచరించాలి. ఇలాంటి స్నానంతో రక్తప్రసరణ మెరుగై, నాడీ వ్యవస్థ నెమ్మదించి పెరిగిన తల భారం తగ్గుతుంది. గంధం పొడి, రోజా పువ్వుల నుంచి తీసిన నూనెలను కలిపి, కణతల దగ్గర మర్దన చేసుకున్నా ఫలితం ఉంటుంది.
- యోగాభ్యాసంతో శరీర కణజాలానికి పోషణ అంది, నాడీ వ్యవస్థ, అంతఃస్రావ వ్యవస్థ, లింఫ్ వ్యవస్థలు చైతన్యమవుతాయి. కండర కణజాలం స్వాంతన పొంది, నొప్పి తగ్గుతుంది. ఇందుకోసం ముందుకు వంగే వీలున్న ఆసనాలు వేయాలి.
- పిప్పర్‌మింట్, లావెండర్ ఎసెన్షియల్ నూనెలు కూడా ఉపయోగపడతాయి.
- ధ్యానం కూడా ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది
- స్నేహితులతో సరదాగా కాలక్షేపం చేయడం, ఆహ్లాదరకమైన పరిసరాల్లో స్వాంతన పొందడం వల్ల కూడా ఉపశమనం ఉంటుంది.

హెల్తీ డ్రింక్

ఫ్రూట్ వాటర్

పళ్లు కలిసిన నీళ్లు తాగితే బడలిక తొలిగి, కొత్త ఉత్తేజం దక్కుతుంది. వేసవి తాపం, దాహం తీరడంతోపాటు ఉపశమనాన్ని అందించే ఈ హెల్తీ డ్రింక్ తాగి చూడండి!



కావలసిన పదార్థాలు:
స్ట్రాబెర్రీలు - 4, నిమ్మకాయ - 1
నీళ్లు - 4 గ్లాసులు, తులసి ఆకులు - 5
తేనె - 1 టేబుల్ స్పూను

తయారీ విధానం:
- స్ట్రాబెర్రీలు శుభ్రంగా కడిగి, ముక్కలు చేసి పెట్టుకోవాలి.
- నిమ్మకాయ చక్రాలుగా కోసుకోవాలి.
- వెడల్పాటి గిన్నెలో నీళ్లు నింపి, ముక్కలు, తేనె, తులసి ఆకులు వేసి కలపాలి.
- ఈ గిన్నెను ఫ్రిజ్‌లో 3 గంటల నుంచి 2 రోజుల వరకూ ఉంచి వాడుకోవచ్చు.



అడపాదడపా మతిమరుపు వేధించడం సహజమే! అలాగని ప్రతిదీ ఒకటికి పది సార్లు సరిచూసుకుంటున్నా, చేసిన పనే పదే పదే చేస్తున్నా ఆ పరిస్థితిని 'అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్'గా భావించాలి. ఈ రుగ్మత దైనందిన జీవితాన్ని దెబ్బ తీస్తున్నా, ఇతరులకు ఇబ్బంది కలుగుతున్నా మానసిక వైద్యులను సంప్రతించాలి.

ఇది మతిమరుపు కాదు
మానసిక సమస్య

చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తూ ఉండడం (కంపల్షన్), అవసరం లేకపోయినా ఒక పని/వస్తువుకు విపరీతంగా ఆకర్షితులవడం(అబ్సెషన్)... ఇలా ఒసిడి రెండు రకాలుగా ఉంటుంది. కొందరిలో ఈ రెండు సమస్యలూ కలిసి ఉండవచ్చు. గోళ్లు కొరుక్కునే అలవాటు, ఇంటికి రాగానే చేతులు శుభ్రం చేసుకునే అలవాట్లను ఒసిడిగా భావించకూడదు. ఇలాంటివి అలవాట్లు మాత్రమే, వ్యసనాలు కాదు. అయితే కొందరు అర్థం లేని ఆందోళనలు, భయాలకు లోనవుతూ ఉంటారు. పిల్లలు బడి నుంచి సమయానికి ఇంటికి చేరుకోకపోతే, వాళ్లకేదో ప్రమాదం జరిగి ఉండొచ్చని ఊహించుకుని, ఎంతో హైరానా పడిపోతూ ఉంటారు. ఇంకొందరు ఏ వస్తువును తాకినా పదే పదే చేతులు కడుక్కోవడం, రోజులో 10 సార్లు స్నానం చేయడం లేదా బాత్రూమ్‌ను మాత్రమే పదే పదే శుభ్రం చేస్తూ ఉండడం లాంటివి చేస్తూ ఉంటారు. వీళ్ల అసహజ ప్రవర్తనను ఎదుటివాళ్లు తేలికగా గ్రహిస్తారు. కానీ దాని వల్ల ఆరోగ్యానికి, ఇతరులకు చెప్పుకోతగినంత నష్టం జరగదు కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు.

లక్షణాలు ఇవే

ఎక్కువశాతం ఒసిడి వ్యక్తులకు తమ ఆలోచనలు, అలవాట్లు అర్థం లేనివని తెలుసు. అయితే ఆ అలవాట్లు, ఆలోచనలను మానుకోలేరు. ఒకవేళ బలవంతంగా నియంత్రించుకున్నా ఆత్మన్యూనతకు లోనవుతూ ఉంటారు. శుభ్రత, ఒకే రకమైన వస్తువులను సేకరించడం, శరీరంలోని ఒక అవయవం పట్ల అసహ్యం... ఇలాంటివి ఒసిడి లక్షణాలే!



ఒసిడిలో మరో కోణం 'టిక్స్'

కొందరిలో టిక్స్ సమస్య ఉంటుంది. ఇది వాళ్లకు తెలియకుండానే జరుగుతూ ఉంటుంది. వాళ్ల నియంత్రణ లేకుండా అసంకల్పిత చర్యలా జరిగిపోతూ ఉంటాయి. అవేంటంటే...

కనురెప్పలు ఆర్పడం: కళ్లు ఆర్పడం అనేది నిరంతరంగా జరుగుతూనే ఉంటుంది. కనుగుడ్లు పొడిబారకుండా ఉండడం కోసమే ఇలా చేస్తూ ఉంటాం. అయితే పదే పదే కళ్లు ఆర్పే అలవాటు ఒసిడి వ్యక్తుల్లో కనిపిస్తుంది.

కళ్లు తిప్పడం: సూటిగా చూడకుండా చూపులు తిప్పడం, అలా పదే పదే చేయడం ఒసిడి వ్యక్తుల్లో కనిపించవచ్చు.

భుజాలు కదిలించడం: ఉన్నట్టుండి భుజాలు కదిలిస్తూ ఉంటారు. ఇలా పదే పదే ప్రతి ఐదు నిమిషాలకూ చేస్తూ ఉంటారు.

ఉపయోగం లేని వస్తువులను సేకరించే వ్యసనం 'హోర్డింగ్'

ఈ సమస్య ఉన్నవారి ఇంట్లో ఒకే రకం వస్తువులు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తాయి. ఉదాహరణకు కత్తెర పట్ల వ్యసనం ఉన్న ఒసిడి వ్యక్తులు రకరకాల కత్తెరలు, వేర్వేరు సైజుల్లో ఉండేవి లెక్కలేనన్ని సేకరించి పెడతారు. అన్ని కత్తెరల వల్ల ఉపయోగం లేదనే విషయం వాళ్లకూ తెలుసు. అయినా వీలైనన్ని కత్తెరలు సేకరిస్తారు. కనిపించిన కత్తెరలన్నీ కొంటూ ఉంటారు.

'అబ్సెషన్'లో ఇలా...

- సూక్ష్మక్రిముల పట్ల అవసరానికి మించిన భయం
- తమకు, ఇతరులకు ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోననే నిరంతర ఆందోళన
- వస్తువులను ఒకే పద్ధతిలో అమర్చడం
- కొన్ని రంగులు చెడు చేస్తాయనీ, కొన్ని మంచి చేస్తాయనే ప్రగాఢ నమ్మకం
- శరీరంలో నిరంతరం జరిగే (శ్వాస, కళ్లు ఆర్పడం) జీవక్రియల పట్ల నిరంతర స్పృహ కలిగిఉండడం
- భాగస్వామి మోసం చేస్తున్నారనే అనుమానం

'కంపల్షన్'లో ఇలా...

- రోజులో ఎక్కువసార్లు చేతులు శుభ్రం చేసుకుంటూ ఉండడం
- ఒక పనిని ఒకే పద్ధతిలోనే చేస్తూ ఉండడం
- తాళం వేశానా, లేదా? స్విచ్ ఆపానా? లేదా? అని పదే పదే పరిశీలించుకోవడం
- మెట్లు, వంటింటి పాత్రలను పదే పదే లెక్కపెట్టుకోవడం
- వస్తువులను ఒకే పద్ధతిలో అమర్చుకోవడం
- తలుపు గడియ తాకడానికి, ఇతరులకు షేక్‌హ్యాండ్ ఇవ్వడానికి భయపడడం

ఒసిడికి కారణం?

ఇందుకు స్పష్టమైన వివరణ లేకపోయినా, ఈ కోవకు చెందిన వ్యక్తుల మెదడులో నిర్దిష్ట ప్రదేశాలు సాధారణంగా లేకపోవడాన్ని వైద్యులు గమనించారు. అయితే ఈ అంశాలకు సంబంధించి మరింత లోతైన అధ్యయనాలు జరపవలసి ఉంది. ఒసిడి పురుషుల్లో కంటే స్త్రీలలో ఎక్కువ. యువత, మధ్యవయస్కుల్లో ఎక్కువగా ఉంటుంది. ఒత్తిడి తోడైతే సమస్య మరింత ముదురుతుంది. ఒసిడికి జన్యువులూ కారణమనే అనుమానాలూ ఉన్నాయి. అయితే కొందరిలో ఒసిడికి కారణాలను వైద్యులు కొన్ని అంశాలను బట్టి నిర్ధారించారు. అవేంటంటే...

- తల్లితండ్రులలో ఒకరికి, తోడబుట్టినవారికి ఒసిడి ఉంటే, వారి రక్తసంబంధీకుల్లో కూడా ఈ సమస్య తలెత్తే అవకాశాలు ఎక్కువ
- మానసిక కుంగుబాటు, ఒత్తిడి
- ప్రమాదం బారిన పడడం
- బాల్యంలో లైంగికదాడికి గురవడం

నిర్ధారణ పరీక్షలు

ఒసిడి లక్షణాలను కారణాలు అనారోగ్యం కాదని నిర్ధారించుకోవడానికి కొన్ని పరీక్షలు తప్పనిసరి. ఆలోచనలు, అలవాట్లు దైనందిన జీవితాన్ని, వృత్తిగత, వ్యక్తిగత జీవితాలను ఇబ్బంది పెడుతున్నా, ఆ పనుల కోసం రోజులో కనీసం గంట సమయం తప్పనిసరిగా కేటాయిస్తున్నా ఒసిడిగా నిర్ధారించుకోవాలి.

చికిత్స ఉంది

ఒసిడిని సంపూర్తిగా వదిలించే చికిత్స లేకపోయినా, దాని వల్ల దైనందిన జీవితం దెబ్బతినే తీవ్రతను తగ్గించవచ్చు. 'టాక్ థెరపీ, సైకోథెరపీ'ల సహాయంతో ఒసిడి లక్షణాలను నియంత్రించవచ్చు. సైకోథెరపీలో 'కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ', 'హ్యాబిట్ రివర్సల్ ట్రైనింగ్' అనే రెండు రకాల చికిత్సలు ఉంటాయి. 'ఎక్స్‌పోజర్ అండ్ రెస్పాన్స్ ప్రివెన్షన్' అనే థెరపీలో, ఏ అంశాల వల్ల సదరు వ్యక్తులు ఒసిడికి లోనవుతున్నారో, ఆ అంశాలకు వారిని అలవాటు చేస్తారు. ఒకవేళ చేతులు పదే పదే శుభ్రం చేసుకునే వ్యక్తులు ఉంటే, వాళ్లు దేన్ని తాకితే అలా చేస్తున్నారో కనిపెట్టి, అదే పనిని మళ్లీ మళ్లీ చేయించి, చేతులు కడుక్కోవలసిన అవసరం లేదని నమ్మకం కలిగిస్తారు.
ఈ థెరపీలలో చేసే పనులు, వ్యసనాలు, అలవాట్లు, వాటిని ఎందుకు అలవరుచుకున్నారు? అందువల్ల ఉపయోగం ఉందా? తమతోపాటు, కుటుంబసభ్యులకు, ఎదుటివారికి ఎంత ఇబ్బంది కలిగిస్తున్నారు? ఎంత సమయం వృథా చేస్తున్నారు? అనే విషయాలను చర్చించి, వారంతట వారే తమ సమస్యను అధిగమించగలిగే మానసిక స్థైర్యాన్ని అందిస్తారు. దాంతో ఆత్మన్యూనత తొలగి తమ సమస్యను సమూలంగా అర్థం చేసుకుని సమస్య నుంచి బయటపడతారు.

వెన్నువిల్లులా



వెన్ను వంకరను సరిదిద్దే యోగాసనాలున్నాయి. క్రమం తప్పక సాధన చేస్తే, వెన్ను దృఢంగా మారి, సరైన ఆకారాన్ని సంతరించుకుంటుంది. ప్రతి ఆసనం ప్రభావం వెన్ను మీద పడుతూ ఉంటుంది. మరీ ముఖ్యంగా కొన్ని యోగాసనాలతో వెన్నులోని కండరాలలో ఒత్తిడి వదులుతుంది. వెన్నుపూసల మధ్య ఘర్షణ తగ్గి, బిగుతు సడలి, అసౌకర్యం దూరమవుతుంది.

అర్ధ అధోముఖ వక్రాసనం

- ఈ ఆసనం వేయడానికి శిక్షకుల సహాయం అవసరం. కాబట్టి జాగ్రత్తగా సాధన చేయాలి.
- గోడకు దగ్గరగా ఆనుకుని కూర్చోవాలి.
- చేతులు రెండూ నేల మీద ఉంచి, గోడకు పాదాలు ఆనించి, నెమ్మదిగా కాళ్లను పైకి జరపాలి.
- ఇలా పాదాలను పైకి జరుపుతూ శరీరాన్ని వీలైనంత పైకి లేపాలి.
- ఇలా ఆంగ్ల అక్షరం ఎల్ ఆకారంలోకి శరీరాన్ని లేపి, నెమ్మదిగా కిందకు దింపాలి.
- ఇలా చేతుల బరువు ఆధారంగా శరీరాన్ని పైకి లేపడం కొంత క్లిష్టం.
- ఆసనం వేసే సమయంలో శిక్షకుల సహాయం తప్పక తీసుకోవాలి.



వీరభద్రాసనం

- నిటారుగా నిలబడి, ఎడమ కాలును సాధ్యమైనంత ముందుకు ఉంచాలి.
- ముందుకు ఉంచిన కాలు సహాయంతో కుంగి, రెండు చేతులను పైకి లేపాలి.
- లేపిన చేతులను కలిపి, నమస్కారం చేయాలి.
- ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, కుడి కాలును ముందుకు చాపి కుంగాలి.
- ఇలా రెండు కాళ్లనూ మార్చి, మార్చి కనీసం 5 సార్లు ఈ ఆసనం వేయాలి.

బితిలాసనం

- బల్లను పోలిన ఆకారంలోకి మారాలి.
- మోకాళ్లు, అరచేతుల ఆధారంగా టేబుల్ భంగిమలోకి మారాలి.
- ఈ భంగిమలో తలను నెమ్మదిగా పైకి లేపి ఆకాశాన్ని చూడాలి.
- శ్వాస పీల్చుకుని, కొన్ని క్షణాల పాటు ఊపిరి ఆపి ఉంచాలి.
- ఇలా నాలుగు సార్లు శ్వాస పీల్చి వదిలిన తర్వాత తిరిగి తలను దించాలి.
- ఇలా దించేటప్పుడు లోతుగా వంచిన వెన్నును పైకి లేపాలి.
- తలను మరింత కిందకు ఛాతీ వైపు వంచాలి.



బాలాసనం

- మోకాళ్లు మడిచి నేల మీద కూర్చోవాలి.
- ఈ భంగిమలో మడిచిన పాదాలు పిరుదులను తాకేలా ఉండాలి.
- తర్వాత చేతులను చాపి, ముందుకు వంగాలి.
- ఇలా వంగినప్పుడు ముఖం, ఛాతీ, అరచేతులు నేలను తాకాలి.
- ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, నెమ్మదిగా పైకి లేవాలి.
- ఈ ఆసనంతో వెన్నులో ఒత్తిడి తొలగి, కండరాలకు స్వాంతన చేకూరుతుంది.



త్రికోణాసనం

- కాళ్ల మధ్య మూడు అడుగుల దూరం ఉండేలా, నిటారుగా నిలబడాలి.
- ఒక పాదం ఎదురుగా ఉండి, మరో పాదం పక్కకు తిప్పాలి.
- తిప్పిన పాదం వైపు శరీరాన్ని వంచుతూ అటు వైపు చేతితో కాలిగిలక పట్టుకోవాలి.
- మరో చేతిని, తలను పైకి లేపి ఉంచాలి.
- ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, రెండో వైపు వంగాలి.
- ఈ ఆసనంతో కటి, వెన్ను, భుజాలలోని కీళ్ల మధ్య ఒత్తిడి తొలుగుతుంది. వెన్ను సాగుతుంది.



సాలంబ సర్వాంగాసనం

- శవాసనం వేయాలి.
- కాళ్లు రెండూ కలిపి నెమ్మదిగా, నిటారుగా పైకి లేపాలి.
- నడుము చేతులతో పట్టుకుని పైకి నెడుతూ, నడుమును కూడా పైకి లేపాలి.
- ఇలా నడుముతో కలిపి, కాళ్లను మరింత నిటారుగా పైకి లేపాలి.
- నడుముతో పాటు, సాధ్యమైనంత వరకూ వెన్నునూ పైకి లేపాలి.
- ఈ భంగిమలో కేవలం తల, భుజాలు మాత్రమే నేలకు ఆనించి ఉంచాలి.





చిట్కా

నీళ్లతో మేలు!

నీళ్లు తాగడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. నీళ్లతో దాహం తీరడంతో పాటు ఆకలి కూడా అదుపులోకొస్తుంది. అంతే కాదు...

- భోజనానికి ముందు గ్లాసుడు నీళ్లు తాగితే ఆకలి తగ్గి, పరిమితంగా భోజనం ముగిస్తాం. దాంతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరకుండా ఉంటాయి.



- నిద్ర లేచిన వెంటనే లేదా ఉదయం అల్పాహారానికి ముందు నీళ్లు తాగే అలవాటు ఉన్న వాళ్లు, ఆ అలవాటు లేని వారి కంటే 44% ఎక్కువగా అధిక శరీర బరువు కోల్పోతున్నట్టు అధ్యయనాల్లో తేలింది.
- రోజూ తాగే ఒక లీటరు నీళ్ల వల్ల విశ్రాంతి దశలో సైతం శక్తి ఖర్చవుతూ ఉంటుంది.
- శీతల పానీయాలకు నీళ్లు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం. సున్నా కేలరీలతో కూడిన నీళ్లతో దాహం తీర్చుకుంటే, ఇతరత్రా వేసవి పానీయాల ద్వారా శరీరంలోకి చేరే క్యాలరీలను నియంత్రించుకోవచ్చు.
- అజీర్తి తొలగడానికీ, ఛాతీ మంట తగ్గడానికీ నీళ్లు తాగాలి.
- చర్మపు మెరుపు కోసం రోజులో 2 లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి.

ఫుడ్ ఫ్యాక్ట్

అరటిపండు తిందామా?

అరటి పండు ఎప్పుడు, ఎలా తింటే మంచిదనే విషయంలో కొంత అయోమయానికి లోనవుతూ ఉంటాం. ఈ పండులోని పోషకాలన్నీ శరీరానికి అందాలంటే అందుకు కొన్ని నియమాలు పాటించాలి. అవేంటంటే...

పక్వానికి వచ్చిన అరటిపండు కంటే బాగా మగ్గిన అరటిపండు తీపి ఎక్కువ. ఇందుకు కారణం దోరగా పండిన అరటిపండులో స్టార్చ్ పూర్తి సింపుల్ షుగర్స్‌గా విడిపోవు. అదే బాగా మగ్గిన పండులో స్టార్చ్ షుగర్స్‌గా విడిపోయి ఉంటుంది. కాబట్టి బాగా మగ్గిన అరటిపండు ఎక్కువ తియ్యగా ఉంటుంది.

- **మగ్గిన పండు ఎప్పుడు:** తోలు మీద నల్ల మచ్చలు ఏర్పడితే ఆ అరటిపండు బాగా మగ్గిందని అర్థం. ఈ పండు తేలికగా జీర్ణం అవుతుంది. వ్యాయామానికి ముందు లేదా తర్వాత తక్షణ శక్తి పొందాలంటే ఇలా మగ్గిన అరటిపండు తినాలి.



- **నిద్ర కోసం:** అరటిపండులో మన శరీరంలో స్వతహాగా తయారుకాని ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఈ అమినో యాసిడ్ నిద్రను క్రమబద్ధీకరించే సెరటోనిన్ అనే న్యూరోట్రాన్స్‌మీటర్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. మెదడులో ఉత్పత్తయ్యే అత్యంత ముఖ్యమైన రసాయనమిది. ఇది ఒత్తిడి, కుంగుబాటులను తగ్గించి నిద్రలేమిని పోగొడుతుంది.
- **పరగడుపున వద్దు:** ఈ పండులో మెగ్నీషియం, పొటాషియం, పీచు మొదలైన పోషకాలు ఉన్నా, పరగడుపున ఈ పండును తినడం శ్రేయస్కరం కాదు. దీన్లో ఉండే అత్యధిక చక్కెరలు తక్షణ శక్తిని అందించినా, అంతే వేగంగా కొన్ని గంటల వ్యవధిలోనే అలసటకూ గురిచేస్తాయి. ఆమ్లతత్వం కలిగిన అరటిపళ్లు పరగడుపున తింటే జీర్ణసంబంధ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఒకవేళ పరగడుపున అరటిపండు తినే అలవాటుంటే, ఆ పండును ఇతర పదార్థాలతో కలిపి తినాలి.



ఆగు జర!

రపామైసిన్ ఔషధంతో వృద్ధాప్యానికి అడ్డుకట్ట?

ఈ మందుతో.. పెరిగిన ఎలుకల జీవితకాలం
చిరాయువుగా జీవించేందుకు అమెరికా కుబేరుడు
బ్రయాన్ జాన్సన్ వాడుతున్న కీలక ఔషధం ఇదే!
దీని వాడకంతో పలు దుష్ప్రభావాలూ ఉంటాయని,
మరిన్ని ప్రయోగాలు జరగాలని అంటున్న వైద్యులు

ఎక్కువ కాలం బతకాలని ఎవరికుండదు చెప్పండి! దానికి రెండే మార్గాలు. ఒకటి.. పురాణాల్లో పాత్రల్లాగా ఏదైనా వరం పొందడం!! రెండోది.. శాస్త్రీయంగా ఔషధాలు, చికిత్సలు, వ్యాయామం వంటివాటితో.. వయసు మందగించే ప్రక్రియకు, వృద్ధాప్యానికి (జర) వీలైనంతవరకూ అడ్డుకట్ట వేయడం. మొదటిది ఎలాగూ అసాధ్యం కాబట్టి.. ప్రపంచ కుబేరుల్లో చాలా మంది రెండో మార్గంలో వయసు తగ్గించుకునే ప్రయత్నాల్లో మునిగిపోయారు. ఈ క్రమంలో.. చాలా మంది వైద్యనిపుణుల దృష్టిని ఆకర్షిస్తున్నది, దీర్ఘాయుష్షు దిశగా జరుపుతున్న ప్రయోగాల్లో ప్రధానంగా పరీక్షిస్తున్నది.. రపామైసిన్ అనే ఔషధమే. జీవితాన్ని పొడిగించే 'మ్యాజిక్ పిల్'గా వైద్యనిపుణులు దీన్ని అభివర్ణిస్తున్నారు. అమెరికాకు చెందిన ఔత్సాహిక టెక్ పారిశ్రామికవేత్త బ్రయాన్ జాన్సన్ (47) తన వయసును తగ్గించుకునే ప్రయోగాల్లో భాగంగా ఏడాదికి రూ.16 కోట్లు ఖర్చుచేస్తున్నట్టు ఇటీవలికాలంలో వార్తలు వచ్చాయి గుర్తుందా? ఆయన వాడుతున్న మందుల్లో కీలకమైనది ఇదే. నిత్యం తాను రపామైసిన్ తీసుకుంటున్నట్టు ఆయన ఒకసారి ట్వీట్ చేశాడు. 2009లో 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ ఏజింగ్ ఇంటర్వెన్షన్స్ టెస్టింగ్ ప్రోగ్రామ్' ఎలుకలపై జరిపిన ఒక అధ్యయనంలో.. రపామైసిన్ వల్ల వాటి జీవితకాలం 25 శాతం మేర పెరిగినట్టు తేలింది. ఆ అధ్యయనం తర్వాతే ప్రపంచం దృష్టి, యాంటీ ఏజింగ్ పరిశోధనలు చేస్తున్న వైద్యనిపుణుల దృష్టి రపామైసిన్‌పై పడింది. ఈ నేపథ్యంలోనే బ్రయాన్ వైద్యులు ఆయనకు ఈ చికిత్సను సిఫారసు చేశారు.

ఏమిటీ రపామైసిన్?

రపామైసిన్‌ను వైద్యులు 'ఇమ్యూనో సప్రెసెంట్' ఔషధంగా వాడుతారు. అవయవమార్పిడి శస్త్రచికిత్స చేసినప్పుడు గ్రహీత శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ.. కొత్తగా వచ్చిన దాత అవయవాన్ని ఫారిన్ బాడీగా భావించి దానిపై దాడి చేస్తుంది. అలా దాడి చేయకుండా రోగనిరోధకవ్యవస్థను నియంత్రించే మందులను 'ఇమ్యూనో సప్రెసెంట్స్' అంటారు. అలాగే.. యాంటీ క్యాన్సర్ చికిత్సల్లో కూడా ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. చిలీలోని ఈస్టర్ ఐలండ్‌లో కనిపించే ఒక బ్యాక్టీరియమ్ నుంచి దీన్ని తయారుచేశారు. ఈస్టర్ ఐలండ్‌ను స్థానికులు 'రపా నుయి'గా వ్యవహరిస్తారు కాబట్టి దీనికి రపామైసిన్ అని పేరుపెట్టారు. ఇది మన శరీరంలోని ఎంటీవోఆర్ అనే ప్రొటీన్‌ను నిరోధించడం ద్వారా పనిచేస్తుంది. ఆ ఎంటీవోఆర్ ప్రొటీన్.. కణాల పెరుగుదల, వ్యాప్తి, మనుగడను నియంత్రించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ లక్షణం వల్లనే.. రపామైసిన్ 'యాంటీ ఏజింగ్' ఔషధంగా పేరొందుతోంది. లాన్సెట్ జర్నల్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రచురితమైన ఒక అధ్యయన నివేదిక ప్రకారం.. వయసు పెరగడం వల్ల వచ్చే మార్పులపై రపామైసిన్ ప్రభావం ఉంటుందని, అది వాటిని నియంత్రిస్తోందని తేలింది. ఈ అధ్యయనంలో పరిశోధకులు 18,400 వ్యాసాలను విశ్లేషించి.. రపామైసిన్ ప్రభావం ఎండోక్రైన్, కండర, నాడీ వ్యవస్థలపై ఉండట్లేదని, దానివల్ల రోగనిరోధక, హృదయ సంబంధిత, చర్మ సంబంధిత ఆరోగ్యం మెరుగవుతోందని పేర్కొన్నారు.


- సెంట్రల్ డెస్క్

అమెరికా జన్యు శాస్త్రవేత్త డేవిడ్ సింక్లెయిర్ ప్రకారం.. వృద్ధాప్యం అంటే టెలోమియర్లు కుచించుకుపోయే వ్యాధి. టెలోమియర్లంటే.. కణాలకు సంబంధించిన జన్యు సమాచారాన్ని భద్రపరచుకునే భాండాగారాలు. క్రోమోజోముల చివర్లలో ఉండే ఈ టెలోమియర్ల పొడుగు.. మన వయసు పెరిగే కొద్దీ తగ్గిపోతూ ఉంటుంది. మనం పుట్టినప్పుడు 11 కిలోబేస్‌ల పొడుగు ఉండే టెలోమియర్లు క్రమంగా కుచించుకుపోతూ.. 4 కిలోబేస్‌లకు తగ్గిపోతాయి. టెలోమియర్లు కుచించుకుపోకుండా ఆపగలిగితే వృద్ధాప్యానికి చెక్ పెట్టినట్టే. కొన్నిరకాల మందులు, ఇంజెక్షన్ల ద్వారా వాటి పొడుగు తగ్గకుండా ఆపొచ్చు. కానీ, దానివల్ల అపరిమిత కణవిభజన జరిగి క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఎక్కువ.

టెలోమియర్లతో లింకుందా?

అందుకే ప్రపంచవ్యాప్తంగా చాలా మంది శాస్త్రజ్ఞులు క్యాన్సర్ ముప్పు లేకుండా వృద్ధాప్యాన్ని ఆపే ప్రయోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. టెలోమియర్ల పొడుగుకు, రపామైసిన్‌కు ఉన్న సంబంధాలపైన కూడా కొన్ని అధ్యయనాలు, ప్రయోగాలు జరిగాయి. వాటిలో స్పానిష్ శాస్త్రవేత్తలు చేసిన ఒక ప్రయోగంలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. రకరకాల కారణాలవల్ల టెలోమియర్ల పొడుగు తక్కువగా ఉన్న, డీఎన్ఏ సమస్యలున్న ఎలుకల జీవితకాలాన్ని రపామైసిన్ పొడిగించలేకపోగా, వాటి శరీరంలోని టెలోమియర్ల పొడుగును మరింత తగ్గించిందని.. ఆరోగ్యవంతమైన సాధారణ ఎలుకల జీవితకాలాన్ని మాత్రం ఈ ఔషధం పెంచగలిగిందని వారి ప్రయోగంలో తేలింది. అంటే.. టెలోమియర్లకు, రపామైసిన్‌కు ఏదో సంబంధం ఉన్నట్టే. అదేంటో పక్కాగా తెలుసుకునేందుకు పలువురు శాస్త్రజ్ఞులు కృషి చేస్తున్నారు.

సురక్షితమేనా?



ఇమ్యూనో సప్రెసెంట్ అయిన రపామైసిన్‌ను బ్రయాన్ జాన్సన్‌లాగా.. చిరాయువు కోసం, వృద్ధాప్యాన్ని ఆలస్యం చేయడానికి ఎక్కువకాలంపాటు తీసుకోవడం మంచిదేనా? అది ఎంతవరకూ సురక్షితం? అంటే.. దీనికి సంబంధించి ఇప్పటి దాకా ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో చెప్పుకోదగ్గ ఫలితాలే కనిపించాయి. మానవులపై కొన్ని ప్రయోగాలు జరిగినప్పటికీ.. అవి పరిమితమైన ప్రయోగాలే. మరింత విస్తృత స్థాయిలో, వైద్యపర్యవేక్షణలో మరిన్ని ట్రయల్స్ జరగాల్సి ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. రపామైసిన్ వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉంటాయని హెచ్చరిస్తున్నారు.

రపామైసిన్ ఇమ్యూనో సప్రెసెంట్ కాబట్టి.. దీన్ని తీసుకునే వారు తరచుగా ఇన్ఫెక్షన్ల బారిన పడే ముప్పు ఎక్కువ అవుతుంది.

నోటిలో పుండ్ల వంటి సమస్యలూ వచ్చే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర స్థాయులు పెరిగి మధుమేహం బారిన పడే ముప్పుంది. గుండెకు హాని కలిగించే కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల స్థాయులు పెరిగే ప్రమాదం ఉంది.

గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యలు పెరుగుతాయి. కడుపునొప్పి, విరేచనాల వంటి దుష్ప్రభావాలు కలుగుతాయి.

రపామైసిన్ వల్ల రోగనిరోధక వ్యవస్థ సరిగ్గా పనిచేయదు కాబట్టి.. ఏవైనా దెబ్బలు తగిలితే అవి త్వరగా తగ్గవు. రక్తకణాలు, ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గే ప్రమాదం ఉంది.

..కాబట్టి, రపామైసిన్ వినియోగం మానవులకు ఎంతవరకూ సురక్షితమో విస్తృత ప్రయోగాల్లో తేలే దాకా దాని జోలికి వెళ్లకపోవడమే మంచిదని, డాక్టర్లను సంప్రదించకుండా తీసుకుంటే ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.



కలిసొచ్చే కాలానికి..

నష్టాల ఊబి నుంచి లాభాల్లోకి వ్యాపారాలు

అందొచ్చిన కొడుకులు!

తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని నిలబెట్టిన అనిల్ అంబానీ కుమారులు అన్‌మోల్, అన్షుల్

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకని సామెత! అపర కుబేరుడు ధీరూభాయ్ అంబానీ రెండో కుమారుడు.. అనిల్ అంబానీకి ఒకరు కాదు.. ఇద్దరు కొడుకులు.. జై అన్‌మోల్, జై అన్షుల్ అచ్చం అలాగే అవసరానికి కలిసొచ్చారు. నష్టాల్లో, అప్పుల్లో కూరుకుపోయిన రిలయన్స్ పవర్‌ను రూ.20,526 కోట్ల కంపెనీగా నిలబెట్టారు. కన్న తండ్రిని సగర్వంగా తలెత్తుకునేలా చేశారు. ఆస్తుల పంపకం అనంతరం అన్న ముకేశ్ అందనంత ఎత్తుకు ఎదిగిపోతే.. నష్టాలపాలై, దివాలా తీసిన అనిల్ అంబానీ.. ఇప్పుడు పుత్రోత్సాహాన్ని అనుభవిస్తున్నారు. తండ్రి నుంచి తన వాటాగా వచ్చిన రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కొడుకులు తమ సామర్థ్యంతో మళ్లీ నిలబెట్టడంతో మురిసిపోతున్నారు. ఇటీవలే ఆయన రిలయన్స్ పవర్ షేర్లు 5 శాతం మేర పెరిగి.. 52 వారాల గరిష్ఠానికి చేరాయి. రిలయన్స్ పవర్ డెట్‌ఫ్రీ కంపెనీగా మారగా.. రిలయన్స్ ఇన్‌ఫ్రా అప్పులు 87 శాతం తగ్గిపోయాయి. రిలయన్స్ పవర్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,052.67 కోట్లు దాటింది. మరీ ముఖ్యంగా రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్‌కు కొత్త శక్తిని నింపడంలో జై అన్‌మోల్ కీలక పాత్ర పోషించారు. ఈ ఉత్సాహంతో అనిల్ అంబానీ.. భూటాన్‌లో పలు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు చేపట్టారు. డ్రక్ హోల్డింగ్ సంస్థతో కలిసి అనిల్ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ 1270 మెగావాట్ల సోలార్, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులను ప్రకటించింది. ఇంధన రంగంలో తన వ్యాపారాన్ని, పెట్టుబడులను విస్తరించడానికి రిలయన్స్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఒక కొత్త సంస్థనే ప్రారంభించారు. కాగా.. అన్నదమ్ములిద్దరిలో అన్‌మోల్ అంబానీ 2014లో రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ పగ్గాలు చేపట్టారు. 2017 నాటికి రిలయన్స్ క్యాపిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయ్యారు. అన్‌మోల్ నేతృత్వంలో.. రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్, రిలయన్స్ క్యాపిటల్ అసెట్ మేనేజ్‌మెంట్ వంటి సంస్థలు లాభాలబాట పట్టాయి. ఫలితంగా అతడి నికర విలువ రూ.20 వేల కోట్లు దాటింది. ఇతడికి ముంబైలో రూ.5 వేల కోట్ల విలువ చేసే 17 అంతస్తుల టవర్ (దాని పేరు 'ఎబోడ్') ఉంది. రోల్స్‌రాయిస్, లాంబోర్గిని తదితర హైఎండ్ కార్ల కలెక్షన్, సొంత విమానం కూడా ఉన్నాయి. ఇక.. న్యూయార్క్ వర్సిటీలోని ప్రఖ్యాత స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి బాచిలర్స్ డిగ్రీ పుచ్చుకున్న అనిల్ చిన్న కుమారుడు అన్షుల్ కూడా వ్యాపార రంగంలో సత్తా చాటుతున్నారు. అయితే, దానికన్నా అతడి విలాసవంతమైన జీవనశైలే ఎక్కువగా ప్రచారంలో ఉంది. అన్షుల్ కార్ల కలెక్షన్‌లో.. మెర్సిడెస్ జీఎల్‌కే 350, లాంబోర్గిని గల్లార్డో, రోల్స్ రాయిస్ ఫాంటమ్, రేంజ్ రోవర్ వోగ్ తదితరాలున్నాయి. బొంబార్డియర్ గ్లోబల్ ఎక్స్‌ప్రెస్ ఎక్స్‌ఆర్ఎస్, ఫాల్కన్ 2000, ఫాల్కన్ 7ఎక్స్ విమానాలు, బెల్ 412 హెలికాప్టర్ ఉన్నాయి.

నవ్య | చిత్రజ్యోతి



నాగబంధం చుట్టూ తిరిగే కథ

'డెవిల్ ద బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' సినిమాతో దర్శకుడిగానూ తన ప్రతిభను చాటుకున్న నిర్మాత అభిషేక్ నామా రూపొందిస్తున్న రెండో సినిమా 'నాగబంధం.. ద సీక్రెట్ ట్రెజర్'. 'పెదకాపు' చిత్రంతో హీరోగా పరిచయమైన విరాట్ కర్ణ ఇందులో హీరోగా నటిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్లు. సోమవారం క్లాప్ కొట్టి ఈ చిత్రాన్ని ప్రారంభించారు మెగాస్టార్ చిరంజీవి. ఈ సందర్భంగా దర్శకుడు అభిషేక్ నామా మాట్లాడుతూ 'భారతదేశంలోని 108 విష్ణు ఆలయాలు నాగబంధం ద్వారా రక్షింపబడుతున్నాయి. ఆ నాగబంధం చుట్టూ తిరిగే కథ ఇది. భక్తి, అడ్వెంచర్ ఎలిమెంట్స్ ఉంటాయి. స్పెషల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది' అని చెప్పారు. నిర్మాత కిశోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ 'హై బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఈ నెల 23 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. 2025లో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం' అని చెప్పారు.

కోహినూర్ వజ్రం కోసం...



'క్షణం' ఫేమ్ రవికాంత్ పేరేపు దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ ఓ చిత్రంలో నటిస్తున్నారు. సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ సంస్థతో ఇప్పటికే 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలలో నటించారాయన. తాజాగా, ఈ సినిమాకు 'కోహినూర్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "కోహినూర్ వజ్రాన్ని తిరిగి భారత్‌కు తీసుకురావడమే కథాంశంగా తెరకెక్కుతోన్న ఈ సినిమాను 2026లో విడుదల చేయనున్నాం. ఈ చిత్రం ఘనవిజయం సాధించి.. సిద్ధుకూ, మాకు హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తుంది" అని అన్నారు. కాగా, రవికాంత్ పేరేపు దర్శకత్వంలో ఇంతకుముందు 'కృష్ణ అండ్ హిజ్ లీల' చిత్రంలో నటించారు సిద్ధు జొన్నలగడ్డ.

బ్లాక్‌బస్టర్ పక్కా




ఎనర్జిటిక్ మ్యూజిక్‌తో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్. ఆయన ఈ నెల 19న గచ్చిబౌలిలో ఓ మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ ప్రెస్ మీట్ ఆయన సంగీతం అందిస్తున్న 'పుష్ప-2' సినిమా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "'పుష్ప-2' సినిమా ఫస్టాఫ్ వినగానే నేనూ, చంద్రబోస్ చప్పట్లు కొట్టాం. ఈ సినిమాను సుకుమార్ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవ్వడం పక్కా" అని చెప్పారు. అలాగే మ్యూజికల్ కన్సర్ట్ గురించి మాట్లాడుతూ "మన దేశంలో ఇలాంటి మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించాలని ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికి కుదిరింది. ఈ కార్యక్రమం కచ్చితంగా మీ అందరికీ మరిచిపోలేని అనుభూతిని ఇస్తుంది" అని అన్నారు.

క్రూరమైన పాత్రలో...



యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోత్ఖూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పొట్టేల్'. ఈ రూరల్ యాక్షన్ డ్రామాను నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మిస్తున్నారు. ఇందులో నటుడు అజయ్ 'పటేల్' అనే ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఇందులో ఆయన పాత్ర ఎంత క్రూరంగా ఉంటుందో ఓ పోస్టర్‌ను విడుదల చేసి హింటిచ్చారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోంది.

స్టైలిష్ లుక్‌లో ...



రామ్ పోతినేని, 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ మహేశ్‌బాబు పచ్చిగొల్ల దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. వర్కింగ్ టైటిల్ 'రాపో22'. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఇందులో రామ్ విభిన్న పాత్రలో.. స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారు. ఆయన కెరీర్‌లోనే ఓ ప్రత్యేక మైలురాయిగా నిలిచిపోయే చిత్రమిది" అని అన్నారు.

మట్కా కోసం మరోసారి



ఎన్టీఆర్ నటించిన 'టెంపర్' సినిమాలో 'ఇట్టాగే రెచ్చిపోదాం' అనే పాటలో స్టెప్పులతో రెచ్చిపోయే.. ప్రభాస్ నటించిన 'బాహుబలి' సినిమాలో 'మనోహరి' పాటలో తన వయ్యారాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు ఐటెం సాంగ్స్ స్పెషలిస్ట్ నోరా ఫతేహి. తెలుగులో లాంగ్ గ్యాప్ తర్వాత ఆమె, వరుణ్‌తేజ్ నటిస్తున్న 'మట్కా' సినిమాలో సోఫియాగా ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలోని 'లేలే రాజా' అనే రెట్రో సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటలో వరుణ్‌తేజ్‌ను ఆకట్టుకోవడానికి ఓ బార్‌లో ఆమె వేసిన స్టెప్పులు అలరించేలా ఉన్నాయి. భాస్కరభట్ల పాటను రచించగా, నీతి మోహన్ ఆలపించారు. జీ.వీ.ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. కరుణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం నవంబరు 14న విడుదలవుతోంది.



గాంధీ మెడికల్ కాలేజీకి మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబసభ్యులు, పౌర సంఘాల నేతలు



గన్‌పార్క్ వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, వివిధ సంఘాల నేతలు



నివాళి అర్పించేందుకు వచ్చిన మాజీ మంత్రి కేటీఆర్

జోహార్ సాయి బాబా

పౌర హక్కుల ఉద్యమకారుడు, ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు నివాళి అర్పించడానికి వివిధ నాయకులు, విద్యార్థులు సోమవారం గన్‌పార్కుకు తరలివచ్చారు. భౌతికకాయానికి కడసారి నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు.



ప్లాట్ల వేలం

ఇప్పుడొద్దు!

- ప్రతికూల పరిస్థితుల్లో హెచ్ఎండీఏ ఈ-వేలానికి బ్రేకులు
- ధర తగ్గితే మార్కెట్‌పై ప్రభావం పడుతుందని వెనక్కి
- ఆగస్టులోనే విక్రయించాలని నిర్ణయించిన అధికారులు
- ప్రస్తుతం వేచిచూసే ఆలోచనలో హెచ్ఎండీఏ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ పరిధిలో అందుబాటులో గల ప్లాట్లను జూలై, ఆగస్టు నెలల్లో విక్రయించాలని ప్రణాళికలు రూపొందించగా, మారిన రియల్ ఎస్టేట్ మార్కెట్ పరిస్థితులను అంచనా వేసుకొని ఈ-వేలానికి నోటిఫికేషన్ వేయకుండా వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ఒక్క ఏడాదిలో నాలుగు నుంచి ఐదుసార్లు భూములు, ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్ల విక్రయాలను చేపట్టగా, కొత్తగా వచ్చిన ప్రభుత్వంలో హెచ్ఎండీఏ ఒక్క స్థలాన్ని కూడా విక్రయించలేదు. సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తున్నది.

హైదరాబాద్ మహానగరం చుట్టుపక్కల ప్రాంతాల్లోని హెచ్ఎండీఏ భారీ లేఅవుట్ల ద్వారా గత ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఆర్థికంగా గడ్డు పరిస్థితుల మధ్య అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ కూడా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. దీనిలో భాగంగా హెచ్ఎండీఏ లేఅవుట్లలో మిగిలి ఉన్న ప్లాట్లను విక్రయించి లేఅవుట్ల అభివృద్ధి పనులను ప్రారంభించాలని యోచించింది. దీంతో రెండు విడతలుగా జూలై, ఆగస్టు నెల చివరలో ఈవేలం జరపాలని అధికారులు భావించారు.

హెచ్ఎండీఏకు మిగిలిన ప్లాట్లు

బాచుపల్లి, మేడిపల్లి, మోకిల, ఉప్పల్ భగాయత్, షాబాద్, కుర్మల్‌గూడ, తుర్కయాంజల్, తొర్రూరు, బహదూర్‌పల్లిలో ప్లాట్లను హెచ్ఎండీఏ విక్రయించింది. ఆయా లేఅవుట్లలో ఇంకా చాలా ప్లాట్లు మిగిలిపోయాయి. అధికధరకు ప్లాట్లు దక్కించుకున్న చాలామంది డబ్బులు చెల్లించడంలో వెనకడుగు వేశారు. ఒక్క మోకిలలోనే 148 మంది వరకు డిఫాల్టర్లుగా మిగిలారు. ఈ-వేలంలో వారు దక్కించుకున్న ప్లాట్లను విక్రయించాలని అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా షాబాద్‌లో 50 ప్లాట్లకు గాను కేవలం 10 మందే చెల్లింపులు చేశారు. తొర్రూరులో 504 ప్లాట్లకు 114

మిగతా 12వ పేజీలో..



- నాన్‌డ్యూటీ పెయిడ్ మందు పేరుతో విక్రయిస్తున్న కేటుగాళ్లు
- మోసపోతున్న మద్యం ప్రియులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న ఎక్సైజ్ అధికారులు

పండగొచ్చినా.. పబ్బమొచ్చినా చుక్క ఉండాల్సిందే. ఇంటికి బంధువులొచ్చినా.. స్నేహితులొచ్చినా మద్యంతో మర్యాద చేయాల్సిందే. బారసాల.. బర్త్‌డే.. స్పెషల్ దావత్.. సందర్భం ఏదైనా మద్యానికే ప్రత్యేక ఆకర్షణ. ఈ క్రమంలో రొటీన్‌కు భిన్నంగా కొత్త బ్రాండ్లకు చెందిన మద్యాన్ని రుచి చూడాలని కొందరు భావిస్తుంటారు. దీనిని అవకాశంగా తీసుకుంటున్న కొంతమంది కేటుగాళ్లు.. తమ వద్ద మిలటరీ మద్యం, గోవా, ఢిల్లీ, హరియాణాకు చెందిన వివిధ రకాల బ్రాండ్లు ఉన్నాయని నమ్మిస్తూ నకిలీ మద్యాన్ని అంటగడుతున్నారు. ఈ విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



ఖాళీ సీసాల్లో కల్తీ మద్యం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): కొందరు వ్యక్తులు ఇతర ప్రాంతాలకు చెందిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అక్రమంగా నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తుండగా, కొనుగోలు చేసిన వారు చిక్కుల్లో పడుతున్నారు. దీనిని వినియోగించడం నేరం కావడంతో పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అనుమతులు లేని మద్యాన్ని వినియోగిస్తే కేసులు తప్పవని ఆబ్కారీ అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌కు అడ్డుకట్ట వేసేందుకు ఎక్సైజ్ శాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఈ మద్యం విక్రయిస్తున్న ముఠాలపై ఉక్కుపాదం మోపుతున్నాయి. ఇటీవల కర్ణాటకలోని బీదర్, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వ్యక్తులు మెదక్ జిల్లా మీదుగా రాష్ట్రానికి వచ్చి మిలిటరీ మద్యం అంటూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వారిపై ప్రత్యేక నిఘా పెట్టిన ఎక్సైజ్ పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించిన క్రమంలో మిలిటరీ ఉద్యోగులకు ప్రభుత్వం సరఫరా చేసే మద్యం బాటిళ్లను సేకరించి.. ఖాళీ బాటిళ్లలో చీప్ లిక్కర్, కల్తీ మద్యం నింపి విక్రయిస్తున్నట్లు తేలింది. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వరుసగా దాడులు చేసిన ఎక్సైజ్ అధికారులు 23 కేసులు నమోదు చేసి 258.4 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. 8 మంది నిందితులను అరెస్టు చేశారు.



ఇటీవల ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నిందితులు

- ఈ నెల 6న తెలంగాణ నుంచి గోవా వెళ్లిన కొంత మంది తిరుగు ప్రయాణంలో రూ.12 లక్షల విలువైన 415 మద్యం సీసాలను విమానాల్లో తీసుకొస్తుండగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుకున్నారు. అదే రోజు రూ.3.85 లక్షల విలువ చేసే 72 మద్యం బాటిళ్లను చండీగడ్ నుంచి తీసుకొచ్చి నగరంలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు యత్నించిన వ్యక్తిని ఆర్టీసీ క్రాస్‌రోడ్డు మెట్రో స్టేషన్ వద్ద ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- రెండు రోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లో ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులు బార్ల నుంచి సేకరించిన ఖాళీ బాటిళ్లలో నకిలీ మద్యాన్ని నింపి ఢిల్లీ, హర్యానా, గోవా మందు పేరుతో విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు.
- హైదారాబాద్‌లోని ఓ మ్యదం దుకాణంలో ఢిల్లీ, గోవాల నుంచి నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌గా తీసుకొచ్చి అమ్మకాలు జరుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు.
- రంగారెడ్డి జిల్లాలో 23 కేసులు నమోదు చేసిన పోలీసులు 43 మందిని అరెస్టు చేసి 606 లీటర్ల మద్యానికి స్వాధీనం చేసుకున్నారు.
- సికింద్రాబాద్‌లో 32 కేసుల్లో 13 మందిని పట్టుకుని 452 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.



ప్రత్యేక దృష్టి సారించాం



పండుగల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాష్ట్రానికి రాకుండా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, ఎస్టీఎఫ్, టీటీఎఫ్ బృందాలు దృష్టి సారించాలని ఆదేశించాం. ఈ లిక్కర్‌ను ఎవరూ కొనుగోలు చేయొద్దు. ఎన్‌డీపీఎల్ మద్యం అమ్మకాలు జరిపితే 18004252523 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- వీబీ కమలాసన్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్

స్ట్రీట్ ఫై(లై)ట్!

- వీధి దీపాల నిర్వహణలో వివాదం
- రూ.144 కోట్ల బకాయిలు చెల్లించాలంటున్న ఈఈఎస్ఎల్
- ఒప్పందం నిబంధనలూ ఉల్లంఘించారని ఆరోపణ
- ఈఈఎస్ఎల్ సక్రమంగా పని చేయలేదంటున్న బల్దియా
- పూర్ ఫర్ఫార్మెన్స్‌కు మళ్లీ పనా..?
- పొడిగింపునకు ఆసక్తిచూపని జీహెచ్ఎంసీ

మహానగరంలో వీధి దీపాల నిర్వహణ జీహెచ్ఎంసీ, ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) మధ్య యుద్ధానికి దారి తీసింది. ఒప్పందం ప్రకారం చెల్లింపుల్లో జీహెచ్ఎంసీ విఫలమైందని ఈఈఎస్ఎల్ ఆరోపిస్తుండగా, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్లే బిల్లులు పెండింగ్‌లో ఉంచాల్సి వచ్చిందని బల్దియా చెబుతోంది.



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ, ఈఈఎస్ఎల్ సంస్థల మధ్య బిల్లుల పంచాయతీ ఇప్పుడు బహిర్గతమైంది. బకాయిలు, జీహెచ్ఎంసీ తీరుపై ఈఈఎస్ఎల్ ప్రకటన విడుదల చేసింది. జీహెచ్ఎంసీ నుంచి రూ.144.48 కోట్ల బిల్లులు రావాల్సి ఉందని పేర్కొంది. తమ సంస్థతో ఒప్పందం ముగియక ముందు, బకాయిల సెటిల్‌మెంట్ చేయక ముందే 15 వేల లైట్ల కోసం బల్దియా బిడ్‌లు ఆహ్వానించడాన్ని ఈఈఎస్ఎల్ తప్పుబట్టింది. బకాయిలు పేరుకుపోవడానికి నిర్వహణ సరిగా లేకపోవడం కారణం కాదని, 98 శాతం స్ట్రీట్ లైట్లు వెలిగేలా అవసరమైన చర్యలు తీసుకున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ మాత్రం ఈఈఎస్ఎల్ ఆరోపణలను కొట్టి పారేస్తోంది. ఒప్పందం ప్రకారం ఈఈఎస్ఎల్ పని చేయలేక పోయిందని, వీధి దీపాల రీప్లేస్‌మెంట్, మరమ్మతు సకాలంలో చేపట్టలేదని, గతంతో పోలిస్తే వీధిదీపాలు వెలగడం లేదన్న ఫిర్యాదులు క్రమేణా పెరగడం కారణమని పేర్కొంటోంది.

పూర్.. ఫర్మార్మెన్స్

ఈఈఎస్ఎల్ తీరుపై జీహెచ్ఎంసీ అదే స్థాయిలో మండి పడుతోంది. ఒప్పందం ప్రకారం సంస్థ పని చేయలేదని చెబుతోంది. నిబంధనల మేరకు బిల్లుల చెల్లింపులో కోత విధించామని అధికారులంటున్నారు. అవసరం మేరకు వీధిదీపాలు, ఇతర సామాగ్రీ అందుబాటులో ఉంచకపోవడంతో మరమ్మతు పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఈ విషయంపై పలుమార్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి కాట సమావేశం నిర్వహించి ఈఈఎస్ఎల్ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. మరో ఆరు నెలల్లో ఒప్పందం గడువు ముగుస్తుంది మనకెందుకులే అని జీహెచ్ఎంసీ ఎలక్ట్రిసిటీ విభాగం.. బకాయిలు చెల్లించకుంటే ఎలా పని చేస్తామని ఈఈఎస్ఎల్ ఎవరికి వారు మిన్నకుంటుండడంతో నగరంలోని పలు రహదారుల్లో చీకటి నెలకొంది. ఒప్పందం పొడిగించాలని ఈఈఎస్ఎల్ కోరుతున్నదని, పనితీరు సరిగా లేని సంస్థకు మరోసారి బాధ్యతలు ఎలా అప్పగిస్తామని ఓ అధికారి అభిప్రాయపడ్డారు. రూ.144 కోట్ల బకాయిలు లేవని, పూర్తి లెక్కలు చూస్తే వాస్తవాలు బయటపడుతాయన్నారు.

ఎంతో చేశాం.. అయినా

ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ కోసం ఏడేళ్ల కాలవ్యవధితో ఈఈఎస్ఎల్‌తో జీహెచ్ఎంసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఏప్రిల్ 2025తో ఈ గడువు ముగుస్తుందని అధికారులు

మిగతా 12వ పేజీలో..



ఆలస్యంగా దుర్గామాత నిమజ్జనాలు

- నేడు కూడా కొనసాగే అవకాశం

ఖైరతాబాద్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): దుర్గామాత నిమజ్జనాలు సోమవారం రాత్రి వరకూ కొనసాగాయి. తక్కువ క్రేన్లు ఉండడం, కేవలం పీవీ నర్సింహారావు మార్గం (నెక్లెస్‌రోడ్)లోనే నిమజ్జనాలు సాగిస్తుండడంతో ఆలస్యమవుతోంది. ఆదివారం వచ్చిన విగ్రహాలు సోమవారం ఉదయం వరకు వందలాదిగా మిగిలివుండడంతో ఊరేగింపు వాహనాలను నెక్లెస్‌రోడ్‌లోని ఎడమవైపు రోడ్డుతో పాటు మిగిలిన వాటిని ఎన్టీఆర్ మార్గం ఇందిరాగాంధీ విగ్రహం నుంచి సచివాలయం వెళ్లే రహదారిలో తరలించారు. విగ్రహాలు తీసుకువచ్చిన యువకులు తమ దుర్గామాత విగ్రహం నిమజ్జనం వంతు ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూడాల్సి వచ్చింది. కాగా, దసరా రోజైన శనివారం నుంచి సోమవారం రాత్రి 7 గంటల వరకు నెక్లెస్‌రోడ్‌లో 1,750 వరకు విగ్రహాలు నిమజ్జనం అయ్యాయని, మరో 150 వరకు విగ్రహాలు నిమజ్జనం కోసం వేచి ఉన్నాయని పోలీసులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం వరకు నిమజ్జనాలు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇంకుడు గుంతలుగా బోర్లు

- ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మారనున్న వైనం
- వరద నీటి సంరక్షణ.. భూగర్భజలాల పెంపు లక్ష్యం
- స్పెషల్ డ్రైవ్‌లో వాటర్‌బోర్డు సరికొత్త ప్రయోగం



వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

మహానగరంలో బోర్‌వెల్స్ వివరాలు	
మొత్తం పవర్ బోర్లు	2,796
వినియోగంలో ఉన్నవి	1,770
పనిచేయనివి	942
ఎండినవి, కూలిపోయినవి	84
మొత్తం హ్యాండ్ బోర్‌వెల్స్	3070
వినియోగంలో ఉన్నవి	954
పనిచేయనివి	1717
ఎండినవి, కూలిపోయినవి	339

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిరుపయోగంలో ఉన్న బోర్లను ఇంకుడు గుంతలుగా చేసి ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మార్చేందుకు వాటర్‌బోర్డు సరికొత్త ప్రయోగానికి సిద్ధమైంది. హైదరాబాద్ మహానగర పరిధిలో భూగర్భ జలాల పెంపు కోసం 'ప్రతి ఇంటా ఇంకుడు గుంత' పేరుతో చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో ఓ వైపు ప్రజలకు అవగాహన కల్పిస్తూనే, నిరుపయోగంగా ఉన్న బోర్లను ఇంకుడు గుంతలుగా మార్చేందుకు సిద్ధమైంది. వర్షపు నీటి సంరక్షణ.. భూగర్భజలాల పెంపు లక్ష్యంగా వాటర్‌బోర్డు చర్యలు చేపడుతోంది. నగరంలో వాన చినుకు భూమిలో ఇంకే పరిస్థితి లేక వరద రోడ్లపై చేరి ఒక వైపు ట్రాఫిక్‌కు అంతరాయం, మరోవైపు సీవరేజీ సమస్య తలెత్తడం సర్వసాధారణమైంది. దీన్ని తీవ్రంగా పరిగణించిన వాటర్‌బోర్డు వరద నీటిని బోర్‌వెల్స్‌లోకి మళ్లించేందుకు చర్యలు చేపడుతోంది.

3,222 బోర్‌వెల్స్ గుర్తింపు

వర్షం నీటి సంరక్షణతో పాటు భూగర్భజలాల పెంపు కోసం నిరుపయోగంగా ఉన్న సుమారు 3,222 బోర్‌వెల్స్‌ను వాటర్‌బోర్డు గుర్తించింది. జీహెచ్ఎంసీ సహకారంతో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మార్చేందుకు చర్యలకు ఉపక్రమించింది. నగర వ్యాప్తంగా 1,045 పవర్ బోర్‌వెల్స్ ఉండగా, వాటిలో కోర్‌సిటీ పరిధిలో 246, శివారు పరిధిలో 799 బోర్లు ఉన్నట్లుగా తేల్చారు. మొత్తం హ్యాండ్ బోర్‌వెల్స్ 2,177 ఉండగా వాటిలో కోర్‌సిటీలో 1665, శివార్లలో 1557 బోర్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని ఇంకుడు గుంతల నిర్మాణాలతో పూర్తిగా ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మార్చేందుకు వాటర్‌బోర్డు చర్యలు చేపడుతోంది. నిరుపయోగంగా ఉన్న బోర్లు భవిష్యత్తులో పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాల పెంపు కోసం ఇంజక్షన్ బోర్‌వెల్‌గా పనిచేయనున్నాయని, నగరవాసులందరూ సహకరించి జలయజ్ఞానికి కలిసి రావాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి కోరారు.

ఇంకుడు గుంత లేకుంటే నోటీసులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నీటి వినియోగదారులు తమ ఇళ్లల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోకపోతే వారికి నోటీసులు జారీ చేయాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంకుడు గుంత లేకపోతే జనవరి నుంచి ట్యాంకర్ బుక్ చేస్తే అదనపు చార్జీ వసూలు చేస్తామని, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులకు మెసేజ్ రూపంలో పంపించడంతో పాటు నేరుగా వారికి పత్రాలు అందజేయాలన్నారు. సోమవారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో 90రోజుల స్పెషల్ డ్రైవ్‌పై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్పెషల్ డ్రైవ్‌పై డాష్‌బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో సీవరేజీ ఓవర్ ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర వాటిపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను, మీటర్ల క్యాన్ నంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఫిర్యాదులు వచ్చిన, పరిష్కరించిన వాటి వివరాలను ఆ మ్యాప్‌లో బబుల్ (బుడగ) లా కనిపించేలాగా ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదుల సంఖ్యను బట్టి.. ఆ బబుల్ పరిమాణం మారుతుందని చెప్పారు. ఈ ఏర్పాటు వల్ల సమస్య తీవ్రతను బట్టి అధికారులు దాన్ని పరిష్కరించే వీలుందన్నారు. మ్యాన్‌హోళ్లు, డీసిల్టింగ్ వివరాలను రోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు ఎండీ సూచించారు. స్పెషల్ డ్రైవ్‌పై ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడిందన్న ఆయన.. పనితీరు కనబరిచిన సిబ్బందిని, అధికారులను అభినందించారు. సమావేశంలో డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, స్వామి, విజయరావు, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

మంగళ్‌హాట్‌లో వ్యక్తి హత్య

- ఆస్తి తగాదాల వల్లేనంటున్న బంధువులు

మంగళ్‌హాట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా బంధువులను కలిసేందుకు వచ్చిన ఓ వ్యక్తిని ముగ్గురు యువకులు దారుణంగా హత్య చేశారు. మంగళ్‌హాట్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. టక్కర్‌వాడిలోని సత్య గులాబ్ రెసిడెన్సీలో నివసిస్తున్న దుర్గేష్ సింగ్(38) దసరా పండగ సందర్భంగా ఈనెల 13వ తేదీన సమీపంలోగల బంధువులను కలిసేందుకు అర్ధరాత్రి 12 గంటల సమయంలో వెళ్లాడు. కొంతకాలంగా దగ్గరి బంధువులైన బజరంగ్‌సింగ్, సత్యనారాయణసింగ్, తుల్జారాంసింగ్‌తో అతడికి ఆస్తి తగాదాలు ఉన్నాయి. దుర్గేష్‌సింగ్‌పై గతంలో మూడుసార్లు దాడికి పాల్పడ్డారు. 13వ తేదీన బజరంగ్‌సింగ్, దుర్గేష్ సింగ్ మధ్య గొడవ జరిగింది. దుర్గేష్ స్నేహితులు ఇరువురిని సముదాయించి పంపించే ప్రయత్నం చేయగా.. బజరంగ్ అతడి ద్విచక్రవాహనం తాళాలు లాక్కున్నాడు. గొడవ పెద్దది కాకుండా ఉండేందుకు దుర్గేష్‌ను స్నేహితులు బలవంతంగా ఇంటికి పంపించారు. వాహనం తాళాలు ఇవ్వమని బజరంగ్‌సింగ్‌ను వారు కోరగా.. దుర్గేష్‌ను అప్పగిస్తేనే తాళాలు ఇస్తానని చెప్పాడు. దీంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత బజరంగ్.. దుర్గేష్‌కు ఫోన్ చేసి దుర్భాషలాడుతూ బెదిరించాడు. దుర్గేష్ విషయాన్ని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లగా బజరంగ్‌సింగ్, సత్యనారాయణసింగ్, తుల్జారాంసింగ్ అతడిపై దాడి చేసి విపరీతంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డీఎస్సీ అభ్యర్థులకు కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అపాయింట్‌మెంట్ ఆదేశాలను అందుకున్న అభ్యర్థులందరూ మంగళవారం ఉదయం 9 గంటలకు జరిగే పోస్టింగ్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని హైదరాబాద్ డీఈఓ రోహిణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆబిడ్స్‌లోని చాపల్ రోడ్డులోగల ఎస్‌ఎస్‌సీ బోర్డు ఎదుట గల స్టాన్లీ గర్ల్స్ హైస్కూల్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని, అభ్యర్థులందరూ అపాయింట్‌మెంట్ ఆర్డర్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, హాల్ టికెట్లు తీసుకురావాలని సూచించారు. కౌన్సెలింగ్ హాల్‌లోకి కేవలం అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తామన్నారు.

మధ్యాహ్నం వరకు ఎండ.. సాయంత్రం వర్షం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ దంచి కొట్టగా.. సాయంత్రానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. అమీర్‌పేట, ఎస్‌ఆర్‌నగర్, పంజాగుట్ట, యూసు‌ఫ్‌గూడ, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, మియాపూర్, హఫీజ్‌పేట తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. స్కూల్స్, కాలేజీలకు సెలవులు కావడంతో రోడ్లపై సాయంత్రం వేళ వాహనాల రద్దీ కనిపించ లేదు. ఆయా ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురవడంతో భారీగా ట్రాఫిక్ సమస్యలేవీ తలెత్తలేదు.

హైడ్రా అలర్ట్.. ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో తనిఖీలు



ప్రకాశ్‌నగర్‌లో తనిఖీలు చేస్తున్న డీఆర్‌ఎఫ్ బృందం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజుల పాటు నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తమైంది. వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో పరిస్థితిని డీఆర్‌ఎస్ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. రాజ్‌భవన్ రోడ్డుతోపాటు వరద ముంపు ఉన్న బేగంపేట, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లో డీఆర్‌ఎఫ్ బృందాలు సోమవారం తనిఖీలు నిర్వహించాయి.



మొగులయ్యను సన్మానిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

పద్మశ్రీ మొగులయ్యకు రాచకొండ పోలీసుల అండ

హయత్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ మొగులయ్యకు అండగా ఉంటామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు హామీ ఇచ్చారు. మొగులయ్య సీపీని సోమవారం కలిశారు. హయత్‌నగర్‌లో ప్రభుత్వం తనకు కేటాయించిన స్థలం చుట్టూ ప్రహరీ కూల్చివేతను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మొగులయ్యను సీపీ సత్కరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ మనోహర్, హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, ఎస్‌ఐ లింగారెడ్డి పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీని సందర్శించిన ఒడిశా ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారుల బృందం

జీహెచ్‌ఎంసీ సేవలు భేష్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్యాక్స్, ఫైనాన్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో జీహెచ్‌ఎంసీ తీసుకుంటున్న చర్యలను ఒడిశా ప్రొబేషనరీ ఐఏఎస్‌లు అభినందించారు. జీహెచ్‌ఎంసీ అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌పై అధ్యయనం చేసేందుకు వారు సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు ఆదాయ వనరులు, పర్యావరణ సుస్థిరత కోసం తీసుకుంటున్న చర్యలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ ఆస్తిపన్ను చెల్లింపులు, వివిధ సేవలు, కమర్షియల్ ట్యాక్స్ లెక్కింపు విధానం, శానిటేషన్ జాయింట్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి చెత్త సేకరణ, ప్రాసెసింగ్, భవన నిర్మాణాల వ్యర్థాల తరలింపు, రీసైక్లింగ్ వంటి అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొబేషనరీ ఐఏఎస్‌లు కస్తూరి పండ, తేజస్విని బెహరా, దుద్దల్ అభిషేక్, దిలీప్, ప్రణీతాదాస్, ప్రేక్ష అగర్వాల్, నరవసన్, ఎంసీహెచ్ ఆర్‌డీ ఫ్యాకల్టీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘గాంధీ’ ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్‌కు గ్రహణం

- ఏడాది క్రితం ప్రారంభించిన అధికారులు
- ఇప్పటికీ అందుబాటులోకి రాని వైద్య సేవలు
- పూర్తిస్థాయిలో లేని పరికరాలు
- సిబ్బంది నియామకంలోనూ అలసత్వమే



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్‌ఫెర్టిలిటీ వైద్య సేవలు అందిస్తామని ఏడాది క్రితం ప్రభుత్వం ప్రకటించింది. గాంధీ, పేట్లబురుజు ఆస్పత్రుల్లో ఈ సదుపాయం కల్పిస్తామంది. గాంధీ ఆస్పత్రిలో అధికారికంగా ఈ వైద్య సేవలను ప్రారంభించారు. ఏడాది దాటినా ఇప్పటి వరకు ఇన్‌ఫెర్టిలిటీ చికిత్సలు అందించడం లేదు. దీంతో సంతానలేమి సమస్యలున్న పేదలు ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లాల్సి రావడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ప్రకటనలకే పరిమితం

ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) విధానంలో సంతానం లేని దంపతుల్లో భార్య నుంచి అండం, భర్త నుంచి వీర్యకణాలు సేకరించి ఫలదీకరణ అనంతరం భార్య గర్భంలో పిండాన్ని ప్రవేశపెడతారు. దీనికోసం గాంధీ ఆస్పత్రిలో చికిత్సలు అందించేందుకు ఆధునిక ల్యాబ్ ఏర్పాటు చేశామని, ఎంబ్రియాలజిస్టుతోపాటు ఇద్దరు గైనకాలజిస్టులు, నర్సులు, ఇతర సిబ్బందిని నియమించినట్లు అప్పట్లో సంబంధిత అధికారులు ప్రకటించారు. అయితే ఐవీఎఫ్‌కు అవసరమైన సదుపాయాలు మాత్రం ఇప్పటికీ కల్పించలేదు. దీనికోసం ప్రత్యేక పరికరాలు, లిక్విడ్స్, మందులు కావాలి. మైక్రోస్కోపిక్ పరికరాలు అవసరం. నైట్రోజన్ సిలిండర్లు, వాటిని సరఫరా చేసే సిబ్బందిని నియమించాలి. ఒక్కో జంటకు రూ. 60 నుంచి రూ.70 వేల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉండటంతో ఆ మేరకు నిధులు కేటాయించాలి. ఇప్పటి వరకు ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదని తెలుస్తోంది.

సీనియర్ గైనకాలజిస్టులు అవసరం

ఇన్‌ఫెర్టిలిటీ చికిత్స కోసం ఇటీవల ఓ ఎంబ్రియాలజిస్టును నియమించారు. అయితే పూర్తిస్థాయిలో అవసరమైన పరికరాలు లేకపోవడంతో చికిత్స మొదలుపెట్టే పరిస్థితి లేదని తెలుస్తోంది. సిబ్బంది సైతం పూర్తిస్థాయిలో లేరు. ప్రస్తుతం ఒక సీనియర్ గైనకాలజిస్టు మాత్రమే ఉన్నారు. కొందరు బదిలీపై ఇతర ఆస్పత్రులకు వెళ్లగా వారి స్థానంలో వచ్చిన వారికి ఇన్‌ఫెర్టిలిటీ చికిత్సలో అనుభవం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

సీరియస్ కేసులే అధికం

గాంధీ ఆస్పత్రిలో గైనిక్ పడకలు 250 వరకు ఉన్నాయి. రోగుల సంఖ్య దాని కంటే ఎక్కువగా ఉంటోంది. కొన్నిసార్లు ఒకే పడకపై ఇద్దరిని ఉంచాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సైతం రోగులు ఇక్కడికి వస్తుంటారు. ప్రతిరోజూ 30 వరకు.. నెలకు 800 నుంచి 900 ప్రసవాలు జరుగుతుంటాయి. అందులో 300 నుంచి 400 వరకు ప్రమాదకర పరిస్థితి ఉన్న కేసులే. గాంధీ ఆస్పత్రికి వచ్చే ప్రసవం, గైనిక్ కేసుల్లో ఎక్కువగా సీరియస్ కేసులే ఉంటున్నాయి. చాలామందికి వెంటిలేటర్ ఏర్పాటు చేయాల్సి వస్తోంది. రోజులో సుమారు 40 మందికి స్కాన్ చేయాలి. పర్యవేక్షణకు ఒకే అధికారి ఉండటంతో ఇబ్బందికరంగా ఉంటోంది.

మీసేవ దరఖాస్తులన్నింటినీ పరిష్కరించండి

- తహసీల్దార్లకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం



దరఖాస్తుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మీసేవ ద్వారా వివిధ ధ్రువపత్రాల కోసం చేసుకున్న దరఖాస్తులన్నింటినీ వచ్చే సోమవారంలోగా పరిష్కరించాలని తహసీల్దార్లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 156 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. మీసేవ ఆపరేటర్లతో ప్రతినెలా తహసీల్దార్లు సమావేశం ఏర్పాటు చేసి వారికి దిశానిర్దేశం చేయాలన్నారు. గృహనిర్మాణం, పెన్షన్లు, భూ, తదితర సమస్యలపై ప్రజావాణికి ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు కదిరవన్, ఇ. వెంకటాచారి, ఆర్డీఓలు మహిపాల్, దశరథ్‌సింగ్, జిల్లా అధికారులు జి. ఆశన్న, పెరిక యాదయ్య, ఆర్. కోటాజి, పవన్‌కుమార్, డాక్టర్ సురేందర్, ఆర్.రోహిణి, ఇలియాజ్ అహ్మద్, షఫీమియా తదితరులు పాల్గొన్నారు

జీహెచ్‌ఎంసీలో నామ్ కే వాస్తేగా ప్రజావాణి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో సోమవారం ప్రజావాణి నామ్ కే వాస్తేగా మారింది. గత వారం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారుల తీరులో మార్పు కనిపించడం లేదు. కీలక అధికారులు కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. అందుబాటులో ఉన్న అదనపు కమిషనర్లు, ఇతర అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు. ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఫోన్ ద్వారా ఆరు, నేరుగా 26, పట్టణ ప్రణాళికా విభాగానికి 12, ఆస్తి పన్ను వివాదాలు-6, ఇతర విభాగాలకు సంబంధించిన అంశాలపై మరో ఎనిమిది మంది ఫిర్యాదు చేశారు. జోనల్ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో 52 ఫిర్యాదులు వచ్చినట్టు జీహెచ్‌ఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

కుషాయిగూడ ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర వైద్య బృందం



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర వైద్య బృందం

ఏఎస్‌రావునగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కుషాయిగూడ (జమ్మిగడ్డ)ప్రభుత్వ ఆస్పత్రిని కేంద్ర వైద్య బృందం సోమవారం సందర్శించింది. కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ కమలేష్, అశోక్‌శర్మ నేతృత్వంలో రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై వైద్య సిబ్బంది, రోగులను అడిగి తెలుసుకున్నారు. శిశువులకు బీసీజీ, ఓపీవీ, హెపటైటిస్-బి తదితర టీకాల నిర్వహణ గురించి ఆరా తీశారు. బాలింతల వద్ద ఎంసీపీ కార్డులను పరిశీలించి టీకాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి టి.రఘునాథస్వామి, వైద్యాధికారులు సత్యవతి, శోభ, సరస్వతి, రమాదేవి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మెనింజైటిస్ వ్యాధి నివారణలో వ్యాక్సినేషన్ పాత్ర కీలకం

చిక్కడపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మెనింజైటిస్ వ్యాధి నివారణలో వ్యాక్సినేషన్ కీలకపాత్ర వహిస్తుందని ప్రముఖ పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డా. కె. పవన్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ మెనింజైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం చిక్కడపల్లిలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యాధి నుంచి ముఖ్యంగా పిల్లలకు రక్షణ కల్పించడంలో రోగనిరోధక శక్తి ప్రభావాన్ని తెలియజేయాల్సి ఉందన్నారు. మెడ పట్టేయడం, జ్వరం, గందరగోళం, తలనొప్పి, వికారం, వాంతులు, మూర్ఛ, కోమా, నరాల సంబంధిత లోపాలు, వినికిడి, దృష్టి లోపం, అవయవాల బలహీనత వంటివి మెనింజైటిస్ వ్యాధి సోకిన వారిలో కనిపిస్తాయన్నారు. ప్రతియేటా ప్రపంచవ్యాప్తంగా 25 లక్షలకు పైగా కేసులు నమోదవుతున్నాయన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ 9 నుంచి 23 నెలల వయస్సు గల శిశువులు మెనింగోకాకల్ టీకా రెండు డోసులను కనీసం మూడు నెలల వ్యవధిలో తీసుకోవాలని సిఫార్సు చేసిందన్నారు. 2 నుంచి 55 సంవత్సరాల వయస్సుగల వ్యక్తులు ఒక మోతాదు తీసుకోవాలన్నారు.

బాబాఖాన్ చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు

బర్కత్‌పుర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని బాబాఖాన్ చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. బాబాఖాన్ చెరువు ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో చెరువులో మరిన్ని ఆక్రమణలు జరగకుండా చూడాలని స్థానికులు జగదీష్, కృష్ణ, అనీల్ సోమవారం బషీర్‌బాగ్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో హైడ్రాకు విజ్ఞప్తి చేశారు. అయోధ్య కాలనీ మీదుగా వెళ్లే నాలాను పునరుద్ధరించాలని కోరారు. అలుగు నుంచి వెళ్లే నాలా కబ్జా అయిందన్నారు. నాలాలను పునరుద్ధరించాలని హైడ్రాను వారు కోరారు.

కంటోన్మెంట్‌లో కారుణ్య నియామకాలు చేపట్టండి

- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఎంపీ ఈటల వినతి

న్యూఢిల్లీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలోని పారిశుధ్య కార్మికులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలో కరోనా సమయంలో విధుల్లో భాగంగా సుమారు వంద మందికి పైగా పారిశుధ్య కార్మికులు మృతిచెందారని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. దీనిని ప్రత్యేక కేసుగా పరిగణించి నియామకాలు చేపట్టాలని కోరారు. న్యాయం జరుగుతుందనే ఆశతో ఆ కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. కారుణ్య నియామకాలు ఐదుశాతం మించకూడదనే నిబంధనను సడలించి, కంటోన్మెంట్ ఏరియా కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ జాయింట్ కమిటీ ఆన్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్ చైర్మన్‌గా ఈటల రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అక్కడి ఉద్యోగులను కలిసి మాట్లాడారు. ఈటలకు పలువురు అభినందనలు తెలిపారు.

సీఆర్‌ఎంపీ.. జరిమానాలేవీ?

- ఒప్పందం ప్రకారం పనిచేయకున్నా పట్టించుకోని జీహెచ్‌ఎంసీ
- నిర్ణీత సమయంలో జరగని మరమ్మతు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మరో రెండు నెలల్లో సమగ్ర రహదారుల అభివృద్ధి ప్రణాళిక(సీఆర్‌ఎంపీ) కాంట్రాక్టు గడువు ముగియనుంది. ఐదేళ్ల కాలవ్యవధితో అప్పగించిన రోడ్ల నిర్మాణం, నిర్వహణ బాధ్యతల నుంచి ప్రైవేట్ సంస్థలు తప్పుకోనున్నాయి. ఒప్పందం మేరకు ఆయా సంస్థలు పనులు పూర్తి చేశాయా..? అంటే లేదన్నదే ఇంజనీరింగ్ అధికారుల నుంచి వస్తోన్న సమాధానం. రూ.1839 కోట్ల అంచనా వ్యయంతో మూడు, అంతకంటే ఎక్కువ లేన్లు ఉన్న 812 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను జీహెచ్‌ఎంసీ జోన్ల వారీగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించింది. రహదారులతోపాటు ఫుట్‌పాత్‌ల నిర్మాణం, డివైడర్లు, లేన్ మార్కింగ్ వంటి పనులూ చేయాలి. ఆయా మార్గాల్లో పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ ఓవర్ ఫ్లోను అరికట్టడం.. మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్ల మరమ్మతు పనులు చేయాలని మొదట్లో అగ్రిమెంట్ చేసుకున్నా.. పలు కారణాలతో ఏజెన్సీలు చేతులెత్తేశాయి. దీంతో రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, లేన్ మార్కింగ్, డివైడర్లకు పెయింటింగ్ వంటి పనులు చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1300 కోట్ల బిల్లులు చెల్లించినట్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

నామ్ కే వాస్తేగా జరిమానా

ఒప్పందం ప్రకారం మొదటి మూడేళ్లలో 812 కి.మీల రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి. గుంతలు, పాడైన రహదారుల మరమ్మతు పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయకపోతే ఏజెన్సీలకు జరిమానా విధించాలి. చాలా జోన్లలో అధికారులు ప్రైవేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. రోడ్లపై గుంతల మరమ్మతు సకాలంలో పూర్తవలేదు. 24 గంటల్లో గుంతలను పూడ్చకపోతే ఎంత జరిమానా విధించాలి అన్నదీ స్పష్టంగా ఉంది. అయినా యంత్రాంగం వారికి జరిమానా విధించడంలో మీనమేషాలు లెక్కించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో లేన్ మార్కింగ్ లేదు.

ఫుట్‌పాత్‌ల నిర్మాణం అంతంతే..

మహానగరంలో జరుగుతోన్న ప్రమాదాల్లో 50 శాతానికిపైగా బాధితులు పాదచారులే. 9013 కి.మీల మేర రహదారులు ఉండగా.. ఫుట్‌పాత్‌లు 1000 కి.మీల లోపు మాత్రమే ఉన్నాయి. సీఆర్‌ఎంపీలో భాగంగా కేవలం 125 కి.మీల మేర మాత్రమే ఫుట్‌పాత్‌లు నిర్మించారు. అంతకుముందున్న ఫుట్‌పాత్‌లనూ పునర్‌నిర్మించాలని ఉన్నా.. చాలా ప్రాంతాల్లో పనులు జరగలేదు. కొన్నిచోట్ల ఆక్రమణలు, ఇతరత్రా కారణాలతో పనులు చేపట్టలేదని అధికారులు చెబుతున్నారు. నిర్ణీత స్థాయిలో ఫుట్‌పాత్‌లు నిర్మించకున్నా.. ఏజెన్సీల విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం గమనార్హం.

జానీమాస్టర్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఎల్‌బీనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌ను రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు కొట్టివేసింది. తన అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై లైంగికదాడి కేసులో జానీమాస్టర్ అరెస్ట్ అయిన విషయం విదితమే. ఆయనకు నేషనల్ అవార్డు రావడంతో కోర్టు ఇటీవల బెయిల్ ఇచ్చిన విషయం తెలిసిందే. తనకు మరోసారి బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టులో జానీమాస్టర్ తరఫున న్యాయవాది పిటిషన్ వేయగా.. సోమవారం విచారణ చేపట్టింది. విచారణ ప్రాథమిక దశలో ఉన్నందున బెయిల్ ఇవ్వడం కుదరదని కోర్టు తేల్చి చెప్పింది.

ప్రైవేట్ ఆస్పత్రిలో 3 నెలల శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనంటూ కుటుంబ సభ్యుల ఆందోళన

చాదర్‌ఘాట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మూడు నెలల శిశువు మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లేనంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్ జిల్లా, అక్కారం గ్రామానికి చెందిన కేతావత్ హనుమంత్ తమ మూడు నెలల శిశువు నిమోనియాతో అస్వస్థతకు గురవడంతో ఈనెల 9వ తేదీన మలక్‌పేటలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజుల నుంచి ఐసీయూలో ఉంచిన వైద్యులు శిశువు ఆరోగ్యం మెరుగైందని ఆదివారం జనరల్ వార్డుకు మార్చారు. సోమవారం సాయంత్రం డిశ్చార్జి చేస్తామని చెప్పారని, మధ్యాహ్నం నర్సు వచ్చి ఇంజెక్షన్ ఇచ్చిన 10 నిమిషాలకే శిశువు మృతి చెందాడని తండ్రి హనుమంత్ ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లేనంటూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు.

హయత్‌నగర్ టు ఆటోనగర్.. 3 కి.మీ.లకు ఒకే యూటర్న్

విజయవాడ జాతీయరహదారిపై వాహనదారుల ఇబ్బంది

- ఆటోనగర్‌లో వంద మీటర్లకు రెండు యూటర్న్‌లు



ఆటోనగర్ మోహన్ కాంట వద్ద యూటర్న్

హయత్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. హయత్‌నగర్ టు ఆటోనగర్ వరకు ఒకే యూటర్న్ ఉండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జాతీయ రహదారి విస్తరణ పనులు ఏడాది నుంచి జరుగుతున్నాయి. రహదారికి ఇరువైపులా వందలాది కాలనీలు ఉన్నాయి. ఎడమ వైపు ఉన్న కాలనీవాసులు కుడి వైపునకు రావాలన్నా.. కుడివైపున ఉన్న కాలనీవాసులు ఎడమ వైపు వెళ్లాలన్నా బైక్‌పై కనీసం మూడు కిలో మీటర్లు తిరిగి రావాల్సి వస్తోంది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఒక యూటర్న్ ఉంటే మరో యూటర్న్ ఆటోనగర్ వద్ద ఉంది. చిన్న పని కోసం రోడ్డెక్కినా మూడు కిలోమీటర్ల ప్రయాణం తప్పడం లేదు. ఆటోనగర్‌లో మాత్రం కేవలం 100 మీటర్ల దూరంలోనే రెండు యూటర్న్‌లు ఏర్పాటు చేశారు.

రెండు యూటర్న్‌లు తొలగించడంతోనే

మొదట హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఆటోనగర్ వరకు నాలుగు చోట్ల యూటర్న్‌లు ఉండేవి. ఆ తర్వాత కాంట్రాక్టర్, అధికారులు వినాయకనగర్ పెట్రోల్‌బంకు, హైకోర్టు కాలనీ వద్ద యూటర్న్‌లను తొలగించడంతో సమస్య ప్రారంభమైంది.

నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి దాదాపు సంవత్సరం కావస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఇప్పటికీ హయత్‌నగర్‌లో భూసేకరణ జరగలేదు. రోడ్డు పక్కన ఉన్న వారికి నష్టపరిహారం ఇవ్వలేదు. ఆర్‌టీసీ కాలనీ వద్ద రోడ్డు మధ్యలో ఉన్న సమాధులను తొలగించలేదు. అక్కడ రోడ్డు పనులను ఆపేశారు.



హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట యూటర్న్

లెక్చరర్స్ కాలనీ వద్ద రోడ్డుపైన ఉన్న చిన్న గుడి అలానే ఉంది. అక్కడ కూడా పనులు మధ్యలో ఆపేశారు. ఆటోనగర్ పాత ఇసుక అడ్డా వద్ద రోడ్డు పనులను మధ్యలో నిలిపేశారు. చింతల్‌కుంట నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు అనేక ప్రాంతాలలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తిచేసి యూటర్న్‌లు ఓపెన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఒకచోట యూటర్న్ తెరిస్తే..



చిన్న పనికి రోడ్డుపైకి వస్తే మూడు కిలోమీటర్ల దూరం తిరిగి రావాల్సి వస్తోంది. పనులు జరగని ప్రాంతంలో కూడా యూటర్న్‌లను మూసివేశారు. ఆటోనగర్, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ మధ్యలో తాత్కాలికంగా ఒకచోట యూటర్న్ తెరిస్తే సమస్య ఉండదు.

- జి.వెంకట్‌రెడ్డి, వినాయకనగర్ కాలనీ


ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలో దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సిబ్బందికి అక్కడే భోజనాలు ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ ఎస్.రమేశ్, అసిస్టెంట్ మేనేజర్ కె.రాజయ్య, ఏఎంఈ కె.దయాకర్, డిపో సిబ్బంది పాల్గొన్నారు. - చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి


నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరైన రాజస్థాన్ గవర్నర్ హరిబాబ్ కిషన్‌రావుకు వీడ్కోలు పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్‌రాథోడ్, బీజేపీ నాయకుడు బాబుసింగ్ - అఫ్జల్‌గంజ్, ఆంధ్రజ్యోతి

జై జై భవానీ

నవరాత్రుల పూజలందుకున్న దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. శోభాయాత్ర దారి పొడవునా జై జై భవానీ నినాదాలు హోరెత్తాయి. ప్రముఖులకు ఆయా పార్టీల నేతలు దసరా శుభాకాంక్షలు చెప్పారు


చాంద్రాయణగుట్టలో అమ్మవారి శోభాయాత్రలో భక్తులు


ఎస్ఆర్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కె.అశ్విన్, కోటేశ్వర్‌రావు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణంలో కమిటీ సభ్యులు వి.రామకృష్ణ, రాజిరెడ్డి, గుంపుల శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


లాలీశ్వర్‌ను సన్మానిస్తున్న పద్మశాలిపురం జై మాతాదీ యూత్ అసోసియేషన్ సభ్యులు


మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి దసరా శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ రాజేంద్రనగర్ సర్కిల్ నాయకుడు నోముల రాముయాదవ్, అక్కెం రాఘవేందర్ యాదవ్ తదితరులు


బీఆర్ఎస్ అధికార ప్రతినిధి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డికి దసరా శుభాకాంక్షలు చెబుతున్న ఆ పార్టీ రాజేంద్రనగర్ సర్కిల్ నాయకులు


జంగమ్మెట్‌లో అమ్మవారి శోభాయాత్రను ప్రారంభిస్తున్న టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్, భక్తులు

దుర్గాదేవి పట్టుచీరకు రూ. 3.79 లక్షలు

రాజేంద్రనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి డివిజన్ పద్మశాలిపురం భూలక్ష్మమ్మ ఆలయంలో జై మాతాదీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి పట్టు చీర వేలంపాటలో రూ. 3.79 లక్షలు పలికింది. దీనిని పద్మశాలిపురానికి చెందిన గంజి లాలీశ్వర్ దక్కించుకున్నారు.



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న వినయ్‌రెడ్డి, తదితరులు

గగన్‌పహాడ్ రోడ్లను పట్టించుకోరా?: బీజేవైఎం

రాజేంద్రనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గగన్‌పహాడ్ బస్తీలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని భారతీయ జనతా యువమోర్చా రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ సూరెడ్డి వినయ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్‌కు గగన్‌పహాడ్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం వినయ్‌రెడ్డి మాట్లాడుతూ గగన్‌పహాడ్‌లో ఎటు చూసినా గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయన్నారు. మెయిన్‌రోడ్డు నుంచి బస్తీలోకి వచ్చే రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలిచిన వ్యక్తి ఒక్కసారి కూడా గగన్‌పహాడ్‌లో రోడ్లు వేయలేదన్నారు. డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాగని శివకుమార్, సామ రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి సమస్యలు తీసుకురావాలి

మదీన, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలను ప్రజా వాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. సోమవారం చాంద్రాయణగుట్ట సర్కిల్ ఫూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా వాణి కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఏఎంసీ రాజారావు, యూబీడీ మేనేజర్ రమేశ్, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణరెడ్డి, బిల్ కలెక్టర్ రాజేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను ఇందిరమ్మ కమిటీ చైర్మన్లుగా నియమించాలి

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పేదలకు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించే ప్రక్రియలో భాగంగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంపై గోషామహల్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బద్దం సతీష్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేసే కమిటీలకు కాంగ్రెస్ కార్పొరేటర్లు లేని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను చైర్మన్లుగా నియమించాలని ఆయన అధిష్ఠానికి విజ్ఞప్తి చేశారు. దీంతో రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే అవకాశం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0muL1yOలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

చైర్మన్ బంధువుపై కేసు నమోదు


సీజ్ చేసిన కారు

నార్సింగ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ బంధువుపై కేసు నమోదైంది. కారు నంబరు ప్లేట్‌పై రిజిస్ట్రేషన్ నంబర్ కాకుండా తన పేరు శ్రవణ్ కస్తూరిగా రాసుకొని తిరుగుతుండడంతో స్థానికుల్లో ఒకరు ఈ దృశ్యాన్ని ట్విట్టర్ వేదికగా ఫిర్యాదు చేశారు. కారును సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేశామని నార్సింగ్ పోలీసులు అదే ట్విట్టర్ వేదికగా ప్రకటించారు.

ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడి నియామకం


నిరంజన్‌ను సత్కరిస్తున్న రమేశ్

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడిగా బి.నిరంజన్ నియమితులయ్యారు. సోమవారం ఆయనను సొసైటీ కార్యాలయంలో ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఎం.రమేశ్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను ఈసారి 45 రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

మణికొండ రాజమ్మ కన్నుమూత

- వయసు రీత్యా గ్రామ పెద్దమనిషి
- నిజాం కాలం నుంచి మొన్నటి వరకు పాల విక్రయం
- రాజమ్మ మృతితో గ్రామంలో విషాదచాయలు


రాజమ్మ

నార్సింగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజాం సర్కారు హయాంలో గోల్కొండ కోటలోని సర్కారు కార్యాలయాలకు ఆమె పాలు పోసేవారు. బుట్ట నెత్తినపెట్టుకొని అప్పటి గోల్కొండ పట్టణంలో గల్లీగల్లీలో పాలు, నెయ్యి అమ్మేవారు. నాటితరం నుంచి నేటితరం వరకు ఆమెను గుర్తుపట్టని వారుండరంటే అతిశయోక్తి కాదు. మణికొండ కొన్నేళ్ల కిందట వరకు కుగ్రామం. గోల్కొండకు సమీపంలో ఉండడంతో ఇక్కడివారు చాలామంది గోల్కొండ వీధులతోపాటు నగరంలోని ఆయా ప్రాంతాల్లో పాలు విక్రయించేవారు. ఇదే గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఈదులకంటి రాజమ్మ (104) చాలా సంవత్సరాల పాటు పాలు విక్రయించారు. వయస్సు రీత్యా మణికొండలో ఆమె పెద్దమనిషి. వయోభారం సమస్యలతో సోమవారం రాజమ్మ కన్నుమూసింది. ఆమెకు నలుగురు కుమారులు కాగా, పదులసంఖ్యలో మనుమళ్లు, మనవరాళ్లు ఉన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఓటు హక్కు వినియోగించుకున్న రాజమ్మ మృతితో మణికొండ గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. రాజమ్మ జీవితంపై 'ఆంధ్రజ్యోతి' ఇప్పటికే పలు కథనాలను కూడా ప్రచురించింది.



ఇనార్బిట్.. షాపింగ్‌లో నయాలుక్

- సైబరాబాద్ సిటీకే కొత్తందాలు
- మాల్ ఏర్పాటై 15 వసంతాలు పూర్తి



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ సిటీకి షాపింగ్ కళ తెచ్చింది ఇనార్బిట్ మాల్. 2009, అక్టోబరు 14న ప్రారంభమైన ఈ మాల్‌లో వివిధ రకాల వస్త్రాలు, ఫుడ్‌కోర్టులు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపారాలు నిత్యం జోరుగా సాగుతుంటాయి. మాల్ 15వ వార్షికోత్సవం సందర్భంగా నెలాఖరు వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సెంటర్ హెడ్ శరత్ బెలవాడి తెలిపారు. బతుకమ్మ ఉత్సవాలను మాల్‌లో ఇటీవల ఘనంగా నిర్వహించామని, వార్షికోత్సవం పట్ల నగరవాసులకు అవగాహన కల్పించేందుకు ఫ్లాష్‌మాబ్‌ను సైతం నిర్వహించామని చెప్పారు. ఈనెల 19న లైవ్‌బ్యాండ్ షో, 25న క్యాండిల్ మేకింగ్, 26న లాంతర్ మేకింగ్ వర్క్‌షాప్‌లను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టెక్స్‌పెడిట్ రెండో ఎడిషన్ స్టార్ట్

- 2 నెలలపాటు యాక్సలరేట్ ప్రోగ్రామ్
- గేమ్స్ 24/7 కో-ఫౌండర్ భవిన్ పాండ్యా

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత్ స్టార్టప్ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో తమ యాక్సలరేట్ ప్రోగ్రామ్ టెక్స్‌పెడిట్‌ను గేమ్స్ 24/7 ప్రారంభించింది. దాదాపు 60 రోజులపాటు జరిగే ఈ యాక్సలరేటర్ ప్రోగ్రామ్‌ను ఉత్పత్తి, అభివృద్ధి, సేవలు, పరిశోధనల ద్వారా గేమింగ్, కృత్రిమ మేధస్సు, ఇంపాక్ట్ డ్రివెన్ ఇన్‌క్లూజివ్ టెక్నాలజీకి సంబంధించిన కీలకరంగాల్లో స్టార్టప్‌లకు మద్దతు అందించడానికి రూపొందించామని గేమ్స్ 24/7 కో-ఫౌండర్ భవిన్ పాండ్యా తెలిపారు. ఈ యాక్సలరేట్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఇతర వివరాలకు TechXpedite (games24x7.com) చూడవచ్చని వివరించారు.

గచ్చిబౌలిలో 'వస్త్రం బై సింఘానియాస్'

- ప్రారంభించిన మిస్ యూనివర్స్ చందనాజయరామ్


నూతన షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న చందనాజయరామ్

గచ్చిబౌలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలో ఆధునిక వసతులతో నూతనంగా నెలకొల్పిన 'వస్త్రం బై సింఘానియాస్' షాపింగ్‌మాల్‌ను మిస్ యూనివర్స్ ఏపీ చందనాజయరామ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మగువలు, యువతకు నచ్చే వస్త్రాలను పరిశీలించారు. నేటి మగువల మనోభావాలు, ట్రెండ్‌కు అనుగుణంగా ఫ్యాషన్ మిళిత వస్త్రోత్పత్తులు ఆకట్టుకుంటున్నాయని అన్నారు. వస్త్రం బై సింఘానియాస్ డైరెక్టర్, ఫ్యాషన్ డిజైనర్ శైలేష్ సింఘానియా మాట్లాడుతూ ఫాస్ట్ ఫ్యాషన్ ఉత్పత్తులతోపాటు చీరలు, సమకాలిన దుస్తులు, వైవిధ్యమైన ఫ్యాషన్ అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వేర్ వస్త్రోత్పత్తులు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. నగరంలో నాలుగో బ్రాంచ్ ప్రారంభించడం సంతోషంగా ఉన్నదని ఆయన అన్నారు.

వాహ్.. క్యా సీన్ హై




గ్రేటర్ అందాలను మరింత పెంచేందుకు జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టింది. నగరానికి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా పెయింటింగ్‌తో ముస్తాబు చేస్తోంది. ఎల్‌బీనగర్ జంక్షన్, ఫ్లైఓవర్, అండర్ పాస్‌తోపాటు కామినేని హాస్పిటల్ ఫ్లైఓవర్ వద్ద పలు చిత్రాలు వాహనదారులను అలరిస్తున్నాయి.
-హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి






గురిపెడితే బాణం దిగాల్సిందే..

- విలు విద్యలో జువెనైల్ హోం బాలుర ప్రతిభ
- జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణింపు



సైదాబాద్‌లోని ప్రభుత్వ జువెనైల్ హోంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సైదాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విల్లు ఎక్కుపెట్టడం వారికి తెలియదు.. ఆ ఆట ఆడితే పతకాలు సాధించవచ్చన్న విషయం కూడా తెలిసేది కాదు. కానీ జువెనైల్ హోం అధికారులు, కోచ్‌ల ప్రోత్సాహంతో విలు విద్యలో జాతీయస్థాయిలో రాణిస్తున్నారు సైదాబాద్‌లోని ప్రభుత్వ జువెనైల్ హోం చిన్నారులు. తల్లిదండ్రులు లేక రోడ్లపై భిక్షాటన చేస్తూనో, రైళ్లలో సంచరిస్తూ బాలకార్మికులుగానో పనిచేస్తున్న పిల్లలను అధికారులు పట్టుకుని ప్రభుత్వ బాలుర సదనానికి తరలిస్తారు. అలాగే తెలిసీ తెలియక చేసిన తప్పులతో పలు కేసుల్లో పోలీసులకు పట్టుబడి కోర్టు విచారణ ఎదుర్కొంటున్న వారికి కూడా ప్రభుత్వ బాలల గృహం(అబ్జర్వేషన్ హోమ్)లో ఆశ్రయం కల్పిస్తారు. అయితే, వీరిలో దాగివున్న ప్రతిభను వెలికితీసి సరైన మార్గంలో శిక్షణ ఇస్తే అద్భుతంగా రాణిస్తారని నిరూపించారు జువెనైల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మీర్జాఅలీ బేగ్. స్వతహాగా క్రీడాకారుడైన ఆయన తొలిసారి సైదాబాద్ జువెనైల్ హోం విద్యార్థులకు నవంబర్ 2022లో విలువిద్య శిక్షణ ప్రారంభించారు. అంతేకాదు బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, చెస్, క్యారం వంటి క్రీడల్లో కూడా శిక్షణ ఇస్తున్నారు.

జాతీయస్థాయిలో రాణింపు

కేవలం అకాడమీ ఏర్పాటు చేసిన 22 నెలల్లో బాలురు జాతీయస్థాయిలో గుర్తింపు సాధించారు. హోంలోని ఓ బాలుడు సీఎం కప్ డిస్ట్రిక్ట్ లెవల్ పోటీల్లో రెండోస్థానం, సీనియర్ డిస్ట్రిక్ లెవల్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాడు. తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం సాధించాడు. నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు 720 మంది క్రీడాకారులు హాజరుకాగా 164వ ర్యాంకు సాధించడం విశేషం. మరో విద్యార్థి కేవలం నెలరోజుల శిక్షణలో కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అర్చరీ పోటీల్లో 7వ స్థానంలో నిలిచాడు. యూత్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన ప్రపంచ 7వ ర్యాంకర్ హేమలతా యాదవ్ హోం విద్యార్థులకు అర్చరీలో శిక్షణ ఇస్తున్నారు.

తియ్యని వేడుక..
ఉందాం కేర్‌ఫుల్‌గా




- సవాల్‌గా మారుతున్న శుభకార్యాల వేళ మధుమేహ నియంత్రణ
- కళ్ల ముంగిట అన్నీ ఉన్నా తినకుండా ఉండడం కష్టమే
- ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడమే మేలు
- మద్యం మితంగా తీసుకోవడం శ్రేయస్కరం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చలికాలం వచ్చేస్తోంది.. ఈ సీజన్‌లోనే చక్కటి ముహూర్తాలు ఉండడంతో వేలాది వివాహాలు, ఇతర శుభకార్యాలు జరగనున్నాయి. వివాహమంటేనే ఆత్మీయ కలయికలు, ఉత్సాహపూరితమైన వేడుకలు మాత్రమే కాదు, పసందైన విందుకూ వేదికలు కూడా. ఇటీవలకాలంలో వివాహమంటే, ఒకరోజు కాకుండా నాలుగైదు రోజులు జరుపుకుంటున్నారు. వీటితోపాటు బ్యాచిలర్ పార్టీలు అదనం. వేడుకల వేళ ప్రతిరోజూ విందు భోజనమే ఉంటుంది. అలాంటి వేళ మధుమేహంతో బాధపడుతున్న వారి సంగతి ఏమిటి ? సమయానికి వారికి తగిన ఫుడ్ లభించదన్న ఆందోళన ఓ పక్క ఉన్నా, మధుమేహ నియంత్రణ పరంగా ఈ సీజన్ కాస్త ఇబ్బంది కలిగిస్తోంది. సంప్రదాయ వంటకాల్లో కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉంటే, కాస్త రుచిగా ఉండాలంటే నూనె, కారం, మసాలాలు తగిలించాల్సిందేనంటూ చెఫ్‌లు చేసే ప్రయోగాలు మధుమేహులకు మాత్రం ఇబ్బందిని కలిగిస్తాయి. సంతోషకరమైన సమయంలో తమకు మాత్రం ఎందుకు సంతోషం లేకుండా పోతుందని ఆందోళన చెందే మధుమేహులు ఉన్న అవకాశాలనే సద్వినియోగం చేసుకుంటే ఆనందం పొందవచ్చన్నారు న్యూట్రిషియనిస్ట్ రష్మి.

నచ్చిన ఫుడ్ ఉంటుంది కానీ..


వివాహ వేళ మనకు నచ్చిన ఫుడ్ ఎక్కడ చూసినా కనిపిస్తుంది. కానీ, ఆరోగ్యవంతమైన ఆహారం కనిపిస్తుందా అని అంటే చెప్పడం కొంచెం కష్టం. అలాగని వెడ్డింగ్ బఫేను ఆస్వాదించలేరని చెప్పడం కూడా సరికాదు. వివాహ సమయంలో ఫుడ్ ఎలా తీసుకోవాలనే దానిపై డయాబెటాలిస్ట్ శ్రీకాంత్ మాట్లాడుతూ రైస్ పరిమాణం తగ్గించి, సలాడ్‌లు అధికంగా తీసుకోవాలి. రోటీ లాంటి వాటిని వెజిటబుల్ కర్రీలతో తీసుకోవడం మంచిది. వేపుళ్ల జోలికి పోకుండా డెసర్ట్స్‌కు దూరంగా ఉండటం మంచిది. ఒకవేళ డెసర్ట్ తినాలనుకుంటే ఫ్రూట్స్ బేస్డ్ ఫుడ్స్ మంచిది. వాటిలోనూ తియ్యదనాలు అందించే భాగం కాస్త పక్కన బెడితే ఇబ్బంది పడాల్సిన అవసరం తప్పుతుంది' అని అన్నారు.

షుగర్ నియంత్రణలో ఉండాలంటే..

- వివాహానికి బయల్దేరే ముందు కార్బోహైడ్రేట్స్ తక్కువగా ఉండే, ఫైబర్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం మంచిది. దీనివల్ల జీర్ణం నెమ్మదిగా జరగడంతోపాటు శరీరంలో గ్లూకోజ్ పరిమాణం అకస్మాతుగా పెరగకుండా ఉండటానికి తోడ్పడుతుంది. వివాహ వేళ భోజనం ఆలస్యమైతే బాదం పప్పు వెంట ఉంచుకోవడం మంచిది.
- వివాహ వేడుకల వేళ క్రమం తప్పకుండా భోజన వేళలు పాటించడం కష్టమే కానీ, వీలైనంత వరకు సమయాన్ని పాటించడం మంచిది. కొంతమంది కుదరకపోతే బ్రేక్‌ఫాస్ట్ లేదంటే లంచ్ తినకుండా మానేస్తారు. అంతా కలిపి డిన్నర్‌లో తిందామనుకుంటే అది మరింత ప్రమాదకరం.
- హోటళ్ల లేదంటే కన్వెన్షన్ సెంటర్‌లలో జరిగే పెళ్లిళ్ల వేళ ఆర్టిఫిషియల్ స్వీట్లు, టీ, పాలు లేదంటే కాఫీతోపాటు అందిస్తుండటం కనిపిస్తుంది. ఆర్టిఫిషియల్ స్వీట్ల జోలికి వెళ్లకపోవడమే మంచిది. వీలైనంత వరకూ ప్రత్యామ్నాయాలు వాడటం మంచిది.
- వివాహ సమయాల్లో బంధువులు, మిత్రుల సందడి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మందులు తీసుకోవడం ఒక్కోసారి మరిచిపోవచ్చు. అలా కాకుండా ఉండటానికి ఫోన్‌లో రిమైండర్స్ పెట్టుకోవచ్చు.
- ఒకవేళ మీరు వివాహం కోసం వేరే నగరానికి వెళ్లాల్సి వస్తే మీ డాక్టర్‌ను సంప్రదించి తగిన సలహా తీసుకోవడం మంచిది. ఇన్సులిన్ వాడితే డోసును మార్చే అవకాశాలున్నాయి.
- ఒకవేళ అత్యవసర పరిస్థితి ఎదురైతే ఎవరిని సంప్రదించాలి? ఎలాంటి మందులు వాడాలన్న సమాచారం దగ్గర ఉంచుకోవాలి.
- ఎంత వద్దనుకున్నా వివాహ వేడుకల వేళ మద్యం, ఆహారం కాస్త ఎక్కువ తీసుకునే అవకాశాలే అధికం. వీలైనంతగా శరీరంలో చేరిన అధిక కేలరీలను కరిగించుకోవడానికి ప్రయత్నించడం తప్పనిసరి.

సంకల్పబలమే ఆయుధం

పరిస్థితులకు అనుగుణంగా మారితే విజయం ఖాయం



- ఉపాధి కోసం నగరానికి వచ్చి..
- కెరటంలా దూసుకెళ్తే గమ్యం చేరడం సులువే
- కష్టాలకు ఎదురీదితే సుఖాలు తథ్యం

బంజారాహిల్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం..కుటుంబపోషణ నిమిత్తం పొట్టచేతబట్టుకొని ఎంతోమంది సొంతూరిని, కన్న తల్లిదండ్రులను వదిలేసి భాగ్యనగరం బాటపట్టారు. తమ కలలను సాకారం చేసుకునేందుకు ఎన్నో కష్టాలు దిగమింగి ఒక్కో మెట్టు ఎక్కి జీవితంలో అనుకున్నది సాధించారు. కొందరు వ్యాపారాలు, మరికొందరు ఉద్యోగాల్లో స్థిరపడి తమ లక్ష్యం కోసం విశ్రమించకుండా చెమటోడుస్తున్నారు. ఇంకొందరు వ్యాపారాల్లో విఫలమైనా కుంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో కెరటంలా ముందుకు దూసుకెళ్తున్నారు. 'ఒడిదుడుకులు సహజమే. వాటిని తట్టుకొని ముందుకు సాగినపుడే ఆత్మవిశ్వాసం కలుగుతుంది. అనుకున్నది సాధించలేదని పక్కదారి పడితే మరింత పాతాళంలోకి కూరుకుపోతాం' అని ఓ వ్యాపారి సూచించారు.

ఊహలు తారుమారు..

నగరానికి వచ్చే వారిలో యువతే ఎక్కువగా ఉంటోంది. ఎన్నో ఆశలతో వచ్చిన వారిలో కొందరు అనుకున్నది సాధించలేక నేర జీవితానికి అలవాటు పడుతున్నారని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ రమణ చెబుతున్నారు. ఉద్యోగం కోసం వచ్చేవారిలో దాదాపు 40 శాతం మంది నైపుణ్యం లేని కారణంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సినిమాల్లో ఒక్క చాన్స్ సంపాదించి తామేంటో నిరూపించుకోవాలనే వారిలో కొందరు అనుకున్న లక్ష్యం చేరుకోవడంలో విఫలమవుతుండటంతో పక్కదారి పడుతున్నట్లు తెలిపారు. ఇటీవల చోటుచేసుకున్న కొందరు తారల ఉదంతాలు దీనికి నిదర్శనం కాగా, వెలుగులోకి రాని ఘటనలు మరెన్నో.

ధోరణి మార్చుకొని ముందుకు సాగితే..

అనుకున్నది సాధించలేకపోయామని కుంగిపోకుండా తమ ఆలోచనా ధోరణి మార్చుకుని.. మరో రంగంలో ప్రయత్నిస్తే విజయానికి సులువుగా చేరువవుతాం. సాధించిన ఎంతోమంది ప్రస్తుతం సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన మహాలక్ష్మికి సినిమాల్లో నటించడం చాలా ఇష్టం. ఇంటర్ పూర్తవగానే నగరానికి వచ్చిన ఆమెకు నిరాశే ఎదురైంది. ఎంత యత్నించినా లక్ష్యం చేరుకోలేక కుంగిపోయింది. అయితే సినిమాలపై తనకున్న పిచ్చి ప్రేమ కన్నా జీవితం ముఖ్యమనే విషయాన్ని గ్రహించి తనదారి మార్చుకుంది. ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరింది. వివాహం చేసుకొని ప్రస్తుతం భర్త, ఇద్దరు పిల్లలతో హాయిగా జీవిస్తోంది.

దృక్పథం మార్చుకున్నా..

మాది గుంటూరు జిల్లా. నటనపై ఇష్టంతో తిరగని స్టూడియో లేదు. ఎక్కడికి వెళ్లినా నటనను చూసిన వాళ్లు లేరు. పక్కదారి పట్టించేందుకు చాలామంది ప్రయత్నించారు. చివరకు భోజనానికి కూడా చాలా ఇబ్బంది పడ్డా. కుటుంబం గుర్తుకొచ్చింది. సినిమా ఆశలను వదులుకుని ఒక దుకాణంలో పనికి చేరా. రూపాయి రూపాయి కూడబెట్టుకుని ఇప్పుడు సొంతంగా ఓ కంగన్‌హాల్ నడుపుతున్నా. ఇప్పుడు భర్త, ఇద్దరు పిల్లలతో హాయిగా ఉన్నా.
-లక్ష్మీదేవి, శ్రీకృష్ణానగర్

కసితో పైకొచ్చాం..

చిన్నప్పుడే నగరానికి వచ్చాం. ఐదుగురు అన్నదమ్ముళ్లం. ఓ హోల్‌సేల్ షాపులో పనికి కుదిరాను. వచ్చే డబ్బు కుటుంబపోషణకు సరిపోయేది కాదు. దీంతో అప్పు తీసుకొచ్చి ఎక్స్‌పోర్ట్ వ్యాపారం మొదలుపెట్టాం. ఆశించినంతగా నడవలేదు. మళ్లీ పనికి వెళ్లా. హోల్‌సేల్ వ్యాపారంపై దృష్టి పెట్టడంతో ఏడాదిలోనే అప్పులు తీర్చేశాం. అన్నదమ్ముళ్లం విడిపోయి వివిధ చోట్ల షాపులు పెట్టుకుని స్థిరపడ్డాం.
-రమేశ్, బంజారాహిల్స్

మంచి దారే ఎప్పటికీ మేలు

- చెడు దారిలో వెళితే అనుకున్నది త్వరగా సాధిస్తామనుకోవడం భ్రమ. సన్మార్గంలో వెళితే ఆలస్యంగానైనా బంగారు భవిష్యత్తు దొరుకుతుంది.
- ఆత్మవిశ్వాసాన్ని అస్సలు కోల్పోవద్దు. చదువుకు, ఉద్యోగానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలి. అందుకనుగుణంగా ప్రయత్నించే విధానాన్ని మార్చుకోవాలి.
- ఇతరులతో పోల్చుకోవడం మానేయాలి.
- యువతులు తొలుత ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఉపాధి అవకాశాలు వెతుక్కోవాలి.
- నగరానికి వచ్చి దెబ్బతిని విజయం సాధించిన వారి గురించి తెలుసుకోవాలి. వారికి సంబంధించిన పుస్తకాలు చదివితే సరైన మార్గంలో వెళ్లే అవకాశం ఉంటుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వారి విజయగాథలు పత్రికల్లో ప్రచురితమవుతుంటాయి.

చిన్నారుల జీవితాలతో వ్యాపారం

- అర్హత లేని సిబ్బందితో ఆటిజం సెంటర్ల దగా
- థెరపీ పేరుతో దోచుకుంటున్న నిర్వాహకులు
- నకిలీ సెంటర్లపై చర్యలు తీసుకోవాలంటున్న బాధితులు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆటిజం సమస్య ఉన్న పిల్లలు మానసిక వైకల్యంతో ఇబ్బంది పడుతుంటారు. వారు ఎవరితోనూ సరిగా కలిసి ఉండలేరు. మాట్లాడించే ప్రయత్నం చేసినా ఏమాత్రం ఫలితం ఉండదు. పేరుపెట్టి పిలిచినా ఉలుకు పలుకు ఉండదు. తమకు ఎవరితోనూ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తూ ఎప్పుడూ ఏదో లోకంలో ఉన్నట్లు ఉంటారు. వారు ఒకే పనిపైనే ధ్యాస పెడతారని.. ఒకే ఆటను పదేపదే ఆడడం, ఒకే రకం దుస్తులు ప్రతిరోజూ ధరించడం, అవి లేకపోతే ఏడవడం వంటివి చేస్తారని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యలు ఉన్న వారిని చిన్న వయస్సులోనే గుర్తించగలిగితే థెరపీల ద్వారా వారి భవిష్యత్తును కాపాడవచ్చంటున్నారు. అయితే ఆటిజం బాధితులకు సేవలు అందిస్తామంటూ వెలుస్తున్న సెంటర్లతో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుభవం లేని సిబ్బందితో ఇబ్బందులు

ఆటిజంకు చికిత్స పేరుతో అనేక థెరపీ సెంటర్లు వెలుస్తున్నాయి. మెజార్టీ కేంద్రాలకు అనుమతులు ఉండడం లేదు. కొన్నింటికి అనుమతులు ఉన్నప్పటికీ రెన్యూవల్ చేసుకుంటున్న దాఖలాలు లేవు. అర్హత, అనుభవం లేని సిబ్బందితో థెరపీ సెంటర్లను నడుపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోసపూరిత థెరపీల కారణంగా సమస్య ఏమాత్రం తగ్గడం లేదని, డబ్బుతో పాటు విలువైన సమయం వృథా అవుతోందని బాధిత చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటిజం సెంటర్లలో సరైన చికిత్స పొందితే తమ పిల్లల జీవితం బాగుపడుతుందనే ఆశతో వెళ్లి మోసపోతున్నామని, అక్రమ థెరపీ సెంటర్లను గుర్తించి సీజ్ చేయాలని కోరుతున్నారు.

బిహేవియర్ థెరపీతో పరిష్కారం

ఆటిజం సమస్యను నిర్లక్ష్యం చేస్తే పర్సనాలిటీ డిజార్డర్‌కు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రెండేళ్ల వయస్సు లోపు సమస్యను గుర్తిస్తే బిహేవియర్ థెరపీ ద్వారా చిన్నారులను సాధారణ స్థితికి తీసుకురావొచ్చని చెబుతున్నారు. ఆటిజంతో బాధపడుతున్న వారికి ముందుగా వినికిడి పరీక్షలు చేయించి చెవి, మూగ సమస్యలు లేవని నిర్ధారించుకోవాలి. అనంతరం వైద్యులు చికిత్స ప్రారంభిస్తారు. కొందరికి కొన్ని సంవత్సరాల పాటు చికిత్స చేయించాల్సిన అవసరం ఉంటుంది. ఈ క్రమంలో అన్ని సౌకర్యాలు కలిగి ఉండి, అనుభవం కలిగిన సిబ్బంది ఉన్న సెంటర్లనే ఆశ్రయించాలని తల్లిదండ్రులకు వైద్యనిపుణులు సూచిస్తున్నారు.



గాయత్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు కృష్ణారావు, కేపీ వివేకానంద

రాజేంద్రప్రసాద్ కుమార్తెకు కేటీఆర్ నివాళి

హైదర్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీ ఇందు ఫార్చ్యూన్‌ఫీల్డ్స్‌లోని ఆయన నివాసంలో గాయత్రి పెద్దకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, కాలేరు వెంకటేష్ హాజరై గాయత్రి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా తెలుగు సినీ ప్రేక్షకులను నవ్విస్తున్న రాజేంద్రప్రసాద్ కుటుంబంలో విషాదం నెలకొనడం తనను ఎంతగానో కలచివేసిందన్నారు. రాజేంద్రప్రసాద్ కుటుంబంతో మాజీ సీఎం కేసీఆర్‌కు మంచి అనుబంధం ఉందన్నారు. చిన్న వయస్సులోనే గాయత్రి చనిపోవడం బాధాకరమైన విషయమని కేటీఆర్ అన్నారు.

25 నుంచి మాలల మహాపాదయాత్ర

నల్లకుంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి డిసెంబర్ 1 వరకు రాష్ట్రవ్యాప్తంగా మాలల మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు నేతలు వెల్లడించారు. భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు 16 జిల్లాలు, 45 నియోజకవర్గాల మీదుగా పాదయాత్ర కొనసాగుతుందన్నారు. సోమవారం హైదర్‌గూడలో జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగ్‌రావు, జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు విలేకరులతో మాట్లాడారు. మాలలపై దుష్ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ తన పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిటీని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో మాలల స్టీరింగ్ కమిటీ సమావేశాలను ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీరాములు, వెంకటస్వామి, ఇందిర ప్రియదర్శిని, రవికాంత్, అశోక్, వెన్నరాజు, సుందర్‌రావు, విజయ్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన అల్లుడు ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డితో సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఆయన నివాసంలో కలిశారు. తన కుమార్తె అనుశ్రేయ వివాహానికి రావాలని కోరుతూ రాజశేఖర్‌రెడ్డి ఆహ్వానపత్రిక అందజేశారు.

దేవాలయాల ధ్వంసం వెనుక భారీ కుట్ర

- వీహెచ్‌పీ అధికార ప్రతినిధి బాలస్వామి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో దేవాలయాల ధ్వంసం వెనుక భారీ కుట్ర దాగి ఉన్నదని విశ్వహిందూ పరిషత్ అధికార ప్రతినిధి పగుడాకుల బాలస్వామి సోమవారం ఒక ప్రకటనలో అనుమానం వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా నగరంలోని దేవాలయాలను కొందరు దుండగులు ధ్వంసం చేస్తున్నారని, మత సామరస్యాన్ని దెబ్బతీయడానికే ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. సంతోష్‌నగర్ రక్షపురంలోని అమ్మవారి ఆలయాన్ని ఇద్దరు వ్యక్తులు అకారణంగా ధ్వంసం చేశారని, కానీ వారికి మతిస్థిమితం లేదని చెబుతూ పోలీసులు కేసును నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోనూ దుర్గామాత విగ్రహం ధ్వంసం చేస్తే మతిస్థిమితం లేని వ్యక్తే చేశాడని చెబుతున్నారని విమర్శించారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం చూస్తే ఇందులో కుట్ర దాగి ఉందనిపిస్తోందని, నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నిందితులను శిక్షించాలి..

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కుమ్మరిగూడ బస్తీలోని ముత్యాలమ్మ గుడిలో విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలను ఆసరాగా చేసుకుని శాంతిభద్రతల సమస్యలు సృష్టించే శక్తులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



నటులను సన్మానించిన డా.ఎంకే రాము

పద్యనాటకాలు తెలుగువారి సొత్తు

చిక్కడపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్యనాటకాలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని ప్రముఖ కవి, జవహర్‌బాలభవన్ మాజీ డైరెక్టర్ డా.ఎంకే రాము అన్నారు. ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొనసాగనున్న పద్యనాటకోత్సవాలు సోమవారం సాయంత్రం త్యాగరాయగానసభలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నటీనటుల దీర్ఘరాగాలాపన పద్యనాటకాలకు ఎంతో వన్నె తీసుకువస్తాయన్నారు. పద్యనాటకాలు ప్రపంచంలోనే ఒక్క తెలుగువారి సొత్తు అన్నారు. ఈ కార్యక్రమంలో యువకళావాహిని సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, ఉమర్‌ఖాన్, వీరభోగ వసంతరాయలు, నిర్వాహకులు లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకాశవాణి- దూరదర్శన్ కేంద్రాల్లో కాపీ ఎడిటర్ ఉద్యోగాలు

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఆకాశవాణి-దూరదర్శన్ కేంద్రంలో కాంట్రాక్టు, పూర్తికాలపు ప్రాతిపదికన కాపీ ఎడిటర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత విభాగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తుల కోసం https://applications.prasarbharati.org https://prasar bharati.gov.in/pi... వెబ్‌సైట్‌లోని వేకెన్సీ వి

ప్రపంచ దేశాలకు ఆధ్యాత్మిక విశ్వగురువు భారత్



కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసిన కేకే పిక్చర్స్ చిత్ర బృందం

పంజాగుట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలకు ఆధ్యాత్మిక విశ్వగురువుగా భారతదేశం పేరుగాంచిందని ప్రొడక్షన్‌నం.1 చిత్రం కేకేపిక్చర్స్ బ్యానర్ నిర్మాత డా.కాశెట్టి కుమార్ అన్నారు. సోమవారం సోమాజిగూడలోని అతిథి గృహంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని చిత్ర బృందం కలిసింది. ఈ సందర్భంగా కాశెట్టికుమార్ మాట్లాడుతూ.. ఎంతోమంది మహాత్ములకు, తత్వవేత్తలకు వేదజ్ఞానాన్ని అందించిన ఈ కర్మభూమిలో హిందూ సనాతన ధర్మం తన ఉనికిని కాపాడుకోవాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. దర్శకుడు ఎంవీ సతీష్‌కుమార్ దర్శకత్వంలో పాన్ ఇండియా మూవీ తెరకెక్కుతున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో చిత్రయూనిట్ సభ్యులు మీసాల చంద్రయ్య, దుగ్యాల ప్రదీప్ కుమార్, ప్రసాద్ పటేల్, అంతన్నగారి రాజేంద్ర, శిఖ విజయ్ తదితరులు ఉన్నారు.

'60 రోజుల్లో కులగణన' జీవోను స్వాగతిస్తున్నాం

- జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

పంజాగుట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 60 రోజుల్లో కులగణనను పూర్తి చేసేలా ప్రభుత్వం జీవో తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కులగణన ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే వారు ఎంతటివారైనా సరే బొందపెడతామని హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కులగణన జీవోను ఏ రాజకీయ పార్టీ స్వాగతించకపోవడం శోచనీయమని, వారికి బీసీలపై ఎంత ప్రేమ ఉందో దీనిని బట్టి స్పష్టమవుతోందన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కులగణన గురించి చిన్నచూపుగా మాట్లాడడం సరికాదన్నారు. జీవో నంబర్ 18ను స్వాగతిస్తూ ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా పూలే విగ్రహాలకు పూలాభిషేకం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 20న అఖిలపక్ష సమావేశం, 22న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మేధావులు, కళాకారులు, కవులతో సమాలోచన సభ నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బాలగౌని బాలరాజ్ గౌడ్, ప్రొఫెసర్ బాగయ్య, తెలంగాణ బీసీ ఫెడరేషన్ చైర్మన్ ఎస్.దుర్గయ్య గౌడ్, జి.భాస్కర్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి జిల్లాలో పాలియేటివ్ కేర్ సెంటర్

- మంత్రి దామోదర రాజనర్సింహ హామీ



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రాయదుర్గం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి జిల్లాలో కనీసం ఒక పాలియేటివ్ కేర్ సెంటర్ ప్రారంభించేలా కృషిచేస్తానని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గచ్చిబౌలి ఖాజాగూడ స్పర్శ్‌హాస్పీస్, పాలియేటివ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ హాస్పైస్ అండ్ పాలియేటివ్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసలైన దేవాలయం స్పర్శ్ వంటి వేదికలేనన్నారు. మానవసేవే మాధవసేవ అనే నానుడికి పర్యాయపదం స్పర్శ్ సంస్థ అని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ కారుణ్య, రోబోటిక్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ చినబాబు, రోటరీ క్లబ్ సభ్యులు, స్పర్శ్ సేవలు పొందిన రోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అటవీ భూముల విధ్వంసాన్ని ఖండిస్తున్నాం

- పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య



సమావేశంలో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య

పంజాగుట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి కొండల్లోని అటవీ భూములను భారత నావికాదళం ఏర్పాటు చేయనున్న వెరీలో ఫ్రీక్వెన్సీ (వీఎల్ఎఫ్) రాడార్ స్టేషన్ కోసం కేటాయింపు నిర్ణయాన్ని ఖండిస్తున్నామని పర్యావరణ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, సీనియర్ పాత్రికేయులు అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ పాత్రికేయుడు సంపత్ అధ్యక్షతన 'దామగుండం విధ్వంసంపై పౌర సమాజం స్పందన' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా హైదరాబాద్, వైజాగ్, ఢిల్లీ, జమ్మూ, భోపాల్, వరంగల్ సహా 18కి పైగా నగరాల్లో నిరసనలు చేపట్టినట్లు తెలిపారు. దామగుండం అడవులు జీవవైవిధ్యంతో ఉంటాయని, విలువైన వృక్షాలు, జంతుజాలం, ఔషధ మొక్కలతో సహా వందలాది అరుదైన వృక్ష జాతులు ఉన్నాయని.. ఈ ప్రాజెక్టులో భాగంగా 2900 ఎకరాల అటవీ భూమిని ధ్వంసం చేయనున్నటు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో నగరంలో వరదల తీవ్రత పెరుగుతుందని, 20 గ్రామాలలో నివసిస్తున్న అరవై వేల మంది జీవితాలపై ప్రభావితం చూపుతుందన్నారు. దీనిపై తెలంగాణ హైకోర్టు గతంలో నాలుగేళ్లపాటు స్టే విధించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, పృథ్వీరాజ్‌యాదవ్ పర్యావరణ వేత్త బాబురావు, బక్కా జడ్సన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు గోవర్ధన్, పాత్రికేయులు విఠల్, తులసీచంద్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ భర్తతో కలిసి కిలాడీ మోసం

- బ్యాక్‌డోర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వల
- మహిళను అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మల్టీ నేషనల్ కంపెనీల్లో బ్యాక్ డోర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు కొల్లగొట్టిన కిలాడీని పోలీసులు అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన రేష్మ అలియాస్ స్వప్న (30) 2009లో నగరానికి వచ్చి ఇన్‌స్టంట్ ఐటీ జాబ్స్ కన్సల్టెన్సీలో టెలీకాలర్‌గా చేరింది. ఈ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్న మహ్మద్ అలీని 2013లో పెళ్లి చేసుకోగా, 2022లో విడిపోయారు. ఈ క్రమంలో రేష్మ, ఆమె మాజీ భర్త మహ్మద్ అలీ, ఫాజిల్ పటేల్, ఫిర్దౌస్ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. నిరుద్యోగులకు ఫోన్ చేసి ప్రముఖ సంస్థలో సీనియర్ హెచ్ఆర్ మేనేజర్‌నని, బ్యాక్ డోర్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మిస్తారు. ముందుగా 50 శాతం డబ్బు తీసుకుంటారు. నకిలీ ఆఫర్ లెటర్లు ఇచ్చి మిగతా డబ్బు వసూలు చేసేవారు. ఇదే విధంగా నగరానికి చెందిన యువతికి రేష్మ ఫోన్ చేసి సీటీఎస్, ఐబీఎం సంస్థల్లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో ఆమె మరో తొమ్మిది మంది స్నేహితులను డబ్బులు ఇచ్చేందుకు ఒప్పించింది. వారు పంపిన ఆఫర్ లెటర్లతో జాయినింగ్‌కు వెళ్లగా మోసం బట్టబయలైంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సైబరాబాద్ సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్‌రెడ్డి కర్ణాటకలోని కలబురిగిలో ఉన్న రేష్మను అరెస్ట్ చేశారు. ఈ ముఠాపై తెలంగాణ, ఏపీ, కర్ణాటకల్లో కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

దుండిగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డి పోచంపల్లి ప్రాంతంలోని సారెగూడెంకు చెందిన పెద్దులు గారి శ్రీశైలం(40), సౌజన్య భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. తరచూ మద్యం తాగే అలవాటున్న శ్రీశైలం ఆదివారం రాత్రి తాగి ఇంటికి రావడంతో దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీశైలం భవనం మూడో అంతస్తు నుంచి దూకాడు. తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. భార్య సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన కోర్సులకు కౌన్సెలింగ్ ప్రారంభం

- ఎప్‌సెట్‌లో వెయ్యి లోపు ర్యాంకర్లు సైతం ఈ కోర్సులకే మొగ్గు



369వ ర్యాంకు సాధించిన స్ఫూర్తికి కోర్సు ప్రవేశపత్రాన్ని అందజేస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి, డాక్టర్ గోపాల్‌రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన యూజీ (అండర్ గ్రాడ్యుయేట్) కోర్సులలో ప్రవేశాలకు సోమవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఎప్‌సెట్-2024లో 369వ ర్యాంకు సాధించిన ఎం.స్ఫూర్తి రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాలలో తొలి అడ్మిషన్ తీసుకున్నారు. 431, 550 ర్యాంకులు సాధించిన వారు సైతం ఇదే కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. పీవీ నర్సింహారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ గోపాల్‌రెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జయశ్రీ, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ విజయలక్ష్మి, ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు.

అంబేడ్కర్ చూపిన మార్గంతోనే దళితులకు విముక్తి

- వడ్లమూరి కృష్ణస్వరూప్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్, పార్టీ నేతలు

కవాడిగూడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధ ధర్మ దీక్ష పరివర్తన దివస్‌ను పురస్కరించుకుని లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరుణ, ప్రేమ, స్వేచ్ఛ, సమానత్వం, మానవీయత పునాదిగా గల బౌద్ధధర్మను స్వీకరించిన ప్రపంచ మేధావి అంబేడ్కర్ అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో పయనించినప్పుడే దళిత బహుజన జాతులకు తాత్విక విముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇటిక్యాల గణేష్, సీహెచ్ రోజాలీలా, కాసాని అశోక్, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ బస్సు యాత్రను ప్రారంభిస్తున్న ఆటోమోటివ్ డైరెక్టర్ గోపాలకృష్ణ తదితరులు

కన్యాకుమారి నుంచి కశ్మీర్‌కు ఎలక్ట్రిక్ బస్సు యాత్ర

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా గ్రీన్ మొబిలిటీని ప్రోత్సహించే ఉద్దేశంతో ఎలక్ట్రిక్ ఇంటర్‌సిటీ బ్రాండ్ నియోగో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చారిత్రాత్మక ప్రయాణాన్ని చేపట్టిందని తెలంగాణ ప్రభుత్వ ఆటోమోటివ్, ఈవీ డైరెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. నియోగో ఎలక్ట్రిక్ బస్సు యాత్ర దక్షిణ దశను సోమవారం ఆయన హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ యాత్ర 11 రాష్ట్రాలతో పాటు పలు కేంద్రపాలిత ప్రాంతాల మీదుగా సుమారు 4వేల కిలోమీటర్లకు పైగా సాగుతుందని ఆయన పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలల బంద్ నిర్ణయం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేతలు మధు, నాగరాజు తదితరులు

నల్లకుంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఓయూ, కేయూ యూనివర్సిటీల పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునివ్వడం తగదని, ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మధు, పొడపగి నాగరాజు కోరారు. సోమవారం విద్యానగర్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో వారు మాట్లాడారు. కళాశాలల బంద్ వల్ల మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. గత నెల రోజుల నుంచి కళాశాలల యాజమాన్యాల డిమాండ్లకు ప్రభుత్వం స్పందించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని వారు విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం చర్చలు జరపాలని.. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎం.నవీన్, జి.అజయ్, నరసింహారెడ్డి, ఎం.మహేష్, టి.శ్యామ్, ఎం.నాగరాజు, ఎం.ప్రవీణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


22న కలెక్టరేట్ల ముట్టడికి ఆర్.కృష్ణయ్య పిలుపు

రాంనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫీజుల బకాయిలు రూ.4 వేల కోట్లు చెల్లించాలని, పెరిగిన ధరల ప్రకారం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.5,500 నుంచి రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు తరగతులు బహిష్కరించి జిల్లా కలెక్టరేట్లు, తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన విద్యార్థుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల బకాయిలు చెల్లించాలని కోరుతూ డిగ్రీ కాలేజీల బంద్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, దీని వల్ల విద్యార్థుల చదువులు దెబ్బతింటాయన్నారు. కాలేజీ యాజమాన్యాల ఉద్యమాలకు దిగరాదని, బీసీ సంఘాలు ఉద్యమాలు చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని ఆయన పేర్కొన్నారు. కోర్సు పూర్తయిన విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో వారు విదేశీ విద్యకు వెళ్లలేకపోతున్నారన్నారు.

















స్ట్రీట్ ఫై(లై)ట్!

(5వ పేజీ తరువాయి)

చెబుతున్నారు. అంతకుముందు ఉన్న సాధారణ వీధిదీపాల స్థానంలో, కొత్తగా ఏర్పాటు చేసిన స్తంభాలకు వీధిదీపాలు ఏర్పాటు చేయాలన్నది ఒప్పందం. 5.48 లక్షల వీధిదీపాలు ఏర్పాటు చేయడంతోపాటు నిర్వహణ చేపట్టినట్టు ఈఈఎస్ఎల్ చెబుతోంది. అంతకుముందుతో పోలిస్తే 50 శాతం వరకు విద్యుత్ వినియోగం తగ్గింది. ఈ విషయాన్ని పలు సందర్భాల్లో జీహెచ్ఎంసీ కూడా ప్రకటించింది. మొదట్లో బాగానే ఉన్నా.. కాలగమనంలో నగరంలోని చాలా ప్రాంతాల్లో అంధకారం కనిపించడం మొదలైంది. ప్రధాన, అంతర్గత అన్న తేడా లేకుండా అన్ని రూట్లలో వీధిదీపాలు వెలగడం లేదు. ఫిర్యాదు చేసినా ఇటు జీహెచ్ఎంసీ, అటు ఈఈఎస్ఎల్ పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులుండేవి. గ్లోయింగ్ పర్సంటేజీ 98 శాతం ఉండాలన్నది నిబంధన కాగా.. ఆ మేరకు వీధి దీపాలు వెలిగింది చాలా తక్కువ సమయాల్లో నేనని జీహెచ్ఎంసీ అధికారులూ అంగీకరిస్తున్నారు. ఒప్పందం ప్రకారం ఈఈఎస్ఎల్‌కు బిల్లులు చెల్లించాల్సి ఉండగా.. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సకాలంలో చెల్లింపులు జరుగలేదు. ఆరు నెలలుగా రెగ్యులర్ యాన్యూటీ రూ.57.10 కోట్లు కూడా చెల్లించలేదని ఈఈఎస్ఎల్ చెబుతోంది. గత ఎనిమిది నెలల్లో 2,18,422 ఫిర్యాదులు వచ్చాయని, 44,753 పాడైన వీధిదీపాలను తిరిగి అమర్చినట్టు సంస్థ పేర్కొంది. హై ఓల్టేజీ, అనధికార మరమ్మతు, ప్రమాదాలు, ఇతరత్రా కారణాలతో 10 వేలకుపైగా వీధిదీపాలు పాడయ్యాయని, వీటిపై క్షేత్రస్థాయిలో సంయుక్త పరిశీలన జరిపినా.. ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నది ఆరోపణ. రాష్ట్రంలోని 140 మునిసిపల్ సంస్థల్లో 1.723 మిలియన్ల వీధిదీపాలు ఏర్పాటు చేశామని, 193 మెగావాట్ల విద్యుత్ ఆదా చేసినట్టు ఈఈఎస్ఎల్ రాష్ట్ర ముఖ్యుడొకరు పేర్కొన్నారు. 0.81 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ కూడా తగ్గిందని, ఇది పర్యావరణానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు.

ప్లాట్ల వేలం ఇప్పుడొద్దు!

(5వ పేజీ తరువాయి)

మంది డబ్బులు కట్టలేదు. మిగతా లేఅవుట్లలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఈ వేలం సందర్భంలోనూ అమ్ముడుపోని ప్లాట్లున్నాయి. ఇలా ఆయా లేఅవుట్లలో మిగిలిన ప్లాట్లను మరోసారి విక్రయించేందుకు హెచ్ఎండీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ప్రతికూల పరిస్థితులున్నాయని అధికారులు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. వరుసగా ఎన్నికలు రావడం, లావాదేవీల్లో కొంత వరకు స్తంభన రావడం లాంటి అంశాలను అంచనా వేసినట్లుగా సమాచారం. ఈ-వేలం జరిపిన తర్వాత ఆయా ప్లాట్ల ధరలు గతం కంటే ఏమాత్రం తగ్గినా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలున్నాయి. దీంతో అధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ప్లాట్ల విక్రయానికి సానుకూల అంశాలు బలపడిన తర్వాతే ఈ-వేలం జరపాలని భావిస్తున్నారు.







హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ. 4,235 కోట్లు

ఒక్కో షేరుకు రూ. 12 డివిడెండ్



న్యూఢిల్లీ: దేశంలో మూడో అతి పెద్ద ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను వి ంచాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25), సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో కంపెనీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10.51 శాతం వృద్ధితో రూ.4,235 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి సంస్థ లాభం రూ.3,832 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ క్యూ2లో హెచ్‌సీఎల్ టెక్ రూ.28,862 కోట్ల ఆదాయాన్ని గడించింది. 2023-24 క్యూ2లో నమోదైన రూ.26,672 కోట్ల రెవెన్యూతో పోలిస్తే 8.21 శాతం వృద్ధి కనబరిచింది. ఈ జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)తో పోలిస్తే మాత్రం కంపెనీ నికర లాభం 0.5 శాతం తగ్గగా.. ఆదాయంలో కేవలం 3 శాతం వృద్ధి నమోదైంది. డేటా అండ్ ఏఐ, డిజిటల్ ఇంజనీరింగ్, శాప్ మైగ్రేషన్ అండ్ ఎఫిషియెన్సీ ఆధారిత ప్రోగామ్‌లు సహా కంపెనీ చేతిలో ఆర్డర్లు సమృద్ధిగా ఉన్నాయని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సీ విజయ్ కుమార్ అన్నారు. కాగా, ఈ సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ మంచి ఆదాయ వృద్ధిని నమోదు చేయడంతో పాటు లాభదాయకతనూ మెరుగుపరుచుకుందని కంపెనీ సీఎఫ్ఓ శివ్ వాలియా అన్నారు.

మరిన్ని ముఖ్యాంశాలు..

- 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను హెచ్‌సీఎల్ టెక్ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.
- పూర్తి ఆర్థిక సంవత్సరానికి స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.5-5 శాతం మేర వృద్ధి చెందవచ్చని, ఎబిటా మార్జిన్ 18-19 శాతంగా ఉండవచ్చని హెచ్‌సీఎల్ టెక్ అంచనా వేసింది.
- గడిచిన త్రైమాసికంలో సంస్థ 221 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకుంది. అంతక్రితం త్రైమాసికంలో లభించిన 196 కోట్ల డాలర్ల డీల్స్‌తో పోలిస్తే విలువ మరింత పెరిగింది.
- ఈ జూలై-సెప్టెంబరులో కంపెనీ 2,932 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకుంది. అయినప్పటికీ, గత మూడు నెలల్లో ఉద్యోగుల సంఖ్య నికరంగా 780 తగ్గి మొత్తం 2,18,621 కి పరిమితమైంది. అయితే, ఉద్యోగుల వలసల రేటు మాత్రం 12.9 శాతానికి తగ్గింది. కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 4,000 మంది ఫ్రెషర్స్‌ను చేర్చుకున్నట్లు తెలిపింది.
- బీఎస్ఈలో కంపెనీ షేరు 0.89 శాతం లాభంతో రూ.1,856 దగ్గర ముగిసింది.

సెప్టెంబరులో ధరల మంట

- 9 నెలల గరిష్ఠ స్థాయిలో రిటైల్ ద్రవ్యోల్బణం
- 5.49 శాతంగా నమోదు

న్యూఢిల్లీ: దేశంలో ధరల సెగ మరింత ఊపందుకుంది. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా లెక్కించే రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబరు నెలలో తొమ్మిది నెలల గరిష్ఠ స్థాయి 5.49 శాతానికి చేరింది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) సోమవారం ఈ వివరాలు విడుదల చేసింది. ఈ ఏడాది ఆగస్టుతో పోల్చితే సెప్టెంబరు రిటైల్ ద్రవ్యోల్బణం 1.84 శాతం పెరిగింది. గత ఏడాది సెప్టెంబరుతో పోల్చితే మాత్రం 0.47 శాతం ఎక్కువ. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని రెండు శాతం అటుఇటుగా నాలుగు శాతం వద్ద కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి లక్ష్యంగా నిర్దేశించింది. మరోవైపు టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారంగా లెక్కించే ద్రవ్యోల్బణం కూడా సెప్టెంబరులో అంతకు ముందు నెలతో పోలిస్తే 1.31 శాతం నుంచి 1.84 శాతానికి పెరిగింది.

రెపో తగ్గింపు ఆశలు గల్లంతు!

సెప్టెంబరు నెల రిటైల్ ద్రవ్యోల్బణం పెరగటానికి ఆహారోత్పత్తుల ధరల పెరుగుదలే ప్రధాన కారణం. ఆగస్టులో 5.66 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 9.24 శాతానికి ఎగబాకింది. కూరగాయల ధరలు చుక్కలంటడం ఆహార ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణమని ఎన్ఎస్ఓ తెలిపింది. ఈ మంట ఇదే విధంగా కొనసాగితే అక్టోబరులోనూ రిటైల్ ద్రవ్యోల్బణం 5.5 శాతంపైనే నమోదయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే డిసెంబరులో జరిగే ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్షలోనూ ఆర్‌బీఐ కీలక రెపో రేటు తగ్గింపునకు సాహసించక పోవచ్చని భావిస్తున్నారు.

రిలయన్స్ లాభం 5% డౌన్



సెప్టెంబరు త్రైమాసిక లాభం రూ.16,563 కోట్లు

ఓ2సీ విభాగం డీలా.. జియో, రిటైల్ నిలకడగా..

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) లాభాలకు గండిపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) కంపెనీ నికర లాభం రూ.16,563 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.24.48) పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నమోదైన రూ.17,394 కోట్ల (ఒక్కో షేరుకు రూ.25.71) లాభంతో పోలిస్తే 5 శాతం తగ్గింది. ఆయిల్ రిఫైనింగ్ అండ్ పెట్రోకెమికల్స్ (ఓ2సీ) వ్యాపారం బలహీనపడటమే ఇందుకు ప్రధాన కారణం. ఈ క్యూ2లో ఓ2సీ ఆదాయం 5.1 శాతం వృద్ధితో రూ.1.55 లక్షల కోట్లకు పెరిగినప్పటికీ, ఎబిటా మాత్రం 23.7 శాతం క్షీణించి రూ.12,413 కోట్లకు పడిపోయింది. ఈ విభాగ పేలవ పనితీరు కారణంగా రిలయన్స్ లాభాలు తగ్గడం వరుసగా ఇది మూడోసారి. కాగా, ఈ క్యూ2లో ఆర్ఐఎల్ మొత్తం ఆదాయం రూ.2.40 లక్షల కోట్లుగా నమోదైంది. 2023-24లో ఇదే కాలానికి గడించిన రూ.2.38 లక్షల కోట్ల రెవెన్యూతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది.

రిటైల్ రెవెన్యూ రూ.66,502 కోట్లు

గడిచిన త్రైమాసికంలో ఆర్ఐఎల్ చిల్లర వర్తక విభాగమైన రిలయన్స్ రిటైల్ వెంచర్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) నిర్వహణ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.5 శాతం తగ్గి రూ.66,502 కోట్లకు పడిపోయింది. నికర లాభం కేవలం 1.28 శాతం పెరిగి రూ.2,836 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలానికి రిలయన్స్ రిటైల్ రూ.68,937 కోట్ల ఆదాయంపై రూ.2,800 లాభాన్ని ఆర్జించింది. ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ విభాగంలో గిరాకీ బలహీనపడటంతోపాటు రిటైల్ వ్యాపారాల క్రమబద్ధీకరణ, బీ2బీ వ్యాపార మార్జిన్ల పెంపుపై దృష్టిసారించడం రిటైల్ వ్యాపార వృద్ధిపై ప్రభావం చూపిందని ఆర్ఐఎల్ పేర్కొంది. గడిచిన మూడు నెలల్లో ఆర్ఆర్‌వీఎల్ కొత్తగా 464 స్టోర్లను ప్రారంభించింది.

నికర అప్పు రూ.1.16 లక్షల కోట్లు

సెప్టెంబరు 30 నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్ మొత్తం రుణం రూ.3.36 లక్షల కోట్లకు పెరిగింది. కంపెనీ వద్దనున్న రూ.2.20 లక్షల కోట్ల నగదు నిల్వలను మినహాయిస్తే, నికర అప్పు రూ.1.16 లక్షల కోట్లుగా నమోదైంది.

జియో లాభంలో 23.4 % వృద్ధి

ఈ సెప్టెంబరుతో ముగిసిన క్వార్టర్‌లో ఆర్ఐఎల్ టెలికాం, డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 23.4 శాతం వృద్ధి చెంది రూ.6,539 కోట్లకు పెరిగింది. వ్యాపార కార్యకలాపాల ద్వారా సమకూరిన ఆదాయం 18 శాతం పెరుగుదలతో రూ.31,709 కోట్లకు చేరుకుంది. స్థూల ఆదాయం 17.7 శాతం వృద్ధితో రూ.37,119 కోట్లుగా నమోదైంది. రిలయన్స్ జియో ఒక్కో వినియోగదారు నుంచి లభించిన సగటు ఆదాయం (ఆర్పూ) రూ.195.1కి పెరిగింది. టారిఫ్‌ల పెంపుతో పాటు వినియోగదారులు మరింత పెరగడం ఇందుకు దోహదపడింది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో ఆర్పూ రూ.181.7గా ఉంది. టారిఫ్‌ల పెంపు ద్వారా పూర్తి స్థాయి లబ్ధి వచ్చే 2-3 త్రైమాసికాల్లో కన్పించవచ్చని కంపెనీ పేర్కొంది. గత క్వార్టర్‌లో రిలయన్స్ జియో కస్టమర్ల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 4.2 శాతం పెరిగి 47.88 కోట్లకు చేరుకుంది.

ఆయిల్, గ్యాస్ ఆదాయం రూ.6,222 కోట్లు

ఆయిల్ అండ్ గ్యాస్ ఉత్పత్తి, అన్వేషణ విభాగ వ్యాపార ఆదాయం ఈ క్యూ2లో 6 శాతం తగ్గి రూ.6,222 కోట్లకు పరిమితమైంది. ఎబిటా మాత్రం 11 శాతం వృద్ధితో రూ.5,290 కోట్లుగా నమోదైంది. గత త్రైమాసికంలో ఏపీలోని కేజీ డీ6 బేసిన్ నుంచి రోజుకు సగటున 28.5 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను, 20,832 బ్యారెళ్ల ఆయిల్‌ను ఉత్పత్తి చేసినట్లు కంపెనీ వెల్లడించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,620 ▲	71,150 ▲	1,03,000 ▲
ముంబై	76,001 ▲	69,617 ▲	90,026 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126	విజయవాడ	135
వరంగల్	126	గుంటూరు	135
కరీంనగర్	126	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	126	చిత్తూరు	135
కర్నూలు	126	నెల్లూరు	135
విశాఖపట్నం	125	అనంతపురం	135
గోదావరి	135		

వచ్చే ఏడాది నుంచి బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు

కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) 5జీ సేవలకు సిద్ధమవుతోంది. వచ్చే ఏడాది జూన్ నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయని కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈ లోపు వచ్చే ఏడాది మే నాటికల్లా 4జీ సేవల కోసం లక్ష బేస్ స్టేషన్ల ఏర్పాటు పూర్తి చేస్తామన్నారు. ఈ స్టేషన్లనే 5జీ సేవలకు అనువైన టవర్లుగా మారుస్తామన్నారు. భారత-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ఆయన ఈ విషయం వెల్లడించారు. 4జీ సేవల కోసం బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే 38,300 టవర్ల ఏర్పాటు పూర్తి చేసిందన్నారు. ఇలా 4జీ టవర్లను 5జీ టవర్లుగా మార్చే టెక్నాలజీ ఉన్న దేశాల్లో మనది ఆరో దేశమని తెలిపారు.

'ఏఐ'పై అతిగా ఆధారపడొద్దు

ఆర్‌బీఐ గవర్నర్ దాస్



న్యూఢిల్లీ: బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి టెక్నాలజీలపై అతిగా ఆధారపడడం ఏ మాత్రం మంచిది కాదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. అదే జరిగితే వ్యవస్థీకృత నష్టభయాలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆర్‌బీఐ నిర్వహించిన ఒక సదస్సులో కీలకోపన్యాసం చేస్తూ ఆయన ఈ హెచ్చరిక చేశారు. వ్యాపార విస్తరణ, లాభాల విస్తరణ కోసం సరికొత్త టెక్నాలజీలను అవసరం మేరకు అందిపుచ్చుకోవాలే తప్ప పూర్తిగా వాటిపైనే ఆధారపడడం ఏ మాత్రం మంచిది కాదన్నారు. ఈ టెక్నాలజీలు అందించే కొద్ది సంస్థలు మార్కెట్‌పై ఆధిపత్యం సంపాదించినా అది దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికే ముప్పుగా పరిణమించే ప్రమాదం ఉందని దాస్ హెచ్చరించారు.

ఏఐ వంటి టెక్నాలజీల కారణంగా సైబర్ నేరాలు, డేటా చౌర్యం ముప్పు పొంచి ఉందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, దుష్ప్రచారాలతో బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు ఆకస్మికంగా లిక్విడిటీ (నిధుల లభ్యత) సమస్య ఎదుర్కొనే ప్రమాదమూ ఉందన్నారు.

మళ్లీ 25,000 ఎగువకు నిఫ్టీ

- సెన్సెక్స్ 592 పాయింట్లు అప్
- ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు పెంచడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం మెరుగైన లాభాలు నమోదు చేశాయి. సెన్సెక్స్ 591.69 పాయింట్లు బలపడి 81,973.05 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 163.70 పాయింట్లు పెరిగి 25,127.95 వద్ద ముగిసింది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ రూ.1.35 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.463.62 లక్షల కోట్లకు చేరుకుంది.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసలు పెరిగి రూ.84.06 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు బ్యారల్ ధర ఒక దశలో 2.52 శాతం తగ్గి 77.05 డాలర్ల వద్ద ట్రేడైంది.
- ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.200 పెరిగి మళ్లీ ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయి రూ.78,700కు చేరుకుంది. కిలో వెండి రూ.500 పెరుగుదలతో రూ.93,500 పలికింది.

మహిళల వరల్డ్‌కప్‌లో నేడు
ఇంగ్లండ్ X వెస్టిండీస్ రా. 7.30

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణులకు ఆర్థిక సాయం

ఆంధ్రజ్యోతి వార్తతో కదలిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టులో చోటు దక్కించుకున్న గురుకులాల ప్లేయర్లు ఎల్. రాణి, ఎ. ఇందు, జి. మమతలకు ఆర్థిక సాయం చేసేందుకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి వర్షిణి ముందుకొచ్చారు. 'ప్రతిభకు పేదరికం అడ్డు' అనే శీర్షికతో ఈనెల 12న ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. తైవాన్‌లోని తైచుంగ్‌లో జరగనున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఈ పేద క్రీడాకారిణులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తెలియజేసింది. ఈవార్తపై స్పందించిన గురుకులాల ప్రభుత్వ యంత్రాంగం.. ఈ టోర్నీలో పోటీపడేందుకు ముగ్గురు ప్లేయర్లకయ్యే ఖర్చును పూర్తిగా భరించాలని నిర్ణయించింది. దీంతో ముగ్గురు ప్లేయర్లతో పాటు కోచ్ రంజిత్ టోర్నమెంట్ కోసం సోమవారం తైవాన్‌కు పయనమయ్యారు.

ఫామ్‌లోకి రావాలని..



బరిలో సింధు, లక్ష్య సేన్

నేటినుంచి డెన్మార్క్ ఓపెన్

ఒడెన్స్ (డెన్మార్క్): వరుస వైఫల్యాలతో ఒత్తిడిలో ఉన్న ఏస్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్ మళ్లీ పుంజుకోవాలనుకొంటున్నారు. మంగళవారం నుంచి జరిగే డెన్మార్క్ ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. తొలి రౌండ్‌లో పై యు పో (చైనీస్ తైపీ)తో సింధు తలపడనుంది. యువ షట్లర్లు ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోడ్, ఉన్నతి హుడా సత్తాచాటాలనే ఉత్సాహంతో ఉన్నారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లు గువాంగ్ జు (చైనా)తో లక్ష్య సేన్ ఆడనున్నాడు. గతవారం ఆర్కిటిక్ ఓపెన్‌లో సింధు తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టగా.. లక్ష్యకు రెండో రౌండ్‌లో షాక్ తగిలింది. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల, రితుపర్ణ-స్వేతపర్ణలతోపాటు మిక్స్‌డ్‌లో సుమీత్-సిక్కి, సతీష్-ఆద్య జంటలు పోటీపడనున్నాయి.

రిస్క్ తీసుకుంటేనే మజా

మా బ్యాటర్ల దూకుడును ఆపలేను

టీమిండియా చీఫ్ కోచ్ గంభీర్



టీమిండియా ప్రాక్టీస్ సందర్భంగా కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్

బెంగళూరు: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో భారత బ్యాటర్ల ఆటతీరు విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. దాదాపు మూడు రోజుల ఆట వర్షార్పణమైనా చివరి రెండు రోజుల ఆటలోనే మ్యాచ్ ఫలితం వచ్చేలా రోహిత్ సేన చెలరేగింది. అలా రిస్క్ తీసుకుని ఆడితేనే ఫలితం వస్తుందని కోచ్ గంభీర్ చెబుతున్నాడు. పైగా అలాంటి ఆటను ప్రదర్శించగల సత్తా ఉన్న తమ ప్లేయర్లను ఎందుకు అడ్డుకోవాలని ప్రశ్నించాడు. బుధవారం నుంచి కివీస్‌తో టెస్టు సిరీస్ ఆరంభం కానుండగా కోచ్ గంభీర్ విలేకరులతో మాట్లాడాడు. 'తమ సహజమైన శైలితో బ్యాటింగ్ చేస్తూ ఒక్క రోజులోనే 400-500 పరుగులను సాధించగల సత్తా ఉన్న బ్యాటర్లను నేనెందుకు ఆపాలి? ఆడాల్సి వచ్చినప్పుడు అలాగే ఆడతాం. ఎంత రిస్క్ తీసుకుంటే అంత ఫలితం ఉంటుంది. అలాగే ఒక్కోసారి 100 పరుగులకే ఆలౌట్ అయ్యే పరిస్థితి కూడా ఎదురవ్వచ్చు. మరోవైపు డ్రాకోసం ఆడాల్సివస్తే రెండు రోజులైనా క్రీజులో నిలవగలిగేలా జట్టు ఉండాలని కోరుకుంటున్నా. అలా ఆడే బ్యాటర్లు కూడా మా దగ్గర ఉన్నారు. ఏదేమైనా పరిస్థితులకు తగ్గట్టుగా ముందుకెళ్లాల్సి ఉంటుంది. అదే టెస్టు క్రికెట్ అంటే. ఎప్పుడూ ఒకేలా ఆడితే ఎదగలేం' అని గౌతీ తేల్చాడు. మరోవైపు భారత్‌ను ఓడించే సత్తా న్యూజిలాండ్‌కు ఉందని, ఆ జట్టులో అద్భుత క్రికెటర్లున్న విషయం మరువరాదన్నాడు. అందుకే ఈ సిరీస్ తమకు సవాల్‌లాంటిదేనని చెప్పాడు. ప్రస్తుతానికైతే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఆలోచన లేదని, కివీస్‌తో సిరీస్ నెగ్గడంపైనే దృష్టి సారించినట్టు గంభీర్ పేర్కొన్నాడు.

విరాట్ ఫామ్‌పై ఆందోళన ఎందుకు?

బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయాడు. అయితే ప్రతీ మ్యాచ్‌కూ అతడి ఫామ్‌ను అంచనా వేయడం సరికాదని కోచ్ గంభీర్ స్పష్టం చేశాడు. 'విరాట్ అత్యుత్తమ ఆటగాడు. అరంగేట్రం చేసినప్పుడున్న పరుగుల దాహం నేటికీ కొనసాగుతోంది. రానున్న కివీస్, ఆసీస్‌తో సిరీస్‌ల్లో భారీగా పరుగులు సాధించగలడనే నమ్మకం ఉంది. అందుకే అతడి ఫామ్‌పై ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఏదేమైనా ఓ మ్యాచ్‌కో.. సిరీస్‌కో ఆటగాడి ప్రదర్శనను అంచనా వేయడం సరి కాదు. ప్రతీ ఆటగాడికి మద్దతుగా నిలవాల్సిన అవసరం నాకుంది' అని గంభీర్ స్పష్టం చేశాడు.

భారత్ అవుట్ సెమీస్‌కు కివీస్





పాక్‌పై గెలిచిన ఆనందంలో న్యూజిలాండ్ జట్టు

54 పరుగులతో పాకిస్థాన్ పరాజయం

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్ కప్ నుంచి భారత జట్టు నిష్క్రమించింది. గ్రూపు 'ఎ' ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భాగంగా సోమవారం న్యూజిలాండ్ చేతిలో పాకిస్థాన్ దారుణంగా ఓడడంతో మన అమ్మాయిల సెమీఫైనల్ ఆశలు గల్లంతయ్యాయి. స్వల్ప స్కోరు చేసినా..కట్టుదిట్టమైన బౌలింగ్‌తో న్యూజిలాండ్ అదరగొట్టింది. 54 పరుగులతో గెలిచి ఇటు పాకిస్థాన్‌ను అటు భారత్‌ను నాకౌట్ చేసింది. గ్రూపులో రెండో స్థానంతో సెమీస్ బెర్త్ దక్కించుకుంది. ఇక నాలుగింటికి నాలుగు మ్యాచ్‌లు నెగ్గి గ్రూపు 'ఎ' టాపర్‌గా ఆస్ట్రేలియా ఇప్పటికే సెమీఫైనల్లో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. తొలుత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 110/6 స్కోరుకే పరిమితమైంది. సుజీబేట్స్ (28), హాలీడే (22), సోఫీ డివైన్ (19) రాణించారు. నష్రా సంధూ 3 వికెట్లు పడగొట్టింది. స్వల్ప ఛేదనలో పాకిస్థాన్ 11.4 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ ఫాతిమా సనా (21) టాప్ స్కోరర్. ఆ తర్వాత మునీబా అలీ (15) మాత్రమే రెండంకెల స్కోరు చేసింది. అమీలియా కెర్ 3, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కార్సన్ 2 వికెట్లు తీశారు.

భారీ షాట్లతో బోల్తా: 10.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదిస్తే సెమీస్ బెర్త్ లభిస్తుందన్న లెక్కతో..దూకుడుగా ఆడేందుకు యత్నించిన పాకిస్థాన్ ఆ క్రమంలో వికెట్లు పారేసుకుంది. ఫలితంగా పవర్ ప్లే ముగిసే సరికి 28/5తో కోలుకోలేని స్థితికి చేరింది. కానీ ఫాతిమా సనా, నిదా దర్ (9) ఆరో వికెట్‌కు 24 పరుగులు జోడించడంతో పాకిస్థాన్ జట్టు కనీసం మ్యాచ్‌ను గెలుస్తుందని, తద్వారా భారత్ సెమీఫైనల్ చేరుతుందనే ఆశ ఏర్పడింది. నిదా దర్‌ను ఊరించే బంతితో కెర్ స్టంపౌట్ చేయడం..ఆపై ఒమైమా (2), అరూబ్ (0) ఇలా వచ్చి అలా వెళ్లడం..ఫాతిమా సనాను కెర్ అవుట్ చేయడంతో అటు పాకిస్థాన్ గెలుపు ఆశలు ఇటు భారత్ సెమీస్ అవకాశాలు గల్లంతయ్యాయి.

సంక్షిప్తస్కోర్లు
న్యూజిలాండ్: 20 ఓవర్లలో 110/6 (బేట్స్ 28, హాలీడే 22, డివైన్ 19, ప్లిమ్మెర్ 17, నష్రా సంధు 3/18)
పాకిస్థాన్: 11.4 ఓవర్లలో 56 ఆలౌట్ (ఫాతిమా సనా 21, మునీబా అలీ 15, కెర్ 3/14, కార్సన్ 2/7).

నష్రా హవా: పాకిస్థాన్ బౌలర్లు ముఖ్యంగా లెఫ్టామ్ స్పిన్నర్ నష్రా సంధు ప్రత్యర్థి బ్యాటర్లకు పూర్తిగా కళ్లెం వేసింది. ఇక పాకిస్థాన్ ఫీల్డర్లు ఏకంగా ఎనిమిది క్యాచ్‌లు వదిలేశారు. అందులో నాలుగు క్యాచ్‌లను నిదా దర్ బౌలింగ్‌లోనే వదిలేయడం గమనార్హం. అయితే పాకిస్థాన్ చెత్త ఫీల్డింగ్‌ను న్యూజిలాండ్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఓపెనర్లు సుజీ బేట్స్, ప్లిమ్మర్ వేగంగా ఆడడంతో పవర్ ప్లేలో కివీస్ 39/0 స్కోరు చేసింది. దూకుడుగా ఆడుతున్న ప్లిమ్మర్ (17)ను, అనంతరం బేట్స్‌ను నష్రా పెవిలియన్ చేర్చింది. అమీలియా (9) విఫలం కావడంతో కివీస్ 58/3తో నిలిచింది. ఈ దశలో కెప్టెన్ సోఫీ, హాలీడే నాలుగో వికెట్‌కు 38 రన్స్ జోడించి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. కానీ పాకిస్థాన్ బౌలర్లు మరోసారి విజృంభించి న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు.

కివీస్‌తో టెస్టుకు ముగ్గురు పేసర్లతోనే!



న్యూజిలాండ్‌తో ఈనెల 16 నుంచి జరిగే తొలి టెస్టులో భారత జట్టు ముగ్గురు పేసర్లతోనే బరిలోకి దిగే అవకాశం ఉంది. స్థానిక చిన్నస్వామి స్టేడియంలో పచ్చికతో కూడిన పిచ్‌ను సిద్ధం చేశారు. దీంతో చక్కటి బౌన్స్ లభించే చాన్సుంది. ఇటీవల బంగ్లాతో సిరీస్‌లోనూ జట్టు ఇదే వ్యూహంతో ముందుకెళ్లింది. తొలి టెస్టు జరిగిన చెన్నై వికెట్ సహజంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంటుంది. కానీ జట్టు మాత్రం పేసర్లకు తగినట్టుగా తయారు చేయించింది. ఇప్పుడు కూడా రాబోయే ఆస్ట్రేలియా టూర్ దృష్ట్యా పేసర్లకు సహాయకారిగా ఉంచే పిచ్ వైపే జట్టు దృష్టి సారించింది. ఫలితంగా కివీస్‌తో మొదటి టెస్టులో భారత్ ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో ఆడొచ్చు. 2022లో ఇక్కడ జరిగిన చివరి టెస్టులోనూ పేసర్ల ఆధిపత్యం కనిపించింది. అప్పుడు శ్రీలంకపై బుమ్రా ఒక్కడే 8 వికెట్లు తీశాడు. పైగా పేసర్లు సిరాజ్, ఆకాశ్ ఆర్‌సీబీ ప్లేయర్లు కావడంతో చిన్నస్వామి వికెట్‌పై చక్కటి అవగాహనే ఉంటుంది. మంగళవారం వికెట్‌ను చూశాక జట్టు కూర్పుపై అంచనాకు వస్తామని గంభీర్ చెప్పాడు. భారత్‌తో సిరీస్‌కు ముందు కివీస్ జట్టు లంక టూర్‌లో స్పిన్నర్లకు దాసోహమైంది. రెండు టెస్టుల్లో ఏకంగా 37 వికెట్లు వారికే కోల్పోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మరో స్పిన్నర్‌ను జట్టులోకి తెచ్చినా ఆశ్చర్యం లేదు.

కుప్పకూలిన హైదరాబాద్

గుజరాత్ చేతిలో ఓటమి

హైదరాబాద్: తాజా రంజీ సీజన్‌ను హైదరాబాద్ ఓటమితో ఆరంభించింది. గ్రూప్-బిలో గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 126 పరుగుల తేడాతో చిత్తయింది. గుజరాత్ నిర్దేశించిన 297 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు ఆఖరి రోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 170 పరుగులకు కుప్పకూలింది. అభిరత్ (51) అర్ధ శతకం సాధించాడు. ప్రియాజిత్ సింగ్, రింకేష్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. గుజరాత్ 343, 201 స్కోరు చేయగా.. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులు సాధించింది. కాగా, విదర్భతో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 74 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.

ముంబైకి బరోడా షాక్

వడోదర: లెఫ్టామ్ స్పిన్నర్ భార్గవ్ భట్ (6/55) తిప్పేయడంతో.. రంజీ డిఫెండింగ్ చాంప్ ముంబైకి బరోడా షాకిచ్చింది. గ్రూప్-ఎలో జరిగిన మ్యాచ్‌లో బరోడా 84 పరుగులతో ముంబైను ఓడించింది. 262 పరుగుల ఛేదనలో.. ఓవర్‌నైట్ స్కోరు 42/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 177 రన్స్‌కు ఆలౌటైంది. బరోడా 290, 185 స్కోర్లు చేయగా.. ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 214 రన్స్‌కు ఆలౌటైంది.

గ్రీన్ అవుట్

బోర్డర్-గవాస్కర్ సిరీస్

సిడ్నీ: ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టెస్ట్ సిరీస్‌కు ఆసీస్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ దూరమయ్యాడు. వెన్ను నొప్పికి శస్త్రచికిత్స చేయించుకోనున్న అతడు..ఆరు నెలలపాటు ఆటనుంచి విశ్రాంతి తీసుకోనుండడమే అందుకు కారణం. గత నెల యూకే పర్యటన సందర్భంగా 25 ఏళ్ల గ్రీన్ తీవ్ర వెన్ను నొప్పితో బాధపడ్డాడు.

విక్టర్‌కు భారీ ధర

హెచ్ఐఎల్ వేలం

న్యూఢిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) రెండో రోజు వేలంలో బెల్జియం మిడ్‌ఫీల్డర్ విక్టర్ వాగ్నెజ్ అత్యధిక ధర పలికిన ఆటగాడిగా నిలిచాడు. సోమవారం జరిగిన వేలంలో విక్టర్‌ను సూర్మ హాకీ క్లబ్ రూ. 40 లక్షలకు ఖరీదు చేసింది. డచ్ ప్లేయర్లు థియర్రీ బింగ్ మన్‌ను రూ. 38 లక్షలకు, డోరెన్‌ను రూ. 32 లక్షలకు కళింగ లాన్సర్స్ కొనుగోలు చేసింది. భారత ఆటగాళ్లలో రవిచంద్రను రూ. 32 లక్షలకు లాన్సర్స్, రహీర్ ను రూ. 25 లక్షలకు డ్రాగన్స్ దక్కించుకున్నాయి.

నేడు మహిళల హాకీ ప్లేయర్ల వేలం

తొలి భారత మహిళల హాకీ లీగ్ వేలం మంగళవారం ఇక్కడ జరగనుంది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 300 మందికి పైగా క్రీడాకారిణులు వేలంలో నిలిచారు. వీరిలో 250 మంది దేశ క్రీడాకారిణులుకాగా 70 మంది విదేశీయులు. 4 జట్లు వేలంలో పాల్గొననున్నాయి.

త్వరలోనే మంత్రివర్గ విస్తరణ

- కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్తాం
- బీఆర్ఎస్‌ది అసత్య ప్రచారం: టీపీసీసీ చీఫ్ మహేశ్
- కొత్తగా చేరిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల మధ్య విభేదాలు ఉన్న మాట వాస్తవమేనని వెల్లడి



నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో తమ పార్టీ ఉందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎక్కువ కాలం పొడగించడం కుదరదని, అందుకే కుల గణన కోసం నియమించిన కమిషన్‌కు రెండు నెలల సమయమే ఇచ్చామని గుర్తు చేశారు. నిజామాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ విషయంలో ప్రజలను బీఆర్ఎస్ తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. సాంకేతిక సమస్యల వల్ల కొన్ని చోట్ల ఇబ్బందులున్నాయని, వాటినీ త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఇచ్చిన రుణమాఫీ ఎంత? తొమ్మిది నెలల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రుణమాఫీ ఎంత? చర్చకు సిద్ధమేనా? అని హరీశ్‌రావును ప్రశ్నించారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసిన బీఆర్ఎస్... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తోందన్నారు. బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాతెచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల మధ్య విభేదాలు ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. నిజామాబాద్ కాంగ్రెస్ నాయకులందరం సీఎంను కలిసి పారిశ్రామిక అభివృద్ధిపై చర్చిస్తామన్నారు.

మూసీ జన్మస్థానంలో రాడార్ కేంద్రమా?

- రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తున్నాం: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు మూసీ సుందరీకరణ అంటూ ప్రకటనలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి... అదే మూసీని ప్రమాదంలో పడేసే రాడార్ స్టేషన్‌కు ఎలా అనుమతిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం ద్వంద్వ వైఖరికిది అద్దం పడుతోందన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేవీకి సంబంధించిన వీఎల్ఎఫ్ రాడార్‌స్టేషన్ నిర్మాణం ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 లక్షల చెట్లను నరికేసి, దాదాపు 2900 ఎకరాల అటవీ భూభాగాన్ని నాశనం చేసేందుకే సర్కారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతించిందా? అని ఆయన ప్రశ్నించారు. జనావాసాలు లేని ద్వీపాల్లో ఏర్పాటు చేయాల్సిన దాన్ని తెలంగాణలో ఎందుకు చేస్తోందని, ఏం ఆశించి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

18న నాంపల్లి కోర్టుకు కేటీఆర్

మంత్రి కొండా సురేఖపై వేసిన క్రిమినల్ పరువు నష్టం దావాలో తన వాంగ్మూలం ఇచ్చేందుకు కేటీఆర్ ఈనెల 18న నాంపల్లి కోర్టుకు వెళ్లనున్నారు. సినీ నటులు అక్కినేని నాగ చైతన్య సమంత విడాకులకు తానే కారణమని సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలు కారణంగా తన గౌరవ మర్యాదలకు భంగం కలిగాయంటూ ఆయన నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం 18వ తేదీన కేటీఆర్‌తో పాటు సాక్షులు తులా ఉమ, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్‌ను కోర్టుకు వచ్చి వాంగ్మూలాలను ఇవ్వాల్సిందిగా ఆదేశించింది.

ఈడీ కస్టడీకి సాహితి లక్ష్మీనారాయణ

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బి. లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. ప్రపంచస్థాయి విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ నివాస సముదాయాల పేరుతో వందల కోట్లు దారి మళ్లించిన కేసులో లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు 15 రోజుల క్రితం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. చంచల్‌గూడ జైల్లో విచారణ ఖైదీగా ఉన్న లక్ష్మీనారాయణను పూర్తిస్థాయిలో విచారించేందుకు ఈడీ అధికారులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం న్యాయస్థానం 5 రోజుల ఈడీ కస్టడీకి గత వారం అనుమతించింది. దీంతో జైల్లో ఉన్న లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు సోమవారం ఉదయం కస్టడీకి తీసుకున్నారు. ముందుగా ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి తరలించారు. ప్రత్యేక అధికారుల బృందం లక్ష్మీనారాయణ కుటుంబ నేపథ్యం, వ్యాపారం, టర్నోవర్, ఆదాయం, ఆస్తులు.. ఇలా అనేక అంశాలపై వివరాలు రాబట్టే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ప్రి లాంచ్ పేరుతో 700 మంది నుంచి సేకరించిన రూ. 360 కోట్లు ఎక్కడికి దారి మళ్లించారు... ఎక్కడెక్కడ ఆస్తులు కొనుగోలు చేశారనే కోణంలో ఈడీ వివరాలు రాబట్టనుంది. శుక్రవారం వరకు లక్ష్మీనారాయణను ఈడీ ప్రత్యేక బృందం కస్టడీలో పూర్తిస్థాయిలో విచారించి వివరాలు రాబట్టనుంది.

పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా.. శ్రీపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి ఎంపిక

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ శాసన మండలికి జరగబోయే రెండు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థులను పీఆర్‌టీయూ ఖరారు చేసింది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గానికి పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ నియోజకవర్గానికి వంగ మహేందర్‌రెడ్డిలను తమ అభ్యర్థులుగా పీఆర్‌టీయూ సోమవారం నాడు ప్రకటించింది. పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రస్తుతం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీ పాఠశాలలో పనిచేస్తూ, పీఆర్‌టీయూ సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అలాగే సిద్దిపేట జిల్లాకు చెందిన వంగ మహేందర్‌రెడ్డి ఇప్పటికే స్వచ్ఛంద పదవీ విరమణ పొంది, పీఆర్‌టీయూ రాష్ట్ర నేతగా పనిచేస్తున్నారు. 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఏకగ్రీవంగా ఖరారు చేసినట్లు పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదరరెడ్డి తెలిపారు.

లోన్ ఇప్పించి మరీ రూ.20 లక్షల సైబర్ దోపిడీ!

- డ్రగ్స్ పార్సిల్ పేరిట మహిళను భయపెట్టి మోసం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ కేటుగాళ్లు రోజురోజుకు తెలివి మీరిపోతున్నారు. బ్యాంకు ఖాతాల్లో నగదు లేకున్నా లోను ఇప్పించి మరీ దోచుకుంటున్నారు.. డ్రగ్స్ పార్సిల్ పేరిట ఓ మహిళను భయపెట్టిన నేరగాళ్లు.. రూ.20 లక్షల ప్రీ అప్రూవ్‌డ్ లోన్ ఇప్పించి మరీ కొట్టేశారు..! చివరకు మోసపోయానని గ్రహించిన బాధితురాలు హైదరాబాద్ సిటీ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన 44 ఏళ్ల బాధితురాలు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఆమెకు రెండ్రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి నుంచి స్కైప్ వీడియో కాల్ వచ్చింది. ఆమె స్పందించి మాట్లాడగా.. అవతలి వ్యక్తి ముంబై సైబర్ క్రైమ్ పోలీసునంటూ పరిచయం చేసుకున్నాడు. ఆమె పేరు, అడ్రస్‌తో ముంబై నుంచి ఇరాన్‌కు వెళ్తున్న ఒక డ్రగ్స్ పార్సిల్‌ను పట్టుకున్నామని చెప్పాడు. దీనికి సంబంధించి కేసు నమోదైందని పలు పత్రాలను చూపించాడు. అలాగే ఆమె ఆధార్ కార్డుతో మొత్తం 30 బ్యాంకు ఖాతాలు తెరిచి ఉన్నాయని.. మనీలాండరింగ్ జరిగిందని భయపెట్టాడు. ఈ విషయం ఎవరికీ చెప్పొదని.. దేశభద్రతకు సంబంధించిన వ్యవహారమని హెచ్చరించాడు. తక్షణమే రూ.20 లక్షలు ఆర్బీఐకి చెందిన ఓ ఖాతాకు పంపించాలని సూచించాడు. దాంతో బాధితురాలు తన ఖాతాల్లో నగదు లేదని చెప్పగా.. ఆమె సిబిల్ స్కోర్ తెలుసుకొని వారే ప్రీ అప్రూవ్‌డ్ లోన్ ఇప్పించారు. ఆమె ఖాతాలో లోన్ డబ్బులు పడగానే రూ. 20 లక్షలు కొట్టేశారు.. అక్రమాలకు పాల్పడలేదని తేలితే ఆ డబ్బులు తిరిగి వెనక్కి వస్తాయని నమ్మించి కాల్ కట్ చేశారు. అయితే డబ్బులు తిరిగి రాకపోవడం, ఫోన్ చేస్తే ఏ స్పందన లేకపోవడంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

హైదరాబాద్‌లో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారు

- రాష్ట్రంలో ప్రభుత్వ పాలన అస్తవ్యస్తం
- తిట్టుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ
- వరంగల్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గీసుగొండ, వరంగల్ కల్చరల్, మిల్స్‌కాలనీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో మాత్రం ఇళ్లను కూల్చివేస్తోందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన గీసుగొండ మండలం ధర్మారం వద్ద పార్టీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల సభ్యత్వ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తిట్టుకోవటంలో, దిగజారుడు రాజకీయాల్లో పోటీపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో గత పదేళ్ల బీఆర్ఎస్ కుటుంబ, అహంకార పాలనను తిరస్కరించిన ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే తరహా పాలనను కొనసాగిస్తోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలుకు నిధులు ఎలా సమకూరుస్తారో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. సింగరేణిని ప్రైవేటు పరం చేయాలనే ఆలోచన కేంద్రానికి లేదని స్పష్టం చేశారు. అన్‌పార్లమెంటరీ భాషను వాడే రాజకీయ నాయకులు ఏ స్థాయిలో ఉన్నా వారి వార్తలను మీడియా నిషేధించాలని ఆయన సూచించారు.

భద్రకాళి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు.. ఆశీర్వచనం అందించారు. ఆ తర్వాత కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ భద్రకాళి ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరితే మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. అమ్మవారిని ప్రధాని నరేంద్రమోదీ దర్శించి ఆశీస్సులు తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. మంత్రి వెంట హనుమకొండ, వరంగల్ జిల్లాల బీజేపీ అధ్యక్షులతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భద్రకాళి ఆలయంలో పూజలు చేస్తున్న కిషన్‌రెడ్డి

కొడంగల్.. దశ తిరిగేలా

సొంత నియోజకవర్గంపై రేవంత్ దృష్టి.. రూ.4,358 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

కొడంగల్, అక్టోబరు 14: రాష్ట్రంలో వెనకబడిన ప్రాంతంగా ఉన్న కొడంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. మాజీ సీఎంలు ప్రాతినిధ్యం వహించిన గజ్వేల్, కుప్పం, పులివెందులను తలదన్నేలా సొంత నియోజకవర్గాన్ని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు. అందు కోసం కడా(కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రగతికి శ్రీకారం చుట్టారు. కొడంగల్‌లో మెడికల్, ఇంజనీరింగ్, ఐటీఐ కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పరిశ్రమలు, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల ఏర్పాటుకు రూ.4,358.65 కోట్లు విడుదల చేశారు. వాటితో ఇప్పటికే పలు పనులు ప్రారంభం కాగా, కొన్ని టెండర్ దశలో ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. కొడంగల్, కోస్గి మునిసిపాలిటీల అభివృద్ధికి అదనంగా రూ.400 కోట్లు మంజూరయ్యేందుకు సిద్ధంగా ఉన్నాయి. పలు అభివృద్ధి పనులకు ఫిబ్రవరి 21, 2024న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి కోస్గిలో శంకుస్థాపన చేశారు. కృష్ణా-వికారాబాద్ రైల్వే లైన్ సర్వేతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరేందుకు అడుగు పడింది.

విద్యా కేంద్రంగా అభివృద్ధి..

విద్యలో వెనకబడిన కొడంగల్ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో భాగంగా కొడంగల్ మండల పరిధిలోని అప్పాయిపల్లి శివారులో మెడికల్, పశువైద్య కళాశాలలు, నైపుణ్య అభివృద్ధి కేంద్రం.. కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల, దుద్యాల మండల పరిధిలోని హకీంపేట్‌లో ఐటీఐ కాలేజీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలు, పాత కొడంగల్ పరిధిలో మినీ స్టేడియం, సమీకృత గురుకులాలల ఏర్పాటుకు కసరత్తులు చేపట్టారు.



కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

సాగుకు పెద్ద పీట..

వ్యవసాయంపై ఆధారపడే ఈ ప్రాంత వాసులకు కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకంతో లక్షా 30 వేల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీరందించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందు కోసం రూ.2,945.5 కోట్లు మంజూరు కావడంతో ఆ పనులు కొనసాగుతున్నాయి. పది రిజర్వాయర్లను నిర్మించి ఫేజ్-1లో మూడు నియోజకవర్గాల పరిధిలోని చెరువులను నింపి, ఆయకట్టు పెంచేందుకు కృషి చేస్తున్నారు.

కడా ఏర్పాటుతో పనులు వేగవంతం..

కొడంగల్ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో పనులు వేగవంతం అవుతున్నాయి. సీఎస్ శాంతికుమారి, ఓఎస్డీ చంద్రశేఖర్‌రెడ్డి తదితర రాష్ట్ర స్థాయి అధికారులు, వికారాబాద్, నారాయణపేట కలెక్టర్లు పలు అభివృద్ధి పనులపై సమీక్షలు నిర్వహించారు. దీంతో పాటు ఇటీవల మెడికల్ కళాశాల భూ బాధితులకు పరిహారం అందించి, కాలేజీ పనులకు శ్రీకారం చుట్టారు.

రూ.4,358.65 కోట్లతో అభివృద్ధి షురూ..

కొడంగల్ అభివృద్ధి కోసం ఇప్పటి వరకు రూ.4,358.65 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో నారాయణపేట, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ.2945.5 కోట్లు, పశువైద్య శాల ఏర్పాటుకు రూ.360 కోట్లు, ప్రధాన రోడ్లు, కల్వర్టుల ఏర్పాటుకు రూ.344.5 కోట్లు, ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలకు రూ.6.8కోట్లు.. ప్రభుత్వాసుపత్రిని 50 పడకల నుంచి 220 పడకలుగా మార్చేందుకు, మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలలకు రూ.224.5కోట్లు, నియోజకవర్గంలో ఇతరత్రా 30 పనులకు రూ.213.2కోట్లు.. ఎస్సీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలకు రూ.90కోట్లు, గిరిజన గురుకుల పాఠశాలకు రూ.17.56కోట్లు, కోస్గిలో పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా ఉన్నతీకరించేందుకు రూ.30కోట్లు, కోస్గిలో మహిళా డిగ్రీ కళాశాలకు రూ.11కోట్లు.. బొంరాస్‌పేట్, దౌల్తాబాద్‌లో జూనియర్ కళాశాలలకు రూ.7.13 కోట్లు, కొడంగల్ మునిసిపల్ అభివృద్ధికి రూ.45 కోట్లు, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.18.50 కోట్లు, బురాన్‌పూర్‌లో పూలే బాలికల పాఠశాల, కొడంగల్‌లో అదనపు తరగతి గదుల కోసం రూ.48.45కోట్లు, కడా పరిధిలో ఇతరత్రా పనులకు రూ.16.25కోట్ల మంజూరుతో పనులు ప్రారంభమయ్యాయి.

నల్లగొండకు బైపాస్ రోడ్డు

- ఎన్‌హెచ్ 565పై 14 కి.మీ.. 4 లేన్లతో నకిరేకల్-సాగర్ దారిలో నిర్మాణం
- 'ఎక్స్'లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణం నుంచి వెళుతున్న జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఎన్‌హెచ్-565పై నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ దారిలో బైపాస్ రోడ్డు నిర్మాణం కానుంది. ఈ దారిలో 14 కిలోమీటర్ల మేర 4 లేన్లుగా బైపాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ బైపాస్ రోడ్డు కోసం రూ.516 కోట్లు మంజూరు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఎన్‌హెచ్-565 రహదారి తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌లను కలిపే ముఖ్యమైన జాతీయ రహదారి అని, ఇది తెలంగాణలోని నకిరేకల్ వద్ద ఎన్‌హెచ్-65ని కలుస్తుందని తెలిపారు. ఈ రహదారి నల్లగొండ, మాచర్ల, ఎర్రగొండపాలెం, కనిగిరి వంటి పట్టణాల నుంచి వెళుతుందని గడ్కరీ వివరించారు.
ఈ రోడ్డు నిర్మాణంతో నల్లగొండ పట్టణంలో ట్రాఫిక్ తగ్గడమే కాకుండా, రహదారి భద్రత మెరుగుపడుతుందని, నకిరేకల్-నాగార్జునసాగర్ మధ్య మెరుగైన కనెక్టివిటీకి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కాగా, నల్లగొండకు బైపాస్ రోడ్డు మంజూరు చేయడం పట్ల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎందరో ప్రయాణికుల ప్రాణాలను హరిస్తున్న ట్రాఫిక్ నియంత్రణకు బైపాస్ రోడ్డు ఎంతో కీలకమైనదన్నారు. నల్లగొండ పట్టణానికి ఇబ్బందిగా మారిన ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు బైపాస్ రోడ్డు మంజూరు కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విశేషంగా కృషి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి గడ్కరీ ట్వీట్‌కు కోమటిరెడ్డి రీట్వీట్ చేశారని మంత్రి కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఖజానాకు దసరా కిక్కు!

- నాలుగు రోజుల్లోనే రూ.1000కోట్ల మద్యం అమ్మకాలు
- ఈ నెలలో రూ.1900 కోట్ల విక్రయాలు



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ.. రాష్ట్ర ఖజానాకు భారీ కిక్కు ఇచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. దసరా పండుగ నేపథ్యంలో శుక్ర, శని, ఆది, సోమవారాల్లో ఏకంగా రూ.1000కోట్లపైనే మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది. మొత్తంగా ఈ నెల ప్రారంభం నుంచి 14వ తేదీ వరకు మద్యం అమ్మకాలు రూ. 1900 కోట్లకు చేరుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఈ నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.852కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. ఆ తర్వాత 11వ తేదీ ఒక్క రోజే సుమారుగా రూ.205కోట్ల మేర అమ్మకాలు జరిగినట్లు తేలింది. అంటే.. 11 రోజుల్లోనే రూ.1057 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. ఇక, శని, ఆది, సోమ వారాలకు సంబంధించిన అమ్మకాలపై మంగళవారం మరింత స్పష్టత రానుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మద్యం విక్రయాలు 6.55శాతం పెరిగినట్లు అంచనా వేస్తున్నారు.

ఏపీలో లిక్కర్ షాపులకు 'లాటరీ' పూర్తి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో కేంద్రీకృతంగా మారిన మద్యం వ్యాపారానికి ఇక చెల్లు! కమీషన్లు ఇచ్చిన కంపెనీల సరుకు మాత్రమే విక్రయించిన కాలం పోయింది! 'దుకాణం మాదే... వ్యాపారం మాదే' అంటూ ఐదేళ్లు అమ్మిన 'జే-బ్రాండ్' మద్యం దందాకు మంగళవారమే ఆఖరి రోజు! ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఇక కాలం చెల్లింది! కొత్త మద్యం విధానంలో భాగంగా... బుధవారం నుంచి ప్రైవేటు దుకాణాలు తెరుచుకోనున్నాయి. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా లాటరీ ద్వారా లైసెన్సీల ఎంపిక పూర్తయింది. 'కిక్కు లక్కు' దక్కించుకున్న వారు సంబరాలు చేసుకున్నారు. భారీగా దరఖాస్తులు సమర్పించినా షాపులు దక్కక కొన్ని సిండికేట్లు షాక్ తిన్నాయి. ఒకటి రెండు దరఖాస్తులే వేసినా కొందరిని అదృష్టం వరించింది. రాష్ట్రవ్యాప్తంగా 3396 షాపులకు నోటిఫికేషన్ జారీచేయగా 89,882 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం అన్ని జిల్లాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో లాటరీ ద్వారా లైసెన్సీలను ఎంపిక చేశారు. సాంకేతికంగా చిన్నపాటి పొరపాట్లు మినహా ఎక్కడా గొడవలు, వివాదాలు లేకుండా ప్రక్రియను సజావుగా నిర్వహించారు. మధ్యాహ్నం 3.30గంటల కల్లా మొత్తం షాపులకు లైసెన్సీల ఎంపిక పూర్తయింది.

మరో విగ్రహం ధ్వంసం

సికింద్రాబాద్ కుమ్మరిగూడలో ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం

- దుండగుణ్ని చితకబాదిన స్థానికులు
- హిందూ సంఘాల ఆందోళన
- మతోన్మాద శక్తుల కుట్రే: కిషన్‌రెడ్డి
- ఆలయంపై దాడి దుర్మార్గం: సంజయ్

సికింద్రాబాద్, రెజిమెంటల్‌బజార్, హైదరాబాద్ సిటీ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మరో విగ్రహ ధ్వంసం ఘటన చోటుచేసుకుంది. సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయం సమీపంలోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. పెద్ద శబ్దం రావడంతో మేల్కొన్న స్థానికులు వెంటనే నిందితుణ్ని పట్టుకొని చితకబాదారు. అనంతరం స్థానిక మార్కెట్ పోలీసులు అక్కడికి చేరుకోవడంతో నిందితుణ్ని వారికి అప్పగించారు. అతణ్ని ముంబైకి చెందిన సల్మాన్(30)గా గుర్తించారు. దాడిలో తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం అతణ్ని ఆసుపత్రికి తరలించారు. నిందితుడు మాట్లాడే స్థితిలో లేకపోవడంతో నగరానికి ఎందుకు వచ్చాడో, ఎక్కడ ఉంటున్నాడో, ఈ దుశ్చర్యకు ఒక్కడే పాల్పడ్డాడా, లేక మరి కొందరు కూడా ఉన్నారా? అనే విషయాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. అంతకు ముందు, ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ధ్వంసం సమాచారం తెలియగానే నగర పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఉత్తర మండలంతో పాటు ఇతర జోన్ల నుంచి భారీగా పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈలోపు స్థానిక ప్రజలు, భజరంగ్‌దళ్ తదితర హిందూ ధార్మిక సంఘాల నాయకులు, బీజేపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు ఆలయం వద్దకు చేరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దేవాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకురాలు మాధవీలత కొద్దిసేపు అక్కడ ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఆందోళనకారుల్ని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొంతసేపటికి అక్కడకు చేరుకున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పరిస్థితిని సమీక్షించారు. ఘటనా స్థలాన్ని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాజీ మంత్రి తలసాని తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో హిందూ దేవాలయాలపై వరుస దాడులు మతోన్మాద శక్తుల పనేనని ఆరోపించారు. దర్యాప్తు చేపట్టి దీని వెనుక ఉన్న శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ 200 సంవత్సరాల చరిత్ర కలిగిన ముత్యాలమ్మ గుడిపై దుండగులు దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఈ దేవాలయంపై పిచ్చోళ్లు దాడులు చేశారని పోలీసులు చెప్తున్నారని, మరీ ఆ పిచ్చోళ్లు హిందూ దేవాలయాల మీదనే ఎందుకు దాడి చేస్తున్నారని? ప్రశ్నించారు. ఇలాంటి దాడులు ఇతర మతాలకు సంబంధించిన ఆలయాలపై జరిగితే పరిస్థితి ఇలాగే ఉండేదా? అని మండిపడ్డారు. దాడులు జరిగితే కాంగ్రెస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. తాము వాస్తవాలు మాట్లాడితే బీజేపీ ఉగ్రవాదుల పార్టీ అని మల్లికార్జున ఖర్గే అనడం సిగ్గు చేటన్నారు. ప్రశాంతంగా ఉండే సికింద్రాబాద్‌లో ఇలాంటి ఘటనల వల్ల మత విద్వేషాలకు దారితీసే ప్రమాదం పొంచి ఉందని మాజీ మంత్రి తలసాని ఆందోళన వ్యక్తంచేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. తన సొంత నిధులతో విగ్రహాన్ని పునర్నిర్మిస్తానని ప్రకటించారు. దాడిని ఎంపీలు ఈటల, లక్ష్మణ్ ఖండించారు. ఆలయ ఘటనపై ఎంఐఎం పార్టీ స్పందించింది. దోషులు ఎంతటి వారైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మొయినుద్దీన్ డిమాండ్ చేశారు.



ఆలయం వద్ద గుమిగూడిన జనం

దివ్యాంగులకు జాబ్ పోర్టల్

- బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపై సర్కారు కసరత్తు
- గ్రామీణ రోడ్లకు రూ.1,377 కోట్లు: సీతక్క

హైదరాబాద్/మల్లాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఇకపై కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారికి ఉద్యోగాలు కల్పించేందుకు ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను తీసుకొచ్చామని పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం సచివాలయంలో తెలంగాణ వికలాంగుల జాబ్ పోర్టల్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇతరులతో పోటీ పడేందుకు దివ్యాంగులకు ఎన్నో అవరోధాలు ఉంటాయని.. ఈ నేపథ్యంలోనే వారికి ఉద్యోగాల కల్పనకు యూత్ ఫర్ జాబ్స్ స్వచ్ఛంద సంస్థతో కలిసి vikalangulajobportal.telangana.gov.in జాబ్ పోర్టల్‌ను రూపొందించామన్నారు. ఇందులో రిజిస్టర్ చేసుకుంటే.. వారి అర్హతల ఆధారంగా ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. ప్రైవేటు సంస్థలు సైతం ఉద్యోగాల్లో వారికి రిజర్వేషన్ కల్పించాలని కోరారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల కోటా బ్యాక్‌లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నామని, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాల్లోనూ దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారు. గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1377.66 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. 92 నియోజకవర్గాల పరిధిలో 641 పనులకు అనుమతి దక్కిందని.. గ్రామీణ ప్రాంతాల్లో 1323కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి ఈ నిధులు వినియోగించనున్నట్లు వెల్లడించారు.

బాలామృతం తయారీలో నిర్లక్ష్యమా..?

అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు అందించే బాలామృతం తయారీలో టీజీ ఫుడ్స్ అధికారుల నిర్లక్ష్యంపై సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నాచారం పారిశ్రామికవాడలోని టీజీ ఫుడ్స్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి అపరిశుభ్ర పరిసరాలు, అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు అందించే ఆహారం విషయంలో ఇంత నిర్లక్ష్యమేంటని.. నెల రోజులుగా ప్రాసెసింగ్ యూనిట్ పనిచేయకున్నా పట్టించుకోరా అని మండిపడ్డారు. బాలామృతం నాణ్యతపై ల్యాబ్ నివేదిక అందించాలని ఆదేశించారు. పదేళ్లుగా నూతన యూనిట్ పనులు ముందుకు సాగకపోవడంపై ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించి ప్రక్షాళన చేస్తామని చెప్పారు. కాగా, గాంధీభవన్‌లో మంగళవారం జరగనున్న 'మంత్రితో ముఖాముఖి'లో సీతక్క పాల్గొననున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుంది.. ఇటు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన మంగళ, బుధ వారాల్లో మెదక్, హైదరాబాద్ కాంగ్రెస్ నేతల సమావేశాలు జరగనున్నాయి.

గీతారెడ్డికి రాజీవ్ సద్భావనా అవార్డు

మాజీ మంత్రి జె.గీతారెడ్డి రాజీవ్ గాంధీ సద్భావనా అవార్డుకు ఎంపికయ్యారు. 34వ రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవం సందర్భంగా ఈనెల 19న చార్మినార్ వద్ద నిర్వహించే కార్యక్రమంలో ఆమె ఈ అవార్డు అందుకోనున్నారు. కార్యక్రమంలో పీసీసీ చీఫ్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ పాల్గొననున్నారు. స్వతహాగా బీసీ అయిన ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్లలో బీసీలను ఏమాత్రం పట్టించుకోలేదని కాంగ్రెస్ సీనియర్ నేత హనుమంతరావు విమర్శించారు. కులగణన చేయడం వల్ల పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధిక మెజార్టీ వచ్చే అవకాశముంటుందన్నారు. కులగణన అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా నిలుస్తుందని చెప్పారు. బీసీ రిజర్వేషన్లకు బీఆర్ఎస్, బీజేపీలు వ్యతిరేకమని కాంగ్రెస్ అధికార ప్రతినిధి లింగం యాదవ్ ఆరోపించారు. పార్టీ మ్యానిఫెస్టో హామీ మేరకు కులగణన హామీని నిలబెట్టుకుంటామన్నారు.



సచివాలయంలో సినీ ప్రముఖులతో సమావేశమైన డిప్యూటీ సీఎం భట్టి

సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి సిద్ధం

- అన్ని అంశాలను పరిశీలించాకే గద్దర్ పేరిట అవార్డులు
- అవార్డుల ప్రదాన కార్యక్రమం గొప్ప పండుగలా జరగాలి
- గద్దర్ అవార్డుల కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమకు ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. సచివాలయంలో జరిగిన గద్దర్ సినీ అవార్డుల కమిటీ మొదటి సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరిట సినిమా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. గద్దర్ అవార్డుల ప్రదాన కార్యక్రమం గొప్ప పండుగలా జరగాలని, ఏ తేదీన నిర్వహించాలనేది కమిటీ నిర్ణయం తీసుకోవాలన్నారు. త్వరలో కమిటీ మరోసారి సమావేశమై నిర్ణయాలు తీసుకోవాలని భట్టి సూచించారు. ఈ సందర్భంగా సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కాన్సెప్ట్ అద్భుతంగా ఉందన్నారు. మరోవైపు ప్రభుత్వ స్కిల్ యూనివర్సిటీలో యాక్టింగ్ స్కిల్స్‌ను నేర్పించేందుకు ప్రత్యేక కోర్సును ప్రవేశపెట్టాలని కమిటీ సభ్యులు కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు బి.నర్సింగ్‌రావు, తనికెళ్ల భరణి, దగ్గుబాటి సురేష్ బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, దిల్‌రాజు, హరిశంకర్, వందేమాతరం శ్రీనివాస్, అల్లాని శ్రీధర్, గుమ్మడి విమల తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ పర్యవేక్షణలో కుల గణన

- ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి ప్రకటన

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వెనుకబడిన తరగతుల (బీసీ) కమిషన్ పర్యవేక్షణలో కుల గణన చేపట్టనున్నట్లు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ప్రకటించారు. సోమవారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా సందీప్‌కుమార్ సుల్తానియా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కుల గణనను ప్రారంభించాల్సి ఉందని చెప్పారు. బీసీ కమిషన్ పర్యవేక్షణలోనే కుల గణన సాగుతుందని, నోడల్ శాఖగా గుర్తించిన ప్రణాళిక శాఖ, బీసీ కమిషన్ రెండూ సమన్వయంతో పనిచేస్తాయని అన్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 10 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. దీనిని ఈ నెల 24 నుంచి ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇందులో భాగంగా బీసీల్లోని వివిధ కుల సంఘాలు ఇచ్చే వినతిపత్రాలను కమిషన్ స్వీకరిస్తుంది.

పారిశ్రామిక స్ఫూర్తిని అలవర్చుకోండి

- ఎఫ్‌డీడీఐ స్నాతకోత్సవంలో విద్యార్థులతో గవర్నర్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాదరక్షలు, ఫ్యాషన్, తోలు ఉత్పత్తుల రంగంలో నిలదొక్కుకొనేందుకు సృజనాత్మకతను, పారిశ్రామిక స్ఫూర్తిని అలవర్చుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) 4వ స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత తరుణంలో సృజనాత్మకత కలిగి ఉంటేనే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు వీలవుతుందన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. తాము ఎంచుకున్న రంగంలో నాయకత్వ పాత్రను చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని, ఆయా రంగాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల్లో నాయకత్వం, సృజన, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తేజ్‌లోహిత్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం కోర్సుల అధ్యయనంలో ప్రతిభ, సృజనాత్మకత కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు.

ముగిసిన నర్సింగ్ పోస్టుల దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్‌నర్స్ పోస్టుల దరఖాస్తుల స్వీకరణ సోమవారంతో ముగిసింది. తుది గడువు నాటికి సుమారు 40 వేల దరఖాస్తులు వచ్చినట్లు వైద్యవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సర్కారీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న 2322 పోస్టుల భర్తీకి గత నెల 18న మెడికల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబరు 28 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. నవంబరు మూడో వారంలో రాత పరీక్ష జరగనుంది. ఒక్కో నర్సు పోస్టుకు సగటున 17 మంది పోటీ పడుతున్నారు.

లడ్డూలపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు తొలగించాలి

- నాంపల్లి సిటీ సివిల్ కోర్టులో 'పిల్'

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రామ మందిర ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అయోధ్య పంపిన తిరుమల లడ్డూల్లో జంతువుల కొవ్వు పదార్థాలు కలిశాయంటూ ఏపీ డిప్యూటీ సీఎం కె.పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యల కారణంగా హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొంటూ నాంపల్లి సిటీ సివిల్ కోర్టులో సోమవారం ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. సామాజిక మాధ్యమాల్లోని ఆ వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ న్యాయవాది ఇమ్మనేని రామారావు ఈ పిల్‌ను దాఖలు చేశారు. అయోధ్యకు పంపిన లక్ష లడ్డూల్లో కల్తీ నెయ్యి వినియోగించినట్టు ప్రజల్లో విద్వేషం పెంచేలా పవన్ కళ్యాణ్ ఆధారాలు లేని వ్యాఖ్యలు చేశారని తెలిపారు. మరోసారి పవన్ కళ్యాణ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా నిషేధ (గ్యాగ్) ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో.. కోర్టులో లొంగిపోయిన ప్రధాన నిందితుడు చైతన్య

మంగళగిరి సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడు పానుగంటి చైతన్య సోమవారం మంగళగిరి కోర్టులో లొంగిపోయాడు. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఇతడు ఆ పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి ప్రధాన అనుచరుడు. 2021 అక్టోబరు 19న మంగళగిరి బైపాస్ రోడ్డులోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ నేతలు, కార్యకర్తలు మూక దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో చైతన్య ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు సీసీ ఫుటేజీల్లో ఆధారాలు లభ్యమయ్యాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన చైతన్య.. ముందస్తు వ్యూహం ప్రకారమే మంగళగిరి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి ఎదుట లొంగిపోయాడు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం సోమవారం మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఇదే సమయంలో చైతన్య పోలీసులకు దొరక్కుండా మధ్యాహ్నం 12 గంటల సమయంలో నేరుగా మంగళగిరి కోర్టుకు వెళ్లి వెంటనే తన న్యాయవాది కే.బాజీగంగాధరరావు ద్వారా సరెండర్ పిటిషన్ దాఖలు చేశాడు. అనంతరం చైతన్యకు 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఆదేశాలిచ్చారు.



తమ కుమార్తె వివాహానికి హాజరవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులకు వివాహ ఆహ్వాన పత్రిక అందిస్తున్న జస్టిస్ శ్రవణ్ కుమార్ దంపతులు

ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్, ఏబీఎన్ గ్రూప్ ఆఫ్ నెట్‌వర్క్ లక్ష్యంగా హ్యాకర్ల దాడులు!

- 'సైబర్ క్రైం'లో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఫిర్యాదు
- 'సాక్షి' చానల్‌పై అనుమానాలున్నాయని వెల్లడి
- కేసు నమోదు.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అత్యధిక ప్రజాదరణ పొందిన 'ఆంధ్రజ్యోతి' వెబ్‌సైట్‌తోపాటు ఏబీఎన్ గ్రూప్ ఆఫ్ నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని.. కొందరు హ్యాకింగ్‌కు పాల్పడుతున్నారు. ఈ మేరకు బాధ్యుల్ని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, మొత్తం వ్యవహారంలో 'సాక్షి' చానల్‌పై తమకు సందేహం ఉందని సైబర్ క్రైం పోలీసులకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' హెచ్‌ఆర్ మేనేజర్ బి.మహేందర్ సోమవారం ఫిర్యాదు చేశారు. రెండు నెలలుగా తాము అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అందులో ప్రస్తావించారు. గూగుల్‌లో 'ఆంధ్రజ్యోతి' అని సెర్చ్ చేసినా.. 'సాక్షి' వెబ్‌సైట్‌లోకి తీసుకెళ్తోందని, హ్యాకింగ్ వల్ల ఏబీఎన్ వాట్సాప్ యాప్ చానల్ వేలాది మంది వీక్షకుల్ని కోల్పోయిందని పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్, ఏబీఎన్ గ్రూప్ నెట్‌వర్క్‌ను హ్యాక్ చేసి.. సదరు ట్రాఫిక్‌ను 'సాక్షి'కి మళ్లించడం వల్ల తాము ప్రతి నెలా రూ.50 లక్షల వరకు నష్టపోతున్నట్లు వెల్లడించారు. ఇటీవల ఓబీ వ్యాన్(డీఎస్ఎన్‌జీ) శాటిలైట్ ఫ్రీక్వెన్సీ సైతం హ్యాక్ అయిందని, ఈ అంశంపై ఇప్పటికే ఇస్రోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఓబీ వ్యాన్ హ్యాకింగ్‌పై ఇస్రో విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. హ్యాకింగ్ కారణంగానే వివిధ యాప్ స్టోర్ల నుంచి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి యాప్‌ను డౌన్‌లోడ్ చేయడంలోనూ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు 'ఏబీఎన్ ఎనిమీస్' పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, తీవ్ర పదజాలంతో పోస్టింగ్‌లు పెట్టి సోషల్ మీడియా వేదికగా తమ పరువుకు భంగం కలిగించే కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఈ పరిణామాలన్నింటికి సంబంధించి సాక్షి చానల్‌పై తమకు అనుమానాలున్నాయని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఐటీ యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు.

మేం ఇక్కడే ఉంటాం!

(మొదటిపేజీ తరువాయి)

ఆశ్రయించారు. తాము ప్రస్తుతం పని చేస్తున్న రాష్ట్రంలోనే ఉంటామని, కేంద్రం ఇచ్చిన అస్పష్ట ఆదేశాల (నాన్ స్పీకింగ్ ఆర్డర్)ను కొట్టేయాలని కోరారు. ఈ మేరకు కాట ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, గుమ్మడి సృజన, రొనాల్డ్ రోస్.. క్యాట్‌లో వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీరిలో సృజనను తెలంగాణకు కేటాయించగా.. ప్రస్తుతం ఆమె ఏపీలో పనిచేస్తున్నారు. మిగిలిన నలుగురిని ఏపీకి కేటాయించగా.. వారు తెలంగాణలో పని చేస్తున్నారు. వీరి పిటిషన్లు మంగళవారం లతా బస్వరాజ్ పాట్నే, శాలినీ మిశ్రా బెంచ్ ఎదుట విచారణకు రానున్నాయి. ఉమ్మడి ఏపీ విభజనకు ముందు కొత్తగా ఏర్పడబోయే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల విభజనకు 2014లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యూష్ సిన్హా కమిటీని నియమించింది. ఈ కమిటీ ఇరు రాష్ట్రాలకు అధికారులను కేటాయించింది. అయితే ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. గతంలో తెలంగాణ సీఎస్‌గా పనిచేసిన సోమేశ్‌కుమార్, డీజీపీగా పనిచేసిన అంజనీకుమార్ సహా 15 మంది అధికారులు అప్పట్లో క్యాట్‌ను ఆశ్రయించారు. క్యాట్ సదరు అధికారులకు అనుకూలంగా ఉత్తర్వులు ఇవ్వడంతో అప్పటి నుంచి వారు కేంద్ర కేటాయింపులకు విరుద్ధంగా తెలంగాణ, ఏపీలో కొనసాగుతున్నారు.



కాట ఆమ్రపాలి, వాణీప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్‌రోస్.., గుమ్మడి సృజన

కేంద్రం నిర్ణయమే అంతిమం..!

క్యాట్ ఉత్తర్వులపై డీవోపీటీ (కేంద్రం) హైకోర్టును ఆశ్రయించగా.. అప్పటి చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ తెలంగాణ సీఎస్‌గా ఉన్న సోమేశ్‌కుమార్ కేసును మొదటి కేసుగా తీసుకుని తీర్పు ఇచ్చారు. సోమేశ్‌కుమార్ ఏపీకి వెళ్లాలని, కేంద్రం నిర్ణయమే అంతిమమని తీర్పులో స్పష్టం చేశారు. ఆ తర్వాత మిగతా కేసుల్లో.. కేసుల వారీగా ప్రత్యేక అంశాలు, సమస్యలు ఇమిడి ఉన్నాయని అధికారులు పేర్కొనడంతో అవన్నీ జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి నేతృత్వంలోని డివిజన్ బెంచ్‌కు బదిలీ అయ్యాయి. వాటిపై విచారణ చేపట్టిన జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి ద్విసభ్య ధర్మాసనం.. అధికారులు తమ సమస్యలను వివరిస్తూ కేంద్రానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కేసుల వారీగా వాటిని పరిశీలించి కేంద్రం నిర్ణయం తీసుకోవాలని పేర్కొంటూ పిటిషన్‌లను ముగించింది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అధికారులు.. తమ కేసులను పరిశీలించాలని, తాము ఇక్కడే ఉంటామని పేర్కొంటూ కేంద్రానికి వినతిపత్రాలు అందజేశారు. అయితే వారి విజ్ఞప్తులను కొట్టేస్తూ కేంద్రం తాజాగా ఈ నెల 9న ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడి అధికారులు అక్కడికే వెళ్లిపోవాలని, తొలుత కేటాయించిన రాష్ట్రాల్లోనే ఈ నెల 16న రిపోర్ట్ చేయాలని స్పష్టం చేసింది.

కేంద్రం ఆదేశాలను కొట్టేయాలి..!

తాము ఇన్నేళ్లుగా పనిచేసిన రాష్ట్రాన్ని వదిలేసి కొత్త రాష్ట్రంలో రిపోర్ట్ చేయాలని కేంద్రం పేర్కొనడం సరికాదని, క్యాడర్ విభజనలో పలు లోపాలు ఉన్నాయంటూ ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, సృజన, రొనాల్డ్‌రోస్.. క్యాట్‌లో వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. ఒక్కో అధికారి కేసును ప్రత్యేకంగా పరిశీలించి స్పష్టమైన ఆర్డర్ ఇవ్వాలని హైకోర్టు పేర్కొన్నప్పటికీ.. కేంద్రం నాన్ స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. ఈ ఆదేశాలను కొట్టేయడం ద్వారా తాము ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే మంగళవారం జరగనున్న విచారణలో అధికారులకు అనుకూలంగా క్యాట్ మధ్యంతర ఉత్తర్వులు ఇస్తేనే వారు తెలంగాణలో కొనసాగుతారు. లేదంటే వారంతా తమకు కేటాయించిన రాష్ట్రానికి వెళ్లిపోవాల్సి వస్తుంది. దీంతో మధ్యంతర ఉత్తర్వులు ఇస్తుందా? లేదా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు మరికొందరు అధికారులు కూడా క్యాట్‌లో పిటిషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కొత్త టీచర్లకు నేడు పోస్టింగ్‌లు

- జిల్లా యూనిట్‌గా ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహణ

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులకు మంగళవారం పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ఆయా జిల్లాల్లో ఏర్పాట్లను పూర్తి చేశారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా ప్రభుత్వం భర్తీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 9న ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్రంలో మొత్తం 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే ఇందులో 10,006 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు మంగళవారం జిల్లా యూనిట్‌గా పోస్టింగ్‌లను ఇవ్వనున్నారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు డీఈవో ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో కొత్త ఉపాధ్యాయులంతా ఉదయం ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. ముందుగా స్కూల్ అసిస్టెంట్, పండిట్, వ్యాయామ ఉపాధ్యాయులకు ఉదయం 9.30 గంటలకు కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తారు. తర్వాత మధ్యాహ్నం 12.30 గంటలకు ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. డీఎస్సీలో అభ్యర్థులు సాధించిన మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్‌లో పోస్టింగ్‌లను ఇవ్వనున్నారు. ఒకవేళ ఈ కౌన్సెలింగ్‌కు హాజరుకాని ఉపాధ్యాయులకు మిగిలిపోయిన ఖాళీల్లో పోస్టింగ్‌లను ఇవ్వనున్నారు.

మరిన్ని విభాగాల్లో పెట్టుబడులు పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలన్నారు. ఫాక్స్‌కాన్ అదనపు పెట్టుబడులకు సిద్ధమైతే ఫోర్త్‌సిటీలోనూ భూమి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొన్ని కార్యాచరణ సమస్యలను ఫాక్స్‌కాన్ ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకురాగా.. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అక్కడికక్కడే సంబంధిత అధికారులను రేవంత్ ఆదేశించారు. పక్కనే ఉన్న 66 ఎకరాల స్థలాన్ని కూడా తమకు కేటాయించాలని ఫాక్స్‌కాన్ ప్రతినిధులు కోరగా.. అవసరమైతే ఫోర్త్ సిటీలో మరింత ఎక్కువ స్థలం కేటాయిస్తామన్నారు. ముఖ్యమంత్రి వెంట ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంవో కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ హాల్‌టికెట్లు వచ్చేశాయ్..

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు ఈ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభమయ్యే ఒక రోజు ముందు వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతి అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో మంగళవారం నుంచి రాష్ట్రంలో పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. దసరా సందర్భంగా ఈ నెల 2వ తేదీ నుంచి స్కూళ్లకు సెలవులు ఇచ్చిన విషయం తెలిసిందే. 13 రోజులపాటు ఈ సెలవులు కొనసాగాయి. మంగళవారం నుంచి స్కూళ్లు తిరిగి ప్రారంభంకానున్నాయి.

మాతాజీ నిర్మలాదేవి స్మారక నాణెం విడుదల

సహజ యోగం పేరుతో కొత్త ధ్యాన పద్ధతిని ప్రపంచానికి పరిచయం చేసిన మాతాజీ నిర్మలాదేవి జన్మ శతాబ్ది సందర్భంగా స్మారక నాణెం విడుదలైంది. ఢిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దీన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాతాజీ సేవలను మంత్రి కొనియాడారు. సహజ యోగం ద్వారా దేశం పేరును ప్రపంచానికి చాటి చెప్పారని ప్రశంసించారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం.. నేటి నుంచి డిగ్రీ కాలేజీల బంద్


పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 15వ తేదీ నుంచి బంద్ పాటించాలని ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఈమేరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వల్ల కాలేజీల ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించలేక, భవనాలకు అద్దె కట్టలేక, కరెంటు బిల్లులను కూడా చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే భారీగా అప్పులు చేసినట్టు గుర్తుచేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో బంద్‌కు వెళుతున్నట్టు వెల్లడించారు.

నేవీ రాడార్ స్టేషన్‌కు అంకురార్పణ నేడే

దామగుండంలో నేవీ, రక్షణ శాఖ ఏర్పాట్లు .. శంకుస్థాపన చేయనున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

- హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు
- 14 ఏళ్ల తర్వాత ఈ ప్రాజెక్టుకు మోక్షం

పరిగి, అక్టోబరు 14: ఎట్టకేలకు నేవీ రాడార్ స్టేషన్‌కు మంగళవారం పునాది రాయి పడబోతోంది. హైదరాబాద్‌కు 60 కి.మీ. దూరాన, సముద్ర మట్టానికి 360 అడుగుల ఎత్తులో ఉన్న వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవుల్లో దీనికి అంకురార్పణ జరుగనుంది. మంగళవారం మధ్యాహ్నం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శంకుస్థాపన చేయనున్నారు. గౌరవ అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, నేవీ, రక్షణశాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర నేవీ, రక్షణ శాఖ అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు పూర్తి చేశారు. దామగుండం అడవుల్లో రాడార్ స్టేషన్ ఏర్పాటు చేయాలని 2010-11లో నేవీ శాఖ నిర్ణయించింది. అనేక అవాంతరాల నడుమ ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు పర్యావరణం, అటవీ, దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు, కాలుష్య నియంత్రణ బోర్డు తదితర 16 రకాల అనుమతులతోపాటు, రాష్ట్ర ప్రభుత్వ క్లియరెన్స్‌లన్నీ లభించాయి. ఈ ప్రాంతంలోని రిజర్వ్ ఫారెస్టు ఆధీనంలో ఉన్న 2,935 ఎకరాల భూములను సీఎం సమక్షంలో అటవీ అధికారులు జనవరి 24న నేవీ శాఖకు అప్పగించారు. దీంతో 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఈ ప్రాజెక్టుకు ఎట్టకేలకు ఇప్పుడు మోక్షం లభించింది.



నేవీ రాడార్ స్టేషన్ నమూనా

రూ.3200 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం

ఈ ప్రాజెక్టుకు ఏర్పాటుకు అంచనా వ్యయం మొదట్లో రూ.1900 కోట్లు తర్వాత రూ.2500 కోట్లకు చేరింది. తాజా అంచనాల ప్రకారం రూ.3200 కోట్లకు పెరిగిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. 2010-12లో ప్రాజెక్టు ప్రక్రియ ప్రారంభం కాగా, 2015లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక అంచనాకు రాగా, భూముల కేటాయింపు విషయంలోనే జాప్యం జరుగుతూ వచ్చింది. చివరికి మార్గం సుగమమైంది.

భారీ బందోబస్తు

నేవీ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు వస్తున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. వేదిక వద్ద కేంద్ర రక్షణ, నేవీ శాఖలతో పాటు ప్రత్యేక కమాండోలతో రక్షణ వలయం ఏర్పాటు చేయగా, బయట బందోబస్తు కోసం భారీగా పోలీసులను మోహరించనున్నారు. 400 మందికి పైగానే ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలోకి దించారు. సభా ప్రాంగణంలో 500 మంది మాత్రమే కూర్చునేలా, మరో 200 మందికి వెసులుబాటు కల్పించేలా ఏర్పాట్లు చేశారు. బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పోలీసు సిబ్బందితో సమీక్షించి తగిన సూచనలు చేశారు.

74 టీఎంసీలు కేటాయించలేం!

గోదావరి-కావేరి అనుసంధానం తొలి దశలో కష్టం

- రెండో దశలోనే నీటి లభ్యత పెరుగుతుంది
- తెలంగాణకు తేల్చిచెప్పిన కేంద్రం
- అభ్యంతరాలను తోసిపుచ్చుతూ ఎన్‌డబ్ల్యూడీఏ లేఖ

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల్లో 74 టీఎంసీల నీటిని కేటాయించాలన్న తెలంగాణ విజ్ఞప్తిని జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) తోసిపుచ్చింది. తొలి దశలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వినియోగించుకోని వాటాను మాత్రమే తరలిస్తున్నామని, అందువల్ల రాష్ట్రాలు కోరినంత మేర నీటిని పంచలేమని తెలిపింది. రెండో దశలో మహానది-గోదావరి అనుసంధానం తర్వాతే నీటి లభ్యత పెరుగుతుందని గుర్తుచేసింది. ఈ మేరకు ఎన్‌డబ్ల్యూడీఏ సంప్రదింపుల కమిటీ సమావేశంలో తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై రాష్ట్రానికి లేఖ రాసింది. గోదావరి-కావేరి అనుసంధానంలో తొలి దశలో తరలించే 148 టీఎంసీల్లో 16 టీఎంసీలను కర్ణాటకకు కేటాయిస్తూ.. ఆ నీటిని కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టి రిజర్వాయర్ నుంచి తరలించడానికి (వాడుకోవడానికి) వెసులుబాటు కల్పిస్తే దాని దిగువన ఉన్న జూరాల, శ్రీశైలం జలాశయాలపై ప్రభావం తీవ్రంగా ఉంటుందన్న తెలంగాణ అభ్యంతరాలను కూడా తోసిపుచ్చింది. జూలై నుంచి అక్టోబరు మధ్యలోనే ఈ నీటి తరలింపు ఉంటుందని గుర్తు చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంలో నాగార్జునసాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా చూపించారు. తెలుగు రాష్ట్రాలకు కృష్ణా ట్రైబ్యునల్-2 కేటాయించిన 1050 టీఎంసీల జలాలను పంచే బాధ్యతను కేంద్రం జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌కు అప్పగించింది. 1050 టీఎంసీలను తెలుగు రాష్ట్రాలకు ట్రైబ్యునల్ పంచేదాకా సాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా చూపించరాదని, కృష్ణా జలాల్లో వాటా తేలిన తర్వాత సిమ్యులేషన్ స్టడీ (సమగ్ర నీటి అధ్యయనం) చేసి, ఇబ్బందుల్లేవని తేలితేనే ముందుకెళ్లాలన్న తెలంగాణ అభ్యంతరాలపై ఎన్‌డబ్ల్యూడీఏ స్పందిస్తూ.. నాగార్జునసాగర్ ప్రస్తుతం ఆన్‌లైన్ (గోదావరి-కావేరి అనుసంధానం దారిలో ఉండే) రిజర్వాయర్‌గా ప్రతిపాదనల దశలోనే ఉందని తెలిపింది. కృష్ణా ట్రైబ్యునల్ నీటి కేటాయింపులపై ఎలాంటి ప్రభావం చూపకుండా పరస్పర అంగీకారంతోనే ముందుకు వెళతామని గుర్తు చేసింది. ఇక కర్ణాటకలోని బెడ్తి-వారాదా లింక్‌లో తరలించే నీటిలో 50 శాతం వాటా ఇవ్వాలని తెలంగాణ పెట్టుకున్న విజ్ఞప్తిపై స్పందిస్తూ.. ప్రస్తుతం ఈ లింక్ ప్రతిపాదన దశలోనే ఉందని, ఒప్పందం కుదిరిన తర్వాత దీనిపై నిర్ణయం ఉంటుందని పేర్కొంది. గోదావరి-కావేరి అనుసంధానంలో సమ్మక్కసాగర్(తుపాకులగూడెం) బ్యారేజీలో 83 మీటర్ల పైన, 87 మీటర్ల మధ్యలో ఉండే నీటిని మాత్రమే తరలిస్తామని ఎన్‌డబ్ల్యూడీఏ గుర్తు చేసింది. అంతేకాకుండా గోదావరి-కావేరి అనుసంధానంలో తెలంగాణకు కేటాయించే 45 టీఎంసీల నీటి నిల్వ కోసం రెండుచోట్ల రిజర్వాయర్ల నిర్మాణానికి కూడా అంగీకరించింది.

పోడు రైతులకు సర్కారు అండ..

- ఉచితంగా బోర్లతో పాటు విద్యుత్తు సౌకర్యం
- ఇందిరమ్మ రాజ్యంలో పల్లెల అభివృద్ధి: తుమ్మల

రఘునాథపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోడు రైతులకు కాంగ్రెస్ సర్కారు అండగా ఉంటుందని, పోడు సాగు కోసం డ్రిప్ పథకాలు, ఉచితంగా బోర్లు, విద్యుత్తు సౌకర్యాలను కల్పించి ఆదుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని మారుమూల గ్రామాలైనా రజబ్‌అలీనగర్, పంగిడి, ఎస్సీ బంజర పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులకు సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వ హయాంలో అటవీ హక్కుల చట్టాన్ని రూపొందించి పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు ఉచితంగా హక్కు పత్రాలను పంపిణీ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతులు, ప్రజల పక్షాన నిలబడుతుందని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో పోడు రైతులకు అటవీశాఖ నుంచి సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో వ్యవసాయ బోర్లు, విద్యుత్తు కనెక్షన్ల మంజూరు ఇబ్బందిగా ఉందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని వాటిని పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రఘునాథపాలెం మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. నాగార్జునసాగర్ జలాలతో మండలంలో సాగు నీటి కొరత తీరుస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ ఉద్యమకారుడు అంశుల సత్యనారాయణ మృతి

- 35 ఏళ్లుగా ఫ్లోరైడ్ సమస్యలపై పోరాటాలు
- రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులకు అనేక వినతులు
- నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో విషాదం



మర్రిగూడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరైడ్ రక్కసిపై అలుపెరగని ఉద్యమాలు చేసిన అంశుల సత్యనారాయణ(75) మృతి చెందారు. నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్వగ్రామం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెంలో కన్నుమూశారు. సత్యనారాయణ క్షౌర వృత్తితో జీవనం సాగించేవారు. సత్యనారాయణకు వెంకటమ్మతో వివాహం కాగా తొలుత కుమార్తె జన్మించింది. పుట్టుకతోనే ఫ్లోరైడ్ బాధితురాలు కావటంతో ఆమె ఏడేళ్ల వయసులో మృతి చెందింది. కుమారుడు స్వామి కూడా పుట్టుకతో ఫ్లోరైడ్ బాధితుడు. మూడో సంతానమైన రాజేశ్వరికి ఫ్లోరైడ్ లక్షణాలు రాకపోవడంతో ఆమెకు వివాహం చేసి అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నారు. శివన్నగూడెం గ్రామస్థులు ఎనిమిది దశాబ్దాలుగా ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్నారు. గ్రామంలో 4,370 మంది ఉండగా, 320మంది ఫ్లోరైడ్ పీడితులు ఉన్నారు. ఫ్లోరైడ్‌తో బాధపడుతూ 30 మంది మృతిచెందారు. కుమారుడు స్వామితో కలిసి 35 ఏళ్లుగా ఫ్లోరైడ్ రక్కసిపై వివిధ రూపాల్లో సత్యనారాయణ ఉద్యమించారు. ఫ్లోరైడ్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ కంచుకట్ల సుభాష్‌తో కలిసి రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, కేంద్రమంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఫ్లోరైడ్ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించగా.. 2021లో స్థల పరిశీలనకు వెళ్తూ మర్రిగూడకు వచ్చిన అప్పటి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాను కలిసిన సత్యనారాయణ ఫ్లోరైడ్ బాధితుల సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఇదిలా ఉండగా.. కుమారుడు స్వామి(37)అనారోగ్యంతో బాధపడుతూ 2022 జనవరిలో మృతిచెందడంతో సత్యనారాయణ మానసికంగా కుంగిపోయారు. అప్పటినుంచి నరాల సంబంధిత సమస్యతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన సత్యనారాయణ సోమవారం మృతి చెందారు. ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ కంచుకట్ల సుభాష్, జలసాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, జిల్లా బాలల సమితి సభ్యుడు ఈద భాస్కర్ తదితరులు సత్యనారాయణ మృతదేహానికి నివాళులర్పించారు. ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారానికి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్న సత్యనారాయణ సేవలు మరువలేనివని, ఆయన మృతి ఫ్లోరైడ్ ఉద్యమానికి తీరని లోటని అన్నారు. సత్యనారాయణ భార్య వెంకటమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా, కుమార్తె, అల్లుడు ఆమె బాగోగులు చూసుకుంటున్నారు.

పాపికొండల విహారయాత్ర షురూ

టికెట్ ధర పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750.. ఆరు నెలల పాటు సాగనున్న పర్యాటక యాత్ర

- తెలంగాణ పర్యాటక వెబ్‌సైట్‌లో బోటింగ్ టికెట్లు
- గుర్తింపు కార్డులు తప్పనిసరి
- లాంచీల్లో మద్య నిషేధం అమలు
- శాకాహార భోజనానికే అనుమతి



భద్రాచలం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ పాపికొండల పర్యాటక సందడి మొదలైంది. వరదల సీజన్ ముగియడంతో ఏపీలోని కాకినాడ పోర్టు అధికారులు పర్యాటక సీజన్‌కు పచ్చజెండా ఊపారు. పాపికొండల లాంచీల నిర్వాహకులు దసరా సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి లాంఛనంగా పాపికొండల విహారయాత్రను పునఃప్రారంభించారు. దీంతో గత రెండు రోజులుగా ఏపీలోని ఏఎస్ఆర్ జిల్లా వరరామచంద్రాపురం మండలం పోచవరం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.

ఆరు నెలల పాటు సాగనున్న విహారయాత్ర

జూలై నుంచి ఇటీవల వరకు గోదావరి వరదల కారణంగా పాపికొండల విహారయాత్రను నిలిపివేశారు. ప్రస్తుతం గోదావరికి వరదల కాలం పూర్తికావడంతో పాపికొండల పర్యాటక యాత్రను పునరుద్ధరించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి పాపికొండ యాత్రకు వెళ్లేందుకు పర్యాటకులు ఎంతో ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. ఈ క్రమంలో తెలంగాణలోని భద్రాచలం ప్రాంతం నుంచి పాపికొండల యాత్రకు వెళ్లే పర్యాటకుల కోసం తెలంగాణ పర్యాటక వెబ్‌సైట్‌లో బోటింగ్ టికెట్లు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750 చొప్పున టికెట్ ధర నిర్ణయించగా భద్రాచలం నుంచి ఏపీలోని వరరామచంద్రపురం మండలం పోచారం వరకు వాహనంలో ఒక్కొక్కరిని తీసుకెళ్లి, తీసుకొచ్చేందుకు రూ.300 చెల్లించాల్సి ఉంటుందని స్థానిక నిర్వాహకులు తెలిపారు. భద్రాచలం కేంద్రంగా పలువురు ఏజెంట్ల వద్ద టికెట్లు అందుబాటులో ఉంటాయని, ఆసక్తి గలవారు పాపికొండల విహారయాత్ర టికెట్లను కొనుగోలు చేయవచ్చని సూచించారు. పాపికొండల విహారయాత్ర ఏప్రిల్ వరకు కొనసాగనుంది.

రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి

గతంలో పాపికొండల విహారయాత్రలో గోదావరిలో జరిగిన పలు ప్రమాదాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి రక్షణ చర్యలతో పాపికొండల విహారయాత్ర నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. లాంచీలో వెళ్లే పర్యాటకులు ముందుగా తమ గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. అలాగే పర్యాటకులు లైఫ్ జాకెట్లను తప్పక ధరించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలతో లాంచీలో పూర్తిగా మద్యాన్ని నిషేధించారు. కేవలం శాకాహార భోజనం మాత్రమే అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇలా ఉండగా బోటు ప్రారంభమయ్యే సమయంలో రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల శాఖ, పోర్టు అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి అనుమతి ఇస్తేనే లాంచీ విహారయాత్రకు బయలుదేరుతుంది.

తెలంగాణ వైపు నుంచి వెళ్లాలంటే ఇలా..

హైదరాబాద్ నుంచి ఖమ్మం మీదుగా భద్రాచలానికి వెళ్లాలి. అక్కడ నుంచి నెల్లిపాక, కూనవరం మీదుగా వరరామచంద్రాపురం మండలం పోచవరం వరకు 80కి.మీ వాహనంలో ప్రయాణించి అక్కడ గోదావరి ఒడ్డున లాంచీల్లోకి ఎక్కి విహారయాత్రకు వెళ్లి మళ్లీ అక్కడికే రావాల్సి ఉంటుంది.

రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్‌కు సిబ్బందిని ఎందుకు కేటాయించలేదు?

- మున్సిపల్ అధికారులపై సీఎం రేవంత్ ఆగ్రహం
- తక్షణమే పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశం
- సిబ్బందిని కేటాయిస్తూ నేడు ఉత్తర్వులు జారీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రెరా) ప్రాజెక్టుల విషయంలో తీసుకునే నిర్ణయాలను సవాల్ చేసేందుకు అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసినా.. దాని కార్యాచరణ ప్రారంభం కాని వైనంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. 'రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉన్నట్టేనా?' అనే శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై పురపాలక శాఖ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. నాలుగు నెలలైనా ట్రిబ్యునల్‌కు సిబ్బందిని కేటాయించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం.. తక్షణమే రెరా ట్రిబ్యునల్ పని ప్రారంభించేలా సిబ్బందిని కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్‌ను ఆదేశించారు. ప్రస్తుతానికి సిబ్బంది నియామకం ఉత్తర్వులు ఇచ్చి.. వచ్చే మంత్రివర్గ సమావేశంలో దీనిపై అనుమతి తీసుకునేలా కార్యాచరణ చేయాలని సూచించారు. కాగా, రెరా ట్రిబ్యునల్‌కు కావాల్సిన సిబ్బందిని కేటాయిస్తూ సోమవారమే ప్రభుత్వం ఉత్తర్వులను సిద్ధం చేసింది. సీఎం రేవంత్‌తో పాటు పురపాలక శాఖ ఉన్నతాధికారులు పరిశ్రమ ప్రారంభానికి వెళ్లడంతో వీలు కాలేదని తెలిసింది. మంగళవారం ఉత్తర్వులు వెలువడితే ఆ వెంటనే ట్రిబ్యునల్ ఏర్పాటును నోటిఫై చేస్తూ ప్రకటన జారీ చేసి బుధవారం నుంచి విచారణ చేపట్టేలా ట్రిబ్యునల్ సన్నద్ధమైందని తెలిసింది. అప్పిలేట్‌కు వచ్చిన కేసులను దశలవారీగా విచారణ చేపట్టి పరిష్కరించనున్నారు. మరోవైపు ఇన్నాళ్లూ సిబ్బంది కావాలని ట్రిబ్యునల్ కోరినా.. ప్రభుత్వం నుంచి సరైన స్పందన కొరవడింది. అయితే, 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవడంతో వివిధ ప్రాజెక్టుల యజమానులు హర్షం వ్యక్తం చేశారు.

మేడిగడ్డకు మళ్లీ పరీక్షలు!

- అన్నారం, సుందిళ్లకు కూడా..
- వరద తగ్గిన తర్వాత పరీక్షలు చేసి, రిపోర్టులు ఇస్తేనే ఎన్‌డీఎస్ఏ నివేదిక
- తేల్చిచెప్పిన నిపుణుల కమిటీ

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు వరద తగ్గుముఖం పట్టాక మళ్లీ పరీక్షలు చేయాలని 'జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ)' నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ఆ పరీక్షల ఫలితాలు వస్తేనే బ్యారేజీల భవితవ్యంపై పూర్తి నివేదికను అందించగలమని తేల్చిచెప్పింది. ఇటీవలే తుది నివేదిక కోసం ఢిల్లీలో నిపుణుల కమిటీతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు అధికారుల బృందం సమావేశమైన విషయం తెలిసిందే. బ్యారేజీల పునరుద్ధరణపై తుది నివేదికను అందించాలని మంత్రితో పాటు అధికారులు పదేపదే విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది. పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి, ఫలితాలు అందించకపోతే నివేదికలు ఇవ్వలేమని ఎన్‌డీఎస్ఏ పునరుద్ఘాటించింది. కాగా, అన్నారం, సుందిళ్లలో నీటి నిల్వకు ఎన్‌డీఎస్ఏ అనుమతి ఇస్తే కన్నెపల్లి పంప్‌హౌస్‌కు కొద్దిదూరంలో మట్టికట్ట కట్టి, దానిపై జియోట్యూబ్‌లతో రక్షణ కల్పించి, నీటిని నిలిపివేయడం ద్వారా అన్నారంలోకి, ఆ తర్వాత సుందిళ్లలోకి పంపింగ్ చేసి, రబీతో పాటు తాగునీటి అవసరాలు తీర్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే డిసెంబరు దాకా నివేదిక ఇచ్చేదే లేదని ఎన్‌డీఎస్ఏ తేల్చిచెప్పడం రాష్ట్రానికి ఇబ్బందికరంగా మారింది. ఇక ఇప్పటికిప్పుడు పరీక్షలు చేసే పరిస్థితులు కూడా లేవు. సుందిళ్లకు 9131 క్యూసెక్కులు, అన్నారం బ్యారేజీకి 5907 క్యూసెక్కులు, మేడిగడ్డకు 83,330 క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ వరద ఇప్పట్లో తగ్గే అవకాశాల్లేవు. దీంతో వరద తగ్గితే అధికారులు నవంబరులో పరీక్షలకు ఉపక్రమించే అవకాశాలున్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల అధ్యయన బాధ్యతను ఎన్‌డీఎస్ఏకు అప్పగించి, ప్రభుత్వం ఇరకాటంలో పడిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఎగువ, దిగువ భాగంలో 8 నుంచి 9 మీటర్ల లోతులో డయాఫ్రం వాల్ మాదిరిగా ఆర్‌సీసీ లేదా షీట్‌పైల్స్‌తో కటాఫ్ వేస్తే సీపేజీలు తగ్గుముఖం పడతాయని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఆ తర్వాత బ్యారేజీల్లో పంప్‌హౌస్‌ల హెడ్‌లకు అందినంత మేర నీటి నిల్వలు చేసుకుంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిక్షేపంగా ఉంటాయని పేర్కొంటున్నారు. షీట్‌పైల్స్‌తో యుద్ధప్రాతిపదికన కటాఫ్‌లు వేసుకోవడం మేలని సూచిస్తున్నారు. అయితే ఎన్‌డీఎస్ఏ నివేదికపై ఆధారపడితే రబీలో సమస్యలు తప్పవనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీకి బాధ్యతలు అప్పగించడంతో ప్రభుత్వం బద్నాం అయ్యే పరిస్థితి ఏర్పడిందని పలువురు అధికారులు గుర్తుచేస్తున్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*